




తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శుక్రవారం 27.03.2026 | సంపుటి :12 సంచిక : 247 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370








హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్




## దావోస్ ఒప్పందాలపై శ్వేతపత్రం విడుదల సిద్ధం

- పర్యటనలో తెలంగాణకు రూ.2.19 లక్షల కోట్ల పెట్టుబడులు
- పలు కంపెనీలతో ప్రభుత్వం 44 ఎంవోయూలు
- విపక్షాల విమర్శలను తిప్పికొట్టిన శ్రీధర్ బాబు

## మధ్యాహ్న భోజన మెనూలో చేపలు

- పౌష్టికాహారంపై ప్రభుత్వం కీలక నిర్ణయం
- అసెంబ్లీలో ప్రకటించిన మంత్రి వాకిటి శ్రీహరి

## జీఎస్టీ సవరణ బిల్లుకు సభ ఆమోదం

అధికారుల హోదాల పునర్వ్యవస్థీకరించిన ప్రభుత్వం

వివరాలు 2లో..

## ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగంపై మరో ముందడుగు

- డీపీఆర్‌కు చర్యలు తీసుకుంటున్నాం
- కోమటిరెడ్డికి నితిన్ గడ్కరీ లేఖ

2లో

## నేపాల్ ప్రధానిగా బాలెన్

ప్రమాణ స్వీకారానికి అంతా సిద్ధం

9

# పేదల వైద్యం అత్యంత ప్రాధాన్యం

**ఆరోగ్యశ్రీ బకాయిలు రూ.2,408 కోట్లు చెల్లించాం**

**గత ప్రభుత్వం రూ. 600 కోట్ల బకాయిలు పెట్టి వెళ్లింది**

రాజీవ్ ఆరోగ్యశ్రీ బకాయిల కింద గత ప్రభుత్వం నుంచి మాకు వారసత్వంగా వచ్చిన భారం రూ.60 కోట్లు.ఇప్పటివరకు రూ.2408.51 కోట్లు మన ప్రభుత్వం చెల్లించింది. ప్రభుత్వ ఆస్పత్రులకు రూ.927 కోట్లు చెల్లించాం. ప్రైవేటు ఆస్పత్రులకు రూ.1,480 కోట్లు చెల్లించాం. ప్రతి కుటుంబానికి జీవిత బీమా అందించేందుకు కొత్త పథకం తీసుకొచ్చాం. గతంలో సీఎంఆర్ ఎఫ్ చెక్కుల విషయంలో అవినీతి జరిగింది. సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు ఎలా దుర్వినియోగం జరిగిందో విచారణ జరుగుతోంది"

- సీఎం రేవంత్ రెడ్డి

- విద్య,వైద్యానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాం
- సీఎంఆర్‌ఎఫ్ నిధులను దుర్వినియోగం చేశారు
- అన్ని బాగోతాలు బయటపెట్టబోతున్నాం
- అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరణ

**హైదరాబాద్(జనంసాక్షి):**గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకానికి రూ.600 కోట్లు బకాయిలు పెట్టి వెళ్తే తాము ప్రతినెలా రూ.89 కోట్లు ఖర్చు పెడుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఇప్పటివరకు రూ.2,408 కోట్ల బిల్లులు చెల్లించామని అసెంబ్లీ సాక్షిగా తెలిపారు. ఏడో రోజైన గురువారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సభలో సీఎం రేవంత్ ప్రసంగించారు. ఆరోగ్య శ్రీ కింద ప్రభుత్వాసు పత్రులకు రూ.927 కోట్లు, ప్రైవేట్ ఆస్పత్రులకు రూ.1,480 కోట్లు చెల్లించామని చెప్పుకొచ్చారు. 27 నెలల్లో పేదల వైద్యం కోసం రూ.4,500 కోట్లు చెల్లించామని ఆయన వివరించారు. పేదలకు అన్యాయం జరుగుతోందని విపక్షాలు అపోహలు సృష్టిస్తున్నాయని.. బీఆర్ఎస్ గత ప్రభుత్వంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఎలా దుర్వినియోగం చేశారో అందరికీ తెలుసంటూ విమర్శించారు. ఎవరి పీఏలు సీఎం రిలీఫ్ ఫండ్ కాజేశారో కూడా తెలుసంటూ చురకలు అంటించారు. గత ప్రభుత్వంలో సీఎంఆర్‌ఎఫ్ నిధులను కొందరు తమ సొంత ఖాతాల్లో వేసుకున్నారని, దీనిపై విచారణ జరుగుతోందన్నారు. త్వరలోనే అన్నీ బయటకు వస్తాయని హెచ్చరించారు. తాము అధికారంలోకి వచ్చాక 27 నెలల్లో రూ.2,046 కోట్ల సీఎంఆర్‌ఎఫ్ కింద ఇచ్చామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం అప్పుల భారాన్ని తమకు వారసత్వంగా ఇచ్చిందని, ఆ బకాయిలను తామే చెల్లిస్తున్నామని రేవంత్ రెడ్డి చెప్పారు. బీఆర్ఎస్ గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కోసం నెలకు రూ.52 కోట్లు ఖర్చు చేస్తే..

మిగతా 2లో..



## సీఎస్ఆర్ నిధుల సమీకరణ, వినియోగానికి ప్రత్యేక విధానం

- అభివృద్ధి, ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టే కార్పొరేట్ సంస్థలను ప్రభుత్వం తరపున అభినందించాలి
- తెలంగాణలో కంపెనీలు ఏర్పాటు చేసి, సీఎస్ఆర్ నిధులను వేరేచోట ఖర్చు పెడితే ఎలా?
- ఇప్పటివరకు వచ్చిన నిధులు ఆశించిన స్థాయిలో లేవు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

వార్త 2 లో



# ఏప్రిల్ 2నుంచి ఇంటిగ్రేటెడ్ భూభారతి

**రాష్ట్రవ్యాప్తంగా 5 మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు**

- సర్వే నుంచి రిజిస్ట్రేషన్ వరకు.. అంతా ఒకే గొడుగు కిందకు
- ఒకే క్లిక్‌తో సమస్త భూ సమాచారం
- ప్రతి సర్వేనెంబర్‌కు భూధార్ నెంబర్
- వివరాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణ భూ పరిపాలనలో సరికొత్త శకం ఆరంభం కాబోతోందని గత ప్రభుత్వ హయాంలో ధరణి తెచ్చిన చిక్కుముడులను విప్పుతూ, రైతులకు అత్యంత పారదర్శకంగా, సులభతరమైన సేవలు అందించడమే లక్ష్యంగా కొత్తగా రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ( ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ల్యాండ్ రికార్డ్స్ మేనేజిమెంట్ సిస్టమ్) ను ఏప్రిల్ 2వ తేదీ నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. గురువారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో రెవెన్యూ, సర్వే, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ , ఎన్ఐసి అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిఆలోచన మేరకు తెలంగాణ ప్ర జల ఆశలు, ఆకాంక్షలకు

మిగతా 3లో..

## పెట్రోలియం నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి



- దేశంలో ఇంధనానికి కొరత లేదు..
- 60 రోజులకు సరిపడా స్టాక్ ఉంది
- ప్రజలు ఆందోళన చెందొద్దు: కేంద్రం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దేశంలో పెట్రోల్, డీజిల్‌కు కొరత లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేసింది. 60 రోజులకు సరిపడా స్టాక్ ఉందని తెలిపింది. పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీకి కొరత ఉందంటూ జరుగుతున్న ప్రచారాన్ని కొట్టి పారేసింది. తప్పుదోవ పట్టించేలా ప్రచారం జరుగుతోందని ఆందోళన వ్యక్తంచేసింది. దేశవ్యాప్తంగా ఉన్నట్లుండి పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు బారులుతీరుతున్న

మిగతా 2లో..


## నేడు అన్ని రాష్ట్రాల సీఎంలతో ప్రధాని మోదీ భేటీ

పశ్చిమాసియా ఉద్రిక్తతలు, దేశంలో ఇంధన సరఫరాపై ముఖ్యమంత్రులకు వివరించే అవకాశం

2లో

# అగ్నికీలల మారణహోమం

- టిప్పర్‌ను ఢీకొని మంటల్లో దగ్ధమైన ప్రైవేటు ట్రావెల్ బస్సు
- ఘోర దుర్ఘటనలో 13 మంది ప్రయాణికుల దుర్మరణం
- పలువురికి గాయాలు
- మార్కాపురం వద్ద ఘోర బస్సు ప్రమాదం





దుర్ఘటన సమయంలో బస్సు,లారీ నుంచి ఎగిసిపడుతున్న మంటలు

మార్కాపురం జిల్లాలోని రాయవరం సమీపంలో పలకల క్వారీల వద్ద చోటు చేసుకున్న ప్రమాద దృశ్యం

- ప్రమాదం ఘటనపై ప్రధాని మోదీ, ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి
- మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.5 వేల పరిహారం ప్రకటించిన ప్రధాని
- మృతులు కుటుంబాలకు సంతాపం..

**మార్కాపురం(జనంసాక్షి):**మార్కాపురం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రాయవరం సమీపంలో పలకల క్వారీల వద్ద టిప్పర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. దీంతో బస్సుతో పాటు టిప్పర్‌లోనూ మంటలు చెలరేగాయి. ప్రమాదంలో బస్సులోని 13 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. వారి మృతదేహాలను వెలికితీశారు. మరో 28 మందికి గాయాలయ్యాయి. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదంతో బస్సు, టిప్పర్ పూర్తిగా దగ్ధమయ్యాయి. బస్సును హరికృష్ణ ట్రావెల్స్‌కు చెందినదిగా గుర్తించారు. గురువారం తెల్లవారు జామున ఆరుగంటల సమయంలో ఈ ఘోరం జరిగింది.

మిగతా 2లో..



## తెరుచుకున్న హార్ముజ్

భారత్‌తో సహా మిత్రదేశాలకు జలసంధి గుండా సరుకు రావాణాకు ఇరాన్ అనుమతి

**టెహ్రాన్(జనంసాక్షి):**భారత్‌తో సహా మిత్ర దేశాలకు హోర్ముజ్ జలసంధిని తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. హోర్ముజ్ ద్వారా సరుకు రవాణా నౌకల రాకపోకలకు అనుమతి ఇచ్చినట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి ప్రకటించారు. భారత్, చైనా, రష్యా, ఇరాక్, పాకిస్తాన్‌లకు సరుకు రవాణాకు అనుమతి లభించింది. అబ్బాస్ అరఘ్చి స్పందన గురించి ముంబైలోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ ఒక ప్రకటనలో తెలిపింది. హోర్ముజ్ జలసంధిని తెరవాలని

మిగతా 2లో..

# యుద్ధ విరమణకు ఒప్పకోండి


**లేదంటే తీవ్రపరిణామాలు తప్పవు**



- నా మాటలు సీరియస్‌గా తీసుకోండి
- ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక
- నాటో దేశాలు మద్దతివ్వకపోవడంపై ఆగ్రహం
- ఇరాన్ సుప్రీం లీడర్‌గా తనను ఉండమన్నారని ప్రగల్భాలు

**వాషింగ్టన్(జనంసాక్షి):**ఇరాన్‌తో యుద్ధం ముగింపు కోసం ప్రయత్నాలు జరుగుతోన్న వేళ.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి హెచ్చరికలు చేశారు. చర్చల విషయంలో ఇరాన్ వింతగా ప్రవర్తిస్తోందన్నారు. ఆ దేశం ఒప్పందం కోసం ప్రాధేయపడుతూనే.. బయటకు మాత్రం అంగీకరించడం లేదన్నారు"వారు ఒక ఒప్పందం కోసం మమ్మల్ని వేడుకుంటున్నారు. ఇరాన్ మిలిటరీ పూర్తిగా నాశనమై, తిరిగి పుంజుకునే అవకాశం లేకుండా పోయినందున అలా వేడుకోవాల్సిందే. అయినప్పటికీ, వారు కేవలం మా ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని చెబుతున్నారు. వారు తప్పు చేస్తున్నారు. మరీ ఆలస్యం కాకముందే వారు సీరియస్‌గా వ్యవహరించడం మంచిది. ఆలస్యమైతే.. వెనక్కి తిరిగి చూసే ప్రసక్తే లేదు. దాని పర్యవసనాలు తీవ్రంగా ఉంటాయి" అని సామాజిక మాధ్యమం ట్రుత్‌లో ట్రంప్ పోస్టు చేశారు. కొన్నిగంటల ముందు కూడా ట్రంప్ ఇవే వ్యాఖ్యలు చేశారు. రిపబ్లికన్ పార్టీ విరాళాల సేకరణ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. "యుద్ధం ముగింపు విషయంలో చర్చలు జరుపుతున్నాం. ఆ ఒప్పందం కోసం ఇరాన్

మిగతా 2లో..




## ఇజ్రాయెల్ దాడిలో ఇరాన్ నేవీ చీఫ్ మృతి

- అబుధాబీలో క్షిపణి దాడి.. భారతీయుడి మృతి
- అమెరికాను ఎదుర్కొనేలా ఇరాన్ ఎత్తులు
- ఖర్గ్ ఐలాండ్‌లో మందుపాతరలు
- ఘర్షణల వేళ.. రష్యా నుంచి ఇరాన్‌కు డ్రోన్లు..!

**టెహ్రాన్(జనంసాక్షి):**ఇరాన్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. 'ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్' (ఐఆర్‌జీసీ) నౌకాదళ చీఫ్ అలీరెజా తంగ్సిరిని మట్టుబెట్టినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. తీరప్రాంత నగరమైన బందర్ అబ్బాస్‌పై జరిపిన దాడుల్లో ఆయనతోపాటు మరికొందరు సీనియర్ నౌకాదళ కమాండర్లు మృతి చెందినట్లు ఇజ్రాయెల్ రక్షణశాఖ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ వెల్లడించారు. దీనిపై ఇరాన్ ఇంకా ఎటువంటి ప్రకటన చేయలేదు. 2018 నుంచి అలీరెజా నేవీ చీఫ్ పదవిలో కొనసాగుతున్నారు. హర్మూజ్ జలసంధి మూసివేతను ఆయనే

మిగతా 2లో..





## తెలంగాణ స్పీకర్ ట్రైబ్యునల్‌కు హైకోర్టు నోటీసులు

ఎమ్మెల్యేల అనర్హత విషయంలో బీఆర్ఎస్ పిటిషన్లపై విచారణ చేపట్టిన ధర్మాసనం

**హైదరాబాద్(జనంసాక్షి):** ఎమ్మెల్యేల అనర్హత విషయంలో బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. స్పీకర్ ట్రైబ్యునల్‌కు, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, సంజయ్ కుమార్‌కూ నోటీసులు జారీ చేసింది. పార్టీ మారిన ఇద్దరిపై స్పీకర్ ట్రైబ్యునల్ చర్యలు తీసుకోలేదని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది కోర్టుకు వివరించారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మారినా ఎలాంటి చర్యలూ తీసుకోలేదని వాదించారు. స్పీకర్ ట్రైబ్యునల్ నిర్ణయాన్ని

మిగతా 2లో..

## 120 జిల్లాల్లో ప్రభుత్వ డ్రైవింగ్ స్కూళ్లు

కోటి ఉద్యోగాల కల్పన: కేంద్రమంత్రి గడ్కరీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశంలో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన 120 జిల్లాల్లో డ్రైవింగ్ స్కూళ్లను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. పరిశ్రమ గ్గాలతో కలిసి వీటిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వీటి ద్వారా రాబోయే ఐదేళ్లలో కోటి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. బాలీవుడ్ నటుడు అమిర్‌ఖాన్ నిర్వహించిన 'సడక్ సురక్షా అభియాన్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.దేశంలో 22 లక్షల మంది డ్రైవర్ల కొరత ఉందని గడ్కరీ అన్నారు. దీన్ని అధిగమించేందుకు ఇప్పటికే 200 డ్రైవింగ్ స్కూళ్లు తెరిచినట్లు చెప్పారు. రాబోయే ఐదేళ్లలో కోటి మంది యువతకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా కొత్తగా డ్రైవింగ్ స్కూళ్లు ఏర్పాటు

మిగతా 2లో..

## వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో భోజనంలో పురుగులు

ఐఆర్‌సీటీసీకి రూ.10 లక్షలు, క్యాటరింగ్ కంపెనీకి రూ. 50లక్షలు జరిమానా.. కాంట్రాక్టు రద్దు

2 లో..

## నిలకడగా సోనియా ఆరోగ్యం

గంగారాం ఆస్పత్రి వైద్యుల వెల్లడి



న్యాయవ్యవస్థలో 'ఏఐ' తీర్పుల ప్రస్తావన..

## సుప్రీం ఆందోళన

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**కృత్రిమ మేధ ద్వారా సృష్టించిన తీర్పులను.. కక్షిదారులు, న్యాయవాదులు ఉటంకిస్తున్న తీరుపై సుప్రీం కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. భారత్‌తోపాటు ప్రపంచవ్యాప్తంగా న్యాయస్థానాల్లో ఈ సమస్య అంతకంతకూ పెరుగుతోందని జస్టిస్ రాజేశ్ బిందాల్, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం తెలిపింది.ఓ కంపెనీ డైరెక్టర్‌కు సంబంధించిన కేసును గతంలో బాంబే హైకోర్టు విచారించింది. ఇందులో భాగంగా ఆ డైరెక్టర్ దాఖలు చేసిన రాతపూర్వక అంశాలను పరిశీలించి.. చాట్‌జీపీటీ లేదా అటువంటి ఏఐ టూల్స్‌ను ఉపయోగించి రూపొందించినట్లు భావిస్తున్నామని ఉత్తర్వుల్లో

మిగతా 2లో..

మరిన్ని వీసా కేటగిరీలకు

## 'సోషల్ వెట్టింగ్'

- వలసదారులపై నిబంధనలు మరింత కఠినం
- క్లిష్టతరం కానున్న అమెరికా ప్రయాణం



**వాషింగ్టన్(జనంసాక్షి):**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వలసదారులపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే హెచ్-1బీ వంటి కొన్ని వీసాలకు 'సోషల్ మీడియా వెట్టింగ్'ను అమలు చేస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ నిబంధనను మరిన్ని వీసా కేటగిరీలకు తప్పనిసరి చేసింది. మార్చి 30 నుంచి ఈ కొత్త రూల్స్ అమల్లోకి రానున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ వెల్లడించింది.ఏ-3, సీ-3 (డొమెస్టిక్ వర్కర్లు), జీ-5, హెచ్-3, హెచ్-4 (హెచ్-3 డిపెండెంట్స్), కె, క్యూ, ఆర్, ఎస్, టీ, యూ వీసాల దరఖాస్తుదారులకు కూడా ఇకనుంచి 'సోషల్ వెట్టింగ్' చేయనున్నారు. జాతీయ భద్రత పేరుతో గతేడాది ఈ నిబంధనను అమెరికా తీసుకొచ్చింది. గత డిసెంబరు నుంచి హెచ్1బీ, హెచ్4, ఎఫ్, ఎం, జే వీసాలకు దరఖాస్తు చేసుకునేవారి ఆన్‌లైన్ యాక్టివిటీని క్షుణ్ణంగా తనిఖీ చేస్తోంది. సోషల్ మీడియా వెట్టింగ్ వీసా దరఖాస్తుదారులకు అనుమతి ఇవ్వొచ్చా.. లేదా అనే దాన్ని అంచనా వేయడం కోసం వారి ఆన్‌లైన్ యాక్టివిటీని అధికారులు తనిఖీ చేస్తారు. దీన్నే 'సోషల్ మీడియా వెట్టింగ్' అంటారు.

మిగతా 2లో..

# సీఎస్ఆర్ నిధుల సమీకరణ, వినియోగానికి ప్రత్యేక విధానం

హైదరాబాద్: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులు సమీకరణతోపాటు, వాటిని సమర్థంగా వినియోగించేందుకు ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సీఎస్ఆర్ నిధులతో రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టే కార్పొరేట్ సంస్థలను ప్రభుత్వం తరఫున అభినందించాలని సూచించారు. రాష్ట్ర స్థాయిలో సీఎస్ఆర్ సెల్ ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్రంలోని కార్పొరేట్ కంపెనీలు సీఎస్ఆర్ నిధులతో చేపడుతున్న కార్యక్రమాల వివరాలు, అన్ని ప్రభుత్వ విభాగాల్లో అందుబాటులో ఉన్న ప్రాజెక్టులు, సీఎస్ఆర్ ద్వారా చేపట్టేందుకు వీలున్న కార్యక్రమాల వివరాలను సమన్వయం చేసే బాధ్యత రాష్ట్ర స్థాయి సెల్ నిర్వహిస్తుందని చెప్పారు. ప్రభుత్వానికి, కార్పొరేట్ సంస్థలకు అనుసంధానంగా ఉండేలా ప్రత్యేకంగా సీఎస్ఆర్ పోర్టల్ రూపొందించాలని ఆదేశించారు. ఇప్పటి వరకు వచ్చిన సీఎస్ఆర్ నిధులు ఆశించిన స్థాయిలో లేవని, తెలంగాణలో కంపెనీలు ఏర్పాటు చేసి, సీఎస్ఆర్ నిధులను వేరే చోట ఖర్చు పెడితే ఎలా? అని సీఎం అన్నారు. రాష్ట్రానికి మరిన్ని నిధులు రావాల్సిన అవసరం ఉందని, రాష్ట్రంలోని కార్పొరేట్ సంస్థలు, పరిశ్రమలు ఇచ్చే నిధులు వినియోగమయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇతర రాష్ట్రాల్లో సీఎస్ఆర్ సమీకరణకు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలన్నారు.

## మధ్యాహ్న భోజన మెనూలో చేపలు

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణలోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో చేపలు అందించనున్నట్లు మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. అసెంబ్లీలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. రాష్ట్రంలో బలమైన పశుసంపద ఉందని, గుడ్ల ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్నామని ఆయన తెలిపారు. మైనార్టీల విద్యకు భారీగా నిధులు వెచ్చిస్తున్నట్లు మంత్రి అజారుద్దీన్ తెలిపారు. పశుసంవర్ధక, మత్స్య, క్రీడలు, మైనార్టీ, సంక్షేమ శాఖల పద్దులను శాసనసభ ఆమోదించింది.

## జీఎస్టీ సవరణ బిల్లుకు సభ ఆమోదం

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ శాసనసభలో వస్తు సేవల పన్ను జీఎస్టి చట్ట సవరణ బిల్లుకు ఆమోదం లభించింది. గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఈ బిల్లుపై విస్తృత చర్చ జరిగిన అనంతరం, సభ ఏకగ్రీవంగా దీనిని ఆమోదించింది. ప్రధానంగా పన్నుల విభాగంలోని ఉన్నతాధికారుల హోదాలను పునర్వ్యవస్థీకరించే లక్ష్యంతో ప్రభుత్వం ఈ మార్పులను తీసుకువచ్చింది. ప్రస్తుతం ఉన్న 'సేల్స్ టాక్స్ కమిషనర్' పోస్టు పేరును ఇకపై 'చీఫ్ కమిషనర్ ఆఫ్ స్టేట్ టాక్స్'గా మార్చారు. అలాగే.. అదనపు కమిషనర్ (గ్రేడ్-1) హోదాను 'స్టేట్ టాక్స్ కమిషనర్'గా మారుస్తూ చట్ట సవరణ చేశారు. కేంద్ర ప్రభుత్వం, ఇతర రాష్ట్రాలలోని ఉన్నతాధికారుల హోదాలతో తెలంగాణ అధికారుల హోదాలను సమన్వయం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

## ఆరోగ్యశ్రీపై అబద్ధాలు చెబుతున్నారు

హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్రంలో ఆరోగ్య రంగానికి సంబంధించిన కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలపై ఎమ్మెల్యే హరీశ్ రావు ఘాటుగా స్పందించారు. అసెంబ్లీ వేదికగా తమ గళాన్ని వినిపించేం దుకు ప్రయత్నించినప్పటికీ, మైక్ ఇవ్వకపోవడంపై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మైకులు కట్‌చేసి తాము చెప్పాలనుకున్న వాస్తవాలను సభ దృష్టికి తీసుకురాకుండా ప్రభుత్వం అడ్డుపడు తోందన్నారు.

# పేదల వైద్యం.. అత్యంత ప్రాధాన్యం

కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం నెలకి రూ.89 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. ఆరోగ్య శ్రీ ఇవ్వకపోవడం వల్ల చికిత్స చేయట్లేదు అనేది అపోహ మాత్రమే అన్నారు. ఇన్ని ఇబ్బందుల్లో కూడా ఆరోగ్య శ్రీ పథకాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. విద్యా, వైద్యం విషయంలో కోతలు ఉండవని సీఎం రేవంత్ మరోసారి తేల్చి చెప్పారు. కోతలు పెట్టాల్సి వస్తే వేరే కోతలు పెడతామని అన్నారు. టీచింగ్ కాలేజీల నిర్వహణ గ్రూప్-1 అధికారులకు అప్పగిస్తామని, ప్రతి కుటుంబానికి జీవిత బీమా అందించేందుకు కొత్త పథకం తీసుకు వస్తున్నట్లు సీఎం రేవంత్ తెలిపారు. విద్య, పేదల వైద్యం తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యాంశాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వైద్యానికి నిధులు కేటాయించి రాష్ట్రాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో రూ.2,046 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశామని చెప్పారు. గతంలో ఈ చెక్కుల విషయంలో అవినీతి జరిగిందన్నారు. 27 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పేదల వైద్యం కోసం రూ.4,500 కోట్లు చెల్లించామన్నారు. టీచింగ్ కాలేజీలకు రోగులు వెళ్లడం లేదని సీఎం అన్నారు. ఈ కాలేజీల నిర్వహణను గ్రూప్-1 అధికారులకు అప్పగిస్తామని చెప్పారు. ప్రతి కుటుంబానికి జీవిత బీమా అందించేందుకు కొత్త పథకం తీసుకొచ్చామని వివరించారు. విదేశాల్లో నిపుణులైన వైద్యుల సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. గోషామహల్‌లో 30 ఎకరాల్లో రూ.3వేల కోట్లతో ఉస్మానియా ఆస్పత్రి నిర్మిస్తున్నామన్నారు. ఆ పనులు వేగంగా జరిగేందుకు చర్యలు తీసుకున్నామని వివరించారు.

## దావోస్ ఒప్పందాలపై శ్వేతపత్రం విడుదల సిద్ధం

హైదరాబాద్(జనంసాక్షి):దావోస్ పెట్టుబడులు, ఎంవోయూలపై శాసనసభలో విపక్ష సభ్యులు చేసిన విమర్శలను మంత్రి శ్రీధర్‌బాబు తిప్పికొట్టారు. దావోస్ పర్యటనల్లో తెలంగాణకు రూ.2.19 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. పెట్టుబడిదారులతో ప్రభుత్వం 44 ఎంవోయూలు కుదుర్చుకుందని వెల్లడించారు. ఈ ఒప్పందాలపై శ్వేతపత్రం విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. దావోస్ పర్యటనల్లో 44 ఎంవోయూలు ప్రభుత్వం కుదుర్చుకుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. రాష్ట్రానికి రూ. 2.19 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని అన్నారు. అసెంబ్లీలో దావోస్ పెట్టుబడులపై శ్రీధర్ బాబు మాట్లాడారు. పెట్టుబడులతో 68,150 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు వస్తాయని, 2024 దావోస్ లో 18 ఎంవోయూలు.. రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలియజేశారు. రూ.81,800 కోట్ల పెట్టుబడులతో 6 కంపెనీలకు భూముల కేటాయింపు జరిగిందని, భూముల కేటాయింపుతో ప్రభుత్వానికి రూ.1,540 కోట్ల ఆదాయం కేటాయించామని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మరో 3 కంపెనీలకు రూ.30 వేల కోట్ల పెట్టుబడుల కోసం భూముల గుర్తింపు చర్యలు చేశామని, నిజామాబాద్ ఐటీ టవర్ లో 11 కంపెనీలు కార్యకలాపాలు జరిగాయని అన్నారు. నిజామాబాద్ లో 681 సీట్ల సామర్థ్యంతో ఐటి టవర్ నిర్మించామని, నిజామాబాద్ ఐటీ టవర్ లో ప్రస్తుతం 276 మంది ఉద్యోగాలు పనిచేస్తున్నారని అన్నారు. పెట్టుబడుల ఒప్పందాలపై శ్వేతపత్రం విడుదల చేస్తామని, పరిశ్రమల ఏర్పాటు వల్ల రాష్ట్రానికి బహుళ ప్రయోజనాలు, ఉపాధి లభిస్తుందని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

## వందేభారత్ ఎక్స్‌ప్రెస్ భోజనంలో పురుగులు



న్యూఢిల్లీ(జనంసాక్షి): వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడికి చేదు అనుభవం ఎదురైంది. అతడికి అందించిన భోజనంలో పురుగులు కనిపించాయి. దీంతో రైల్వే శాఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఐఆర్‌సీటీసీకి రూ.10 లక్షల జరిమానా విధించింది. పట్నా-టాటానగర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించిన రితేష్ కుమార్ అనే ప్రయాణికుడికి ఈ అనుభవం ఎదురైంది .రితేష్ కుమార్ మార్చి 15వ తేదీన పట్నా-టాటానగర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించారు. ఆ సమయంలో రితేష్‌కు అందించిన భోజనంలోని పెరుగులో పురుగులు కనిపించాయి. దీంతో షాకైన రితేష్ సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. రైల్వే సిబ్బంది కూడా ఆ భోజనాన్ని పరిశీలించారు. ఈ మొత్తం తతంగాన్ని రితేష్ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది. వీడియోపై రైల్వే మంత్రిత్వ శాఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఐఆర్‌సీటీసీకి రూ.10 లక్షలు జరిమానా విధిస్తున్నట్టు తెలిపింది. అలాగే ఆ రైల్లో కేటరింగ్ చేసిన ఫుడ్ సర్వీస్ ప్రొవైడర్‌కు రూ.50 లక్షల జరిమానా విధించడంతో పాటు అతడి కాంట్రాక్టును కూడా రద్దు చేసింది. రైల్వే ప్రయాణికుల భద్రతకే తమ మొదటి ప్రాధాన్యం అని తేల్చి చెప్పింది.

## తెరుచుకున్న హర్ముజ్

ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ అభ్యర్థించారు. దీని నేపథ్యంలోనే ఇరాన్ ఈ చర్య తీసుకున్నట్లు సమాచారం. మధ్యప్రాచ్యంలో యుద్ధాన్ని ముగించాలని గుటెర్రెస్ అమెరికా, ఇజ్రాయిల్‌లను కోరారు. 'హోర్ముజ్ జలసంధిని మూసివేయడం చమురు, గ్యాస్ రవాణాను స్తంభింపజేస్తోంది. ఈ ప్రాంతంలో, వెలుపల పౌరులు తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నారు, అభద్రతతో జీవిస్తున్నారు. సంఘర్షణ పరిణామాలను తగ్గించడానికి పోరాటాన్ని ముగించడమే సరైన నిర్ణయం' అని గుటెర్రెస్ ఒక ప్రకటనలో రాశారు.

### మరిన్ని వీసా కేటగిరీలకు 'సోషల్ వెట్టింగ్'

సంబంధిత వీసా దరఖాస్తుదారుల సోషల్ మీడియా ప్రొఫైళ్లను పరిశీలించిన తర్వాతే వీసా మంజూరు చేస్తారు. ఇందుకోసం దరఖాస్తుదారులు తమ సామాజిక మాధ్యమ ఖాతాల సెట్టింగ్‌లను ప్రైవేటు నుంచి పబ్లిక్‌కు మార్చుకోవాల్సి ఉంటుంది. సోషల్ మీడియాలో వారు ఎలాంటి కంటెంట్ పోస్ట్ చేస్తున్నారు? వారివల్ల అమెరికా భద్రతకు ముప్పు ఉందా? అన్న కోణంలో అధికారులు ఈ తనిఖీలు చేస్తారు.

### న్యాయవ్యవస్థలో 'ఏఐ' తీర్పుల ప్రస్తావన..

పేర్కొంది. ఓ 'కేసు లా'ను కూడా ప్రస్తావించారని, అయితే.. దాని ప్రతిని అందించలేదని తెలిపింది. దాని గురించి తెలుసుకునేందుకు కోర్టు సిబ్బంది ప్రయత్నించినా.. ఫలితం లేకపోయిందని చెప్పింది. దీంతో విలువైన కోర్టు సమయం వృథా అయ్యిందని పేర్కొంది. ఈ క్రమంలోనే బాంబే హైకోర్టు వ్యాఖ్యలను తొలగించాలని కోరుతూ కంపెనీ డైరెక్టర్.. సుప్రీం కోర్టు ను ఆశ్రయించారు.

## నిలకడగా సోనియా ఆరోగ్యం

**గంగారాం ఆస్పత్రి వైద్యుల వెల్లడి**

న్యూఢిల్లీ(జనంసాక్షి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. గత కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న సంగతి తెలిసిందే. మార్చి 24వ తేదీ రాత్రి జ్వరం కారణంగా ఆమె న్యూఢిల్లీలోని సర్ గంగారాం ఆస్పత్రిలో చేరారు. ప్రత్యేక వైద్యుల బృందం పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలోనే సోనియా ఆరోగ్యానికి సంబంధించి గంగారాం ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ విజయ్ స్వరూప్ గురువారం హెల్త్ బులిటిన్ విడుదల చేశారు. సోనియా ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని తెలిపారు. చికిత్సకు సోనియా ఆరోగ్యం సహకరిస్తోందని వెల్లడించారు. ఆమెకు సీనియర్ డాక్టర్ల బృందం చికిత్స అందిస్తోందని, ఇంకా పర్యవేక్షణ అవసరం ఉందని తెలిపారు. కాగా, డాక్టర్లు సిస్టమేటిక్ ఇన్‌ఫెక్షన్‌ను నయం చేయడానికి సోనియాకు యాంటీ బయాటిక్స్ ఇస్తున్నట్లు తెలుస్తోంది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మరికొన్ని రోజులు ఆమెను ఆస్పత్రిలోనే ఉంచి చికిత్స అందించే అవకాశం ఉంది.

## 120 జిల్లాల్లో ప్రభుత్వ డ్రైవింగ్ స్కూళ్లు

చేయనున్నట్లు ప్రకటించారు. ప్రపంచంలో అత్యధికంగా భారత్‌లోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని మంత్రి ఆవేదన వ్యక్తంచేశారు. ఏటా 5 లక్షల ప్రమాదాలు జరుగుతున్నాయని, అందులో 1.8 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. వీరిలో 66 శాతం మంది 18-44 మధ్య వయస్కులేనని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల కారణంగా భారత్ 3 శాతం జీడీపీని కోల్పోతోందన్నారు. రోడ్డు ప్రమదాలకు రోడ్డు డిజైన్, ఇంజినీరింగ్ ప్రధాన కారణమని తెలిపారు. జాతీయ రహదారులపై బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి రూ.40వేల కోట్లు ఖర్చుతో వాటిని తొలగించామని గడ్కరీ వెల్లడించారు. ఆటోమొబైల్ ఇంజినీరింగ్ రెండో కారణమన్నారు. ప్రస్తుతం ప్రపంచంలో భారత ఆటోమొబైల్ ఇండస్ట్రీ మూడో స్థానంలో ఉందని, రాబోయే ఐదేళ్లలో అగ్రస్థానం చేరుకోవడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ మూడో కారణం కాగా, వాహనదారుల వ్యవహార శైలి నాలుగో కారణమన్నారు. చట్టమంటే ప్రజలకు భయం, గౌరవం ఉండడం లేదని గడ్కరీ ఆందోళన వ్యక్తంచేశారు.

స్కూల్ బస్సుల్లో సీటు బెల్టులు: ఆమిర్ ఖాన్

రహదారి భద్రత విషయంలో తాను పక్కాగా వ్యవహరిస్తానని నటుడు ఆమిర్ ఖాన్ అన్నారు. దేశంలో చాలా మంది పోలీసులను చూసి మాత్రమే హెల్మెట్లు ధరిస్తున్నారని గడ్కరీతో అన్నారు. కొందరైతే సీటు బెల్టు ధరించకుండా క్లిప్స్‌ను కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. చిన్నారుల భద్రత దృష్ట్యా స్కూల్ బస్సుల్లో సీటు బెల్ట్ తప్పనిసరి చేయాలని విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ స్పీకర్ ట్రైబ్యునల్‌కు హైకోర్టు నోటీసులు

రద్దు చేయాలని వాదించారు. కడియం, సంజయ్‌పై అనర్హత వేటు వేయాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను ఏప్రిల్ 16కి వాయిదా వేసింది.

## ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగంపై మరో ముందడుగు

**హైదరాబాద్(జనంసాక్షి):** ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగంపై కేంద్రం వైపు నుంచి మరో ముందడుగు పడింది. దక్షిణ భాగానికి డీపీఆర్ దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి రాసిన లేఖలో ఈమేరకు పేర్కొన్నారు. డీపీఆర్ తయారీకి చర్యలు చేపట్టినట్లు.. ఇందుకు కన్సల్టెన్సీని అపాయింట్ చేసినట్లు తెలిపారు. నితిన్ గడ్కరీ లేఖ పట్ల కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. నార్త్ పార్ట్ ఇప్పటికే మంజూరై.. టెండర్ దశలో ఉందని చెప్పారు. సౌత్ పార్ట్ పట్ల కూడా కేంద్రం నుంచి సానుకూల నిర్ణయం వచ్చిందన్నారు. ఆర్ఆర్ఆర్ రాష్ట్రానికి గేమ్ ఛేంజర్ కాబోతుందని తెలిపారు.

# అగ్నికీలల మారణహోమం

ఘటనాస్థలికి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను మార్కాపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది.

బస్సు తెలంగాణలోని జగిత్యాల నుంచి నెల్లూరు జిల్లా కనిగిరికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఘటన జరిగిన సమయంలో బస్సులో 41 మంది ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీరిలో బస్సు వెనుక భాగంలో ఉన్నవారు బయటకు రాలేక మృతిచెందినట్లు తెలుస్తోంది. ముందు భాగంలో ఉన్నవారు ప్రాణాలతో బయటపడ్డారు. మృతుల్లో కనిగిరి, వింజమూరు, ఉదయగిరి ప్రాంతాలకు చెందిన వారు ఉన్నట్లు సమాచారం. ఘటనాస్థలాన్ని మార్కాపురం జేసీ శ్రీనివాసులు, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పరిశీలించారు. మృతుల వివరాలు.. సీహెచ్ మనోజ్‌కుమార్ (18), వింజమూరు, సీహెచ్ సుజాత (45), వింజమూరు, సీహెచ్ మేఘన (19), వింజమూరు, టి. నరేంద్ర (25), నల్లగొండ్ల, టి. చందన (21), నల్లగొండ్ల, టి. చందు (6), నల్లగొండ్ల , కె. ప్రకాశ్ (17), అయ్యవారిపల్లె, కె.అయ్యన్న (18), (ఎర్రబొట్లపల్లె) వి. గురవయ్య (60), చింతగుంట్ల, కె.అబ్రహం (42), చోడవరం, పి.మహేంద్రరెడ్డి (17), చోడవరం రామచంద్ర ప్రవీణ్ (21), చోడవరం, ఎ.సౌజన్య (22), పెదారికట్ల ఉన్నారు. ఈ ప్రమాదంపై సీఎం చంద్రబాబు,ప్రధాని మోడీ, మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బస్సులోని పలువురు ప్రయాణికులు సజీవ దహనం కావడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. జిల్లా అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తెలంగాణలో నిర్మల్ నుంచి నెల్లూరుకు ఈ బస్సు వెళుతున్నట్లు అధికారులు తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలన్నారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు. బస్సు ప్రమాదంపై మంత్రులు నారా లోకేశ్, గొట్టిపాటి రవికుమార్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు.

బస్సుప్రమాదంపై చంద్రబాబు దిగ్భ్రాంతి

ప్రకాశం జిల్లా మార్కాపురంలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంపై మంత్రులు అనిత, జనార్ధన్ రెడ్డితో పాటు పోలీసు ఉన్నతాధికారులు, జిల్లా ఎస్పీ, కలెక్టర్‌తో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ప్రమాదం జరిగిన తీరుపై ప్రాథమిక సమాచారాన్ని ముఖ్యమంత్రికి జిల్లా ఎస్పీ, కలెక్టర్ వివరించారు. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 35 మంది ప్రయాణికులు ఉన్నారని సీఎంకు తెలిపారు. ఈ దుర్ఘటనలో 13 మంది చనిపోయారని, 22 మంది గాయపడి వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని అధికారులు చెప్పారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని ముఖ్యమంత్రికి వివరించారు. హరికృష్ణ ట్రావెల్స్‌కు చెందిన ఈ బస్సు జగిత్యాల నుంచి వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రమాదంపై డ్రైవర్‌ను విచారించగా.. తన వాహనం స్టీరింగ్ స్టక్ అయ్యిందని చెప్పాడని.. దీనిపై నిజానిజాలను అధికారులు పరిశీలిస్తున్నారని సీఎంకు తెలియజేశారు. బస్సు పూర్తిగా ఆపోజిట్ రూట్‌లో వెళ్లడం వల్లనే ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నామని అధికారులు వెల్లడించారు. గాయపడిన వారిలో పరిస్థితి విషమంగా ఉన్నవారిని గుంటూరు ఆసుపత్రికి తరలించే ఆలోచనలో ఉన్నామని సీఎంకు జిల్లా కలెక్టర్ తెలిపారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, బాధిత కుటుంబాలకు తగిన నష్టపరిహారం చెల్లించాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

బస్సు ప్రమాద ఘటనపై రేవంత్ దిగ్భ్రాంతి

మార్కాపురం జిల్లా రాయవరం రోడ్డు ప్రమాదంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనలో 13 మంది మృతిచెందడం, 20 మందికి తీవ్రగాయాలు కావడంపై సీఎం రేవంత్ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి ట్వీట్ చేశారు. నిర్మల్ నుంచి నెల్లూరు వైపు బస్సు వెళుతున్న నేపథ్యంలో మృతిచెందిన, గాయపడిన వారి వివరాలను తెలుసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును ఆదేశించారు. ఏపీ అధికారులతో మాట్లాడి పూర్తి వివరాలు సేకరించాలని ఆజ్ఞాపించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సహాయం అందేలా చూడాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఆంధ్రప్రదేశ్ సీఎస్ సాయిప్రసాద్‌తో ఆయన మాట్లాడారు. ప్రమాదం గురించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## మొదలైన పెట్రో మంట

**ధరలు పెంచిన నయారా ఎనర్జీ**

న్యూఢిల్లీ(జనంసాక్షి):ప్రైవేటురంగ చమురు సంస్థ నయారా ఎనర్జీ వినియోగదారులకు షాకిచ్చింది. పెట్రోల్, డీజిల్ ధరలను పెంచేసింది. లీటరు పెట్రోల్‌పై రూ.5, డీజిల్‌పై రూ.3 చొప్పున పెంచింది. పెరిగిన ధరలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. ఆయా రాష్ట్రాలు విధించే వ్యాట్ ఆధారంగా ఈ పెంపు వర్తిస్తుంది. కొన్ని రాష్ట్రాల్లో ఈ పెంపు గరిష్ఠంగా రూ.5.30 వరకు ఉంటుంది. దేశవ్యాప్తంగా లక్షకు పైగా పెట్రోల్ పంపులు ఉండగా.. రష్యా చమురు సంస్థ అయిన రాస్‌నెఫ్ట్‌కు చెందిన నయారా ఎనర్జీ 6,967 పెట్రోల్ పంపులను ఆపరేట్ చేస్తోంది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరిగిన నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ ధరలను సవరించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.మరో ప్రముఖ ప్రైవేటురంగ చమురు సంస్థ రిలయన్స్-బీపీ మాత్రం పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పూ చేయలేదు. దేశవ్యాప్తంగా 2,185 ఔట్‌లెట్లను జియో-బీపీ నిర్వహిస్తోంది. సుమారు 90 శాతం మార్కెట్ వాటా కలిగిన ప్రభుత్వరంగ చమురు కంపెనీలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ బీపీసీఎల్ హెచ్‌పీసీఎల్ మాత్రం సాధారణ పెట్రోల్, డీజల్ ధరల్లో ఎలాంటి మార్పూ చేయలేదు. ప్రీమియం పెట్రోల్ ధరను మాత్రం రూ.2.30 మేరకు ఇటీవల సవరించాయి. ఇండస్ట్రియల్ డీజిల్‌ను లీటరుకు రూ.22 చొప్పున పెంచాయి.

# యుద్ధ విరమణకు ఒప్పుకోండి

ప్రాధేయపడింది. కానీ, ఆ విషయాన్ని వారు బయటకు చెప్పట్లేదు. ఎందుకంటే సొంత ప్రజల చేతుల్లోనే హత్యకు గురవుతారని వారు భయపడుతున్నారు" అని అన్నారు. మరోవైపు ఇరాన్ నుంచి భిన్నమైన స్పందన వచ్చింది. అమెరికా ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని, ఘర్షణల ముగించేందుకు చర్చలు జరిపే ఉద్దేశం లేదని ఆ దేశ విదేశాంగమంత్రి స్పష్టం చేశారు.

నాటో దేశాలు ఏమీ చేయట్లేదు: ట్రంప్

ఇరాన్ యుద్ధం విషయంలో నాటో దేశాల నుంచి ఎలాంటి మద్దతు లభించకపోవడంపై ట్రంప్ మరోసారి తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. "ఇప్పటికే మిలిటరీ పరంగా తీవ్రంగా నష్టపోయిన ఇరాన్ విషయంలో అమెరికాకు నాటో దేశాలు ఏమాత్రం సహకరించడం లేదు. నాటో నుంచి ఎలాంటి అవసరం లేదు. కానీ, ఇలాంటి ముఖ్యమైన సమయంలో వారు ప్రవర్తించిన తీరును ఎప్పటికీ మర్చిపోం" అని మరో పోస్టు చేశారు.

ఇరాన్ సుప్రీం లీడర్‌గా నన్ను ఉండమన్నారు

యుద్ధం ముగింపునకు సంబంధించి అమెరికాతో ఎలాంటి చర్చలు జరగట్లేదని ఓవైపు ఇరాన్ చెబుతుండగా.. అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చర్చలు కొనసాగుతున్నట్లు పదే పదే చెబుతున్నారు. తాజాగా ఈ వ్యవహారంపై మరోసారి స్పందించిన ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనను ఇరాన్ సుప్రీంలీడర్‌గా ఎన్నుకొంటామని అన్నారంటూ ప్రగల్భాలు పలికారు. రిపబ్లికన్ పార్టీ విరాళాల సేకరణ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడారు. "ఇరాన్‌పై సైనిక విధ్వంసానికి పాల్పడ్డాం. ఈ యుద్ధంలో మేం భారీ విజయాన్ని సాధించబోతున్నాం. ఇంతవరకూ పశ్చిమాసియాలో ఎవరూచూడని విక్టరీ అది. ఇక, యుద్ధం ముగింపు విషయంలో మేం చర్చలు జరుపుతున్నాం. ఆ ఒప్పందం కోసం ఇరాన్ ప్రాధేయపడింది. కానీ, ఆ విషయాన్ని వారు బయటకు చెప్పట్లేదు. ఎందుకంటే సొంత ప్రజల చేతుల్లోనే హత్యకు గురవుతారని వారు భయపడుతున్నారు" అని ట్రంప్ పేర్కొన్నారు. అంతేగాక, ఇరాన్ తదుపరి సుప్రీం లీడర్ గా ఉండాలని ఆ దేశ నేతలు తనను అడిగినట్లు ట్రంప్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. అయితే, అలాంటి పదవిని తాను కోరుకోవట్లేదని, అందుకే వారి అభ్యర్థనను తిరస్కరించానంటూ ప్రగల్భాలు పలికారు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త ఆపరేషన్ ప్రారంభించిన తొలిరోజే సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ మరణించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఆయన కుమారుడు మొజ్తాబా ఖమేనీని సుప్రీంలీడర్‌గా ఎన్నుకొన్నారు. అయితే, ఇప్పటివరకు ఆయన బహిరంగంగా కన్పించలేదు. మరోవైపు, అమెరికా దాడుల్లో మొజ్తాబా తీవ్రంగా గాయపడ్డారనే వార్తలు కూడా వినిపిస్తున్నాయి.

### ఇజ్రాయెల్ దాడిలో ఇరాన్ నేవీ చీఫ్ మృతి

పర్యవేక్షిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు తెలిపాయి. పశ్చిమాసియా దేశాలపై ఇరాన్ దాడులు కొనసాగుతున్నాయి. క్షిపణి శిథిలాలు మీదపడి అబుధాబీలో ఇద్దరు మృతి చెందారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఇజ్రాయెల్‌లోని కెఫర్ ఖాసీం ప్రాంతంలో ఐదుగురు, టెల్‌అవీవ్‌లో ఇద్దరు గాయపడ్డారు. ఇజ్రాయెల్ సైనిక నియంత్రణ కేంద్రం, అణు మౌలిక సదుపాయాలకు సంబంధించిన పరిశ్రమలపైనా దాడులు చేశామని ఐఆర్‌జీసీ ప్రకటించింది. లెబనాన్‌లో ఓ సైనికుడు మృతి చెందినట్లు ఇజ్రాయెల్ తెలిపింది. మరోవైపు.. ఇరాన్‌కు తాము డ్రోన్లు సరఫరా చేస్తున్నామనే కథనాలను రష్యా ఖండించింది.

అబుధాబీలో క్షిపణి దాడి.. భారతీయుడి మృతి

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. అబుధాబీపై ఇరాన్ జరిపిన క్షిపణి దాడుల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా.. వీరిలో ఒకరు భారతీయుడు ఉన్నట్లు వెల్లడైంది. ఇరాన్ నుంచి వచ్చే క్షిపణులను యూఏఈ గగనతల రక్షణ వ్యవస్థలు సమర్థవంతంగా అడ్డుకున్నప్పటికీ.. క్షిపణి శిథిలాలు మీద పడి వీరిద్దరూ చనిపోయినట్లు సమాచారం. చనిపోయిన మరో వ్యక్తిని పాక్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. అయితే, ఈ ఘటనపై భారత విదేశాంగశాఖ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అబుధాబీ క్షిపణి దాడి ఘటనలో మరో ముగ్గురు గాయపడగా.. వీరిలోనూ ఒకరు భారతీయుడు ఉన్నట్లు యూఏఈ మీడియా విభాగం వెల్లడించింది. మరో ఇద్దరు యూఏఈ, జోర్డాన్‌లకు చెందిన వారని పేర్కొంది. ఈ దాడులకు సంబంధించి ఎలాంటి వదంతులను పౌరులు నమ్మవద్దని, అధికారుల నుంచి ధ్రువీకరించుకోవాలని సూచించింది. మరోవైపు, యూఏఈపై ఇరాన్ దాడులను జోర్డాన్ ఖండించింది. ఆ దేశ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించడమే కాకుండా ఈ ప్రాంత భద్రత, స్థిరత్వానికి తీవ్ర ముప్పు కలిగించే చర్యలేనని పేర్కొంది.

## నేడు అన్ని రాష్ట్రాల సీఎంలతో ప్రధాని మోదీ భేటి

న్యూఢిల్లీ(జనంసాక్షి):పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మరింత అప్రమత్తమయ్యింది. ఈ క్రమంలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాని మోదీ శుక్రవారం వర్చువల్‌గా సమావేశం కానున్నారు. శుక్రవారం సాయంత్రం 6.30గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారితో మాట్లాడనున్న ఆయన.. పశ్చిమాసియాలో పరిస్థితులు, భారత్ అనుసరిస్తున్న విధానాలను వివరించనున్నట్లు సమాచారం. అదేవిధంగా ఆయా రాష్ట్రాల సన్నద్ధత, సహకారంపై చర్చించనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాత్రం ఈ సమావేశానికి దూరంగా ఉండనున్నట్లు తెలిసింది. అయితే, ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో కేబినెట్ సెక్రటరీ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ప్రధాని-సీఎంల వీడియో కాన్ఫరెన్స్‌లో తీసుకున్న వివరాలను సీఎస్‌లకు వెల్లడించి.. ఆయా రాష్ట్రాల్లో అమలు చేసేలా కేబినెట్ సెక్రటరీ సూచించనున్నట్లు సమాచారం. ఇటీవల పార్లమెంటు ఉభయసభల్లో మాట్లాడిన ప్రధాని మోదీ.. యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సంక్లిష్ట పరిస్థితులు దీర్ఘకాలం కొనసాగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇది పరీక్షా సమయమేనని తెలిపారు. సంక్షోభం నుంచి బయటపడటంలో రాష్ట్రాలన్నీ కేంద్రంతో కలిసి టీమ్ ఇండియాలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ప్రజలు సిద్ధమై ఉండాలని కోరారు. ఈ క్రమంలోనే అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశానికి సిద్ధమవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశంలో పశ్చిమాసియా యుద్ధం కారణంగా తలెత్తిన సంక్షోభంపై కీలక సూచనలు చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దేశంలో చమురు, గ్యాస్‌పై విపరీతంగా వదంతులు వ్యాపిస్తున్నాయి. మధ్యప్రాచ్యం యుద్ధం కొనసాగితే.. ఎదురయ్యే ఇబ్బందులను ఎలా ఎదుర్కోవాలన్న దానిపై మోడీ దిశానిర్దేశర చేయనున్నారు. గత నెల 28 నుంచి పశ్చిమాసియాలో యుద్ధం జరుగుతోంది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడి చేశాయి. ఈ ఘటనలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా లీ ఖమేనీ హతమయ్యాడు. దీంతో ఇరాన్ ప్రతీకార దాడులకు దిగింది. గల్ఫ్ దేశాల్లోని ఇంధన, గ్యాస్ క్షేత్రాలపై క్షిపణులతో విరుచుకుపడింది. అంతేకాకుండా హార్ముజ్ జలసంధిని కూడా మూసేసింది. దీంతో ప్రపంచ దేశాల్లో చమురు, గ్యాస్ కష్టాలు తీవ్ర స్థాయికి చేరాయి. ఇప్పటికే ఆయా దేశాల్లో అత్యవసర పరిస్థితులు అమలు అవుతున్నాయి. అలాగే భారత్‌లో కూడా కరోనా కాలం నాటి లాక్‌డౌన్ పరిస్థితులు వస్తాయంటూ పుకార్లు వ్యాప్తి చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీ.. అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం నిర్వహించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

## పెట్రోలియం నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి

నేపథ్యంలో కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది.ప్రపంచంలోనే భారత్ నాలుగో అతిపెద్ద రిఫైనర్ అని, ఐదో అతిపెద్ద పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతిదారుగా ఉందని కేంద్రం పేర్కొంది. దేశీయంగా తగినంత సరఫరా కలిగి ఉండడమే కాకుండా.. 150కి పైగా దేశాలకు శుద్ధి చేసిన ఇంధనాలను సరఫరా చేస్తోందని ఓ ప్రకటనలో పేర్కొంది. దేశంలో ప్రతి రిఫైనరీ నూరు శాతం ఉత్పాదక సామర్థ్యంతో పనిచేస్తున్నాయని తెలిపింది.దేశంలో తదుపరి 60 రోజులకు సరిపడా క్రూడాయిల్ చమురు కంపెనీల వద్ద ఉందని కేంద్రం తెలిపింది. వ్యూహాత్మక నిల్వలతో కలిపి 74 రోజులకు సరిపడా చమురు నిల్వలు ఉన్నాయని తెలిపింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ప్రారంభమై 27వ రోజులు మాత్రమే అయ్యిందని గుర్తుచేసింది. భౌగోళిక పరిణామాలతో సంబంధం లేకుండా రాబోయే రెండు నెలల పాటు స్థిరంగా చమురు సరఫరా చేయడానికి సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయని స్పష్టంచేసింది.అలాగే, దేశీయంగా ఎల్‌పీజీ నిల్వలు కూడా సరిపడా ఉన్నాయని కేంద్రం పేర్కొంది. దేశీయంగా ఉత్పత్తి పెంచామని, తద్వారా దిగుమతి చేసుకోవాల్సిన అవసరం కూడా తగ్గిందని తెలిపింది. ఎల్‌పీజీకి కొరత రాకుండా ఉండేందుకు పలు దేశాల నుంచి కార్గోలను తెప్పిస్తున్నామని వెల్లడించింది. ఇంధనం విషయంలో సామాజిక మాధ్యమాల్లో తప్పుడు, కల్పిత ఆరోపణలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

# కంప్యూటర్ ల్యాబ్‌లో విద్యార్థినితో టీచర్ అసభ్య ప్రవర్తన

**ఉపాధ్యాయుడి సస్పెన్షన్**



**నారాయణపేట (జనంసాక్షి) :** విద్యార్థులకు క్రమశిక్షణతోపాటు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన టీచర్ ఆ విషయాన్ని మరిచిపోయాడు. తాను చదువు చెప్పే స్కూల్‌లో విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించాడు. నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూరు మండలం మోమినపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో స్వామి అనే తెలుగు ఉపాధ్యాయుడు విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించాడు. సదరు విద్యార్థినిని టీచర్ స్వామి ఈ నెల 7వ తేదీన కంప్యూటర్ ల్యాబ్‌కు పిలిపించుకుని వెకిలి చేష్టలకు పాల్పడ్డాడు. దీనికి సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యాలు, ఈ విషయం బయటికి రాకుండా ఉండేందుకు ఎంఈవో, ప్రధానోపాధ్యాయుడు, గ్రామ పెద్దలు ప్రయత్నించారు. ఈ విషయం తెలుసుకున్న మీడియా ప్రతినిధులు స్కూల్‌కు వెళ్లడంతో టీచర్ స్వామి వారితో మాట్లాడకుండా భయంతో పరుగులు పెడుతున్న వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో రౌండప్ చేస్తోంది.

**ఉపాధ్యాయుడి సస్పెన్షన్..**

మద్దూరు మండలం ఎంపీహెచ్ఎస్ మోమినాపూర్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన స్వామి అనే తెలుగు ఉపాధ్యాయుడిని ఎంక్వైరీ అధికారుల విచారణ నివేదిక మేరకు విధులనుంచి సస్పెన్షన్ చేసినట్టు డీఈఓ గోవిందరాజు ప్రకటనలోతెలియజేశారు.

# ఏప్రిల్ 2నుంచి ఇంటిగ్రేటెడ్ భూభారతి

- 5 మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు



అనుగుణంగా భూపరిపాలన సేవలను మరింత వేగవంతంగా అందించడానికి రెవెన్యూ. స్టాంప్స్/ రిజిస్ట్రేషన్ , సర్వే విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ భూభారతి పోర్టల్‌ను అభివృద్ధి చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి భూలావాదేవీ వివరాలు కనిపించేలా పారదర్శకంగా ఈ పోర్టల్‌ను రూపొందించినట్లు వెల్లడించారు. ఈ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ను నారాయణపేట జిల్లా కొస్గి, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలాల్లో వచ్చేనెల 2వ తేదీ నుంచి ప్రయోగాత్మకంగా అమలు చేస్తామని తెలిపారు. ఈ పైలట్ మండలాల్లో మెరిట్–డీమెరిట్ లను క్షుణ్ణంగా పరిశీలించి వాటికి అవసరమైన మార్పులు చేర్పులు చేసి రెండవ దశలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమలు చేస్తామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామి మేరకు భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని అలాగే ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలిపి భూభారతి పోర్టల్‌ను కూడా తీసుకురావడం జరిగిందన్నారు. భూభారతి చట్టంలో పేర్కొన్నవిధంగా వ్?వసాయ భూములకు సంబంధించి క్రయ విక్రయదారులకు ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాపును జతపరచే నిబంధనను ఈ ఐదు మండలాల్లో అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.తద్వారా రాష్ట్రంలో భూవివాదాలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ ఐదు మండలాల్లో ప్రతి సర్వే నెంబరుకు ఆధార్ నెంబర్ మాదిరిగానే భూధార్ నెంబర్‌ను కూడా ఇస్తామని తెలిపారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా నక్షాలేని ఐదు గ్రామాల్లో రీసర్వే నిర్వహించి భూధార్ నెంబర్‌ను కేటాయించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నాకూడా ప్రజా కోణంలోనే ఉంటుందన్నారు. ఒక క్లిక్ తో రైతులకు సంబంధించిన భూముల పూర్తి సమాచారం లభించేలా చాలా సులువుగా, సులభతరంగా ఉండేలా ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను రూపొందించామని ఆధార్ నెంబర్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయిన వెంటనే కావలసిన సమాచారం లభిస్తుందన్నారు. అదేవిధంగా ఈ పోర్టల్‌లో ప్రధానంగా సమాచారం సేవలు, సర్వే సేవలు, కరెక్షన్ సేవలు, అప్పీల్ సేవలు, రిజిస్ట్రేషన్ సేవలతోపాటు సిటిజన్ డాష్ బోర్డు సేవలకు సంబంధించి మైల్యాండ్ పోర్ట్‌ఫోలియో, నాలా ఆర్డర్స్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ వివరాలు, ఫీడ్‌బ్యాక్, సంబంధిత అధికారుల వివరాలు, ఆర్వోఆర్, భూధార్ నెంబర్, దరఖాస్తు వివరాలు, మ్యుటేషన్, ఈసీ, మార్కెట్ విలువ, విలేజ్ మ్యాప్, ప్రతి సర్వేనెంబర్‌కు మ్యాప్, ఆర్వోఆర్, గ్రామాల నక్షా, పాస్ బుక్ కరెక్షన్, వంటి పూర్తి సమాచారం, సేవలు లభించేలా మూడు విభాగాలను అనుసంధానం చేస్తూ భూభారతి పోర్టల్ ను పూర్తి స్థాయిలో ప్రజలకు చేరువ చేయబోతున్నామని తెలిపారు. రిజిస్ట్రేషన్, ఇతర భూసేవలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్నప్పటి నుంచి ఆ ప్రక్రియ పూర్తయ్యేవరకు ప్రతి స్టేజ్ లో దాని వివరాలను తెలియజేస్తూ ఎస్.ఎమ్.ఎస్ ద్వారా ఖాతాదారునికి సమాచారం కూడా అందుతుందన్నారు. ధరణి పోర్టల్‌లో 36 మాడ్యూల్స్ ఉండగా భూభారతి పోర్టల్‌లో ఒకే ఛాప్టర్ కింద తీసుకువచ్చామన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, ఎనఐసి అధికారులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లర్లు వరి ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**



**హనుమకొండ ప్రతినిధి మార్చి 27 (జనం సాక్షి) :** హనుమకొండ జిల్లాలో రబీ సీజన్ కు సంబంధించి కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని రైస్ మిల్లర్లు దిగుమతి చేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలు లో రబీ సీజన్ కు సంబంధించి రైస్ మిల్లులకు ధాన్యం కేటాయింపు, దిగుమతి, తదితర అంశాలపై జిల్లాలోని రైస్ మిల్లర్లతో సమీక్షా సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఆయా ప్రాంతాలలో ఉన్న రైస్ మిల్లులకు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కేటాయింపులు చేయనున్నట్లు తెలిపారు. సంబంధిత ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా వచ్చిన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం దిగుమతి చేసుకోవాలని రైస్ మిల్లర్లకు సూచించారు. ధాన్యం కేటాయింపు విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి రైస్ మిల్లర్లు తీసుకురావాలని తెలిపారు. ధాన్యం కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు చేసేటప్పుడు ప్యాడి క్లీనర్ల ద్వారా శుభ్రపరచిన ధాన్యాన్ని బిల్లులకు పంపించాలని ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లు తమ రైస్ మిల్లులో ధాన్యాన్ని భద్రపరచుకునేందుకు వీలుగా సరైన స్థలాన్ని ఉండేటట్లు చూసుకోవాలన్నారు. మిల్లులకు నేరుగా వచ్చిన ధాన్యాన్ని తీసుకోవద్దని మిల్లర్లకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఎండి వాజిద్ అలీ, జిల్లా సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, ఇతర అధికారులతో పాటు జిల్లాకు సంబంధించిన రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

# గోదిరే సూరయ్య పని... అదిరే!

- విద్యుత్ తీగలపై సర్కస్ ఫీట్లను తలపించిన అన్ మ్యాన్డ్ వర్కర్ సూరయ్య
- లైన్ క్లియరెన్స్ కోసం చెట్ల కొమ్మలు తొలగింపు





**ములుగు/వెంకటాపూర్, మార్చి 26 (జనంసాక్షి):** ప్రజలకు నిత్యం విద్యుత్ వెలుగులు అందించేందుకు ప్రాణాలకు తెగించి సిబ్బంది చేసే సాహసాలు,శ్రమ చాలామందికి కనిపించవు. గురువారం ఇంచెన్ చెరువుపల్లి గ్రామ పరిధిలో విద్యుత్ లైన్ క్లియరెన్స్ లో భాగంగా చెట్ల కొమ్మలను తొలగించేందుకు అన్మ్యాన్డ్ వర్కర్ గొదిరె సూరయ్య విద్యుత్ తీగలపై నడిచి వెళ్తూ సర్కస్ ఫీట్లను తలపించేలా చేసిన పనులు విద్యుత్ సిబ్బంది కష్టాలకు ప్రతిబింబంగా కనిపిస్తున్నాయి. మండు వేసవిని సైతం లెక్కచేయకుండా రైతులకు విద్యుత్ ఆటంకాలు లేకుండా ఉండేందుకు తీగల వెంట ఉన్న సమస్యలను తొలగించేందుకు వెంకటాపూర్ ఏఈ రమేష్ ఆధ్వర్యంలో ఏఎల్ఎం కృష్ణాకర్ సిబ్బందితో కలిసి చేస్తున్న పనులలో వెంకటాపూర్ సెక్షన్ లక్ష్మీదేవిపేట పరిధిలో పనిచేస్తున్న అన్ మ్యాన్డ్ వర్కర్ పనితీరును చూసిన పలువురు గొదిరే సూరయ్య.. పని అదిరిందయ్యా...అంటూ అభినందిస్తున్నారు. కాగా ఎన్‌పీడీసీఎల్ సీఎండీగా కార్తికేయ మిశ్రా ఉన్న సమయంలో అన్‌మ్యాన్డ్ వర్కర్ వ్యవస్థ అమలులోకి వచ్చింది. 2013 నుంచి వీరు పనిచేస్తున్నారు. విద్యుత్ లైన్‌మెన్ కింద సహాయకులుగా వీరిని నియమించారు. అన్‌మ్యాన్డ్ అంటే అన్‌స్కిల్డ్ అని అర్థం. ఎన్‌పీడీసీఎల్‌లో పనిచేస్తున్న అన్‌మ్యాన్డ్ కార్మికుల శ్రమకు తగ్గ వేతనాలు అందించేలా ప్రభుత్వం, విద్యుత్ శాఖ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# మద్యం మత్తులో డ్రైవింగ్

- కారు ఢీకొని పలువురికి గాయాలు

**కామారెడ్డి, మార్చి26 (జనంసాక్షి) :** మద్యం మత్తులో ఒక వ్యక్తి కారును రాంగ్ రూట్‌లో నడిపి.. పలువురు గాయపడేందుకు కారణమయ్యాడు. స్థానికులు అతడిని పోలీసులకు అప్పగించారు. అతడిపై పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కామారెడ్డి కొత్త బస్టాండ్ రోడ్డులో గురువారం ఉదయం కారును రాంగ్ రూట్‌లో నడిపి డ్రైవర్ బీభత్సం సృష్టించాడు. స్థానిక జయ ఆసుపత్రి ముందు నిలిపి ఉంచిన వాహనాలను తన కారుతో ఢీ కొట్టాడు. అనంతరం బైక్‌పై వెళ్తున్న జంటను ఢీ కొట్టి.. పార్క్ చేసిన మూడు బైక్‌పైకి కారును వేగంగా నడిపాడు. అలాగే రెడ్డి టిఫిన్ సెంటర్ వద్ద ఆగి ఉన్న అంబులెన్స్‌ను సైతం ఢీ కొట్టాడు. దాంతో కారు వేగం తగ్గింది. ఈ ఘటనలో గాయప డిన వారిని కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్‌ను కఠినంగా శిక్షించాలని పోలీసులకు బాధితులు విజ్ఞప్తి చేశారు.

# జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి

- ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలి
- నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ అర్ ఎల్ మూర్తి
- చలో అసెంబ్లీ కి ర్యాలీగా వెలుతున్న విద్యార్థి నిరుద్యోగ నేతల అరెస్టు







**హైదరాబాద్ (జనంసాక్షి) :** నిరుద్యోగ జేఏసీ, డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చలో అసెంబ్లీ కార్యక్రమంలో భాగంగా ఓయూ మెయిన్ లైబ్రరీ నుండి అసెంబ్లీకి ర్యాలీగా బయలుదేరిన నిరుద్యోగ జేఏసీ నేతల అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ఓయూ రీసెర్చ్ స్కాలర్ ఆర్ ఎల్ మూర్తి మాట్లాడుతూ రాష్ట్ర అసెంబ్లీ జరుగుతున్న సందర్భంగా నిరుద్యోగ అంశాన్ని అసెంబ్లీలో చర్చించాలని, గతంలో ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ గారు నిరుద్యోగులతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగ సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. దాదాపుగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలవుతున్న ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడం దుర్మార్గమని అన్నారు గత ప్రభుత్వంలో ఇచ్చిన నోటిఫికేషన్ లకు ఉద్యోగాల నియామక పత్రాలు అందించారు తప్ప కొత్తగా ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇచ్చింది ఏం లేదని ఈ సందర్భంగా వారు అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి జాబ్ క్యాలెండర్ వెంటనే ప్రకటించాలి,ఖాళీగా ఉన్న అన్ని ఉద్యోగాలకు తక్షణమే నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలి ని వారు డిమాండ్ చేశారు. యూనివర్సిటీల్లో ఖాళీ టీచింగ్, నాన్–టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని, డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు నెలకు రూ. 4,000 భృతి వెంటనే ఇవ్వాలి, రాజీవ్ యువ వికాస్ రుణాలు అందరికీ విడుదల చేయాలి, ఉచిత కోచింగ్ సెంటర్లు పెంచి స్టైపెండ్ ఇవ్వాలి, స్టూడెంట్స్ ఎన్నికలు నిర్వహించాలిని అసెంబ్లీ లో ఈ అంశాలపై చర్చించాలని కోరినారు ప్రజా పాలన లో నిర్బంధాన్ని అమలు చేస్తున్నారని అన్నారు అన్నారు ఓయూ అభివృద్ధి కోసం వెయ్యి కోట్లను వెంటనే విడుదల చేయాలని కోరారు. అరెస్టు అయిన వారిలో నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్థి అర్ ఎల్ మూర్తి, జేఏసీ నేతలు క్రాంతి, హారూన్ రాజు, ఆంజనేయులు 42% బీసీ రిజర్వేషన్ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ వేణు నిరుద్యోగులు ఉన్నారు.

## ఒకే స్కూల్ నుండి 28 మంది విద్యార్థుల ఎంపిక



**తుంగతుర్తి (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశాల కోసం నిర్వహించిన టీజీసెట్ –2026 ప్రవేశ పరీక్ష ఫలితాల్లో తుంగతుర్తి మండల పరిధిలోని వెంపటి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యా యురాలు చిత్తలూరి వెంకట్రామనరసమ్మ మాట్లాడుతూ.. వెంపటి పాఠశాల నుండి మొత్తం 35 మంది విద్యార్థులు పరీక్ష రాయగా అందులో 28 మంది విద్యార్థులు అర్హత సాధించి సీట్లు పొందారని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదల, తల్లిదండ్రుల సహకారం కలిసి సాధించిన విజయం సాధించామన్నారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులకు పునాది స్థాయి నుంచే సరైన మార్గదర్శనం, సాధన, పరీక్షలపై అవగాహన కల్పించడం ద్వారా ఈ ఫలితాలు సాధించగలిగినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భీవనపల్లి శ్రీనివాస్, మల్లెపాక రవీందర్, గట్టు మాధవి, నిమ్మరబోయిన నవీన, బండారు భవాని, జీడి అనిల్ కుమార్, మిట్టగడుపుల విక్రమ్, మాలోతు కృష్ణ, గుండ్ల ఆంజనేయులు, రామణబోయిన మౌనిక, అబ్బగాని మంజుల, శీలోజు రమాదేవి పాల్గొన్నారు.

# పసుపు బోర్డుకు కేంద్ర నిధులను కేటాయించండి

**కేంద్ర మంత్రికి తెలంగాణ రైతు ఐక్య వేదిక వినతి**



**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలోని పసుపు బోర్డుకు కేంద్ర నిధులను కేటాయించేలా ప్రధాని నరేంద్ర మోడీ దృష్టికి తీసుకువెళ్లి నిధులను కేటాయించేందుకు తగు చర్యలు తీసుకోవాలని కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు తెలంగాణ రైతు ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు న్యూఢిల్లీలోని సమాచార భవన్ లో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్ లో పసుపు బోర్డును కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటికీ ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ లో పసుపు బోర్డుకు నిధుల కేటాయింపులు జరుపకపోవడం విచారకరమన్నారు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణ రైతాంగానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి పసుపు బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ కేంద్ర బడ్జెట్ లో పసుపు బోర్డుకు నిధుల కేటాయింపుపై ఏ మాత్రం స్పష్టత లేదన్నారు. కేంద్ర ప్రభుత్వానికి అధికంగా పన్ను చెల్లిస్తున్న తెలంగాణ రాష్ట్రానికి నిధుల కేటాయింపుల్లో పూర్తిగా మొండి చెయ్యి చూపిందన్నారు. పసుపు బోర్డు ప్రారంభోత్సవం సందర్భంగా రూ. 10 వేల కోట్ల ఎగుమతులకు అవకాశాలు కల్పిస్తామని స్వయంగా కేంద్రమంత్రి వెల్లడించినప్పటికీ, ఆ దిశగా చర్యలు శూన్యమని అన్నారు. తెలంగాణ పసుపు రైతుల భవిష్యత్తును, ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రధాని నరేంద్ర మోడీ దృష్టికి తీసుకువెళ్లి పసుపు బోర్డుకు కేంద్ర నిధులను కేటాయించేలా తగు కృషి చెయ్యాలని కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కు సమర్పించిన వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు.

# టీజీవో కేంద్ర కార్యాలయానికి స్థలం కేటాయింపు పట్ల హర్షం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** టీజీవో కేంద్ర సంఘం భవనానికి 600 చదరపు గజాల స్థలం కేటాయించి రాష్ట్ర ప్రభుత్వం జీవో ఇచ్చినందుకు ముఖ్యమంత్రికి ప్రభుత్వ బాధ్యులకు టీజీవో హైద్రాబాద్ జిల్లా బ్రాంచ్ తరపున ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ హైదరాబాద్ జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం గురువారం సాయంత్రం నాలుగు గంటలకు జలసౌధ బిల్డింగ్ లో ఎర్రమంజిల్ హైదరాబాద్ టీజీవో జిల్లా బ్రాంచ్ అధ్యక్షులు ఎం.బి.కృష్ణ యాదవ్ అధ్యక్షతన జరిగింది. కార్యదర్శి ఎం.ఎ.ఖాదర్ సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సమావేశంలో టీజీవో హైదరాబాద్ జిల్లా కార్యవర్గం, జిల్లా ఫోరం నాయకులు, మహిళా భాగం కార్యవర్గం పాల్గొన్నారు. కేంద్ర సంఘం భవనానికి 600 గజాల స్థలం కేటాయింపుకై అహర్నిశలు కృషిచేసిన కేంద్ర సంఘం అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావుకి, జనరల్ సెక్రెటరీ బి.శ్యామ్‌కి టీజీవో హైదరాబాద్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఎం బి కృష్ణ యాదవ్, సెక్రెటరీ ఎం. ఎ.ఖాదర్ ధన్యవాదాలు తెలిపారు. టిజివో హైదరాబాద్ జిల్లా బ్రాంచ్ ఆఫీస్ బిల్డింగ్ కోసమై 1000 చదరపు గజాలు కేంద్ర సంఘం అధ్యక్ష కార్యదర్శుల ద్వారా ప్రభుత్వానికి విన్నవించారు. పెండింగ్లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని తీర్మానించారు. హైదరాబాద్ లో పనిచేస్తున్న అధికారులు ఉద్యోగులు వారానికి ఐదు రోజులు పని దినాలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేశారు. రాష్ట్రంలో కాంట్రిబ్యూషన్ పెన్షన్ సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ స్కీం ఓపీఎస్ పునరుద్ధరణ చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో టిజివో హైదరాబాద్ జిల్లా బ్రాంచ్ వైస్ ప్రెసిడేట్స్ ఏ.రాజేందర్, డాక్టర్.కృపాల్ సింగ్, జాయింట్ సెక్రెటరీస్ డాక్టర్ క్రొత్త విద్యాసాగర్, మొహమ్మద్ గౌస్, డాక్టర్.సునీత జోషి, డాక్టర్. జె. రవికుమార్, పి. పిరయ్య, మంచాల రవీందర్, జి.శ్రవణ్ కుమార్ రెడ్డి, డాక్టర్. జి. గాయత్రి దేవి, డాక్టర్. అమరావతి యాదవ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ బి.జ్యోతి, టి. వి.సరస్వతి, డాక్టర్. వి.సాయిబాబా, విజయ సారథి, తదితరులు పాల్గొన్నారు.



# వైద్యునిపై దాడి.. నిర్మల్‌లో వైద్యుల ఆగ్రహం

- జాతీయ రహదారి దిగ్బంధనం

**నిర్మల్ బ్యూరో, మార్చి 26 (జనంసాక్షి) :** నిర్మల్ పట్టణంలో ప్రముఖ పిల్లల వైద్యుడు డా. సంతోష్ రాజ్‌పై గురువారం రాత్రి జరిగిన దాడిని ఖండిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో వైద్యులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట జాతీయ రహదారిపై వైద్యులు, వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ మరియు ఇతర హిందూ సంఘాల సభ్యులు బైఠాయించి నిరసన తెలిపారు. దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ప్రాణాలు కాపాడే వైద్యులపై ఇలాంటి దాడులు జరగడం అత్యంత అమానుషమని, సమాజానికి హానికరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనను ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఖండించాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుని భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరుతూ ధర్నా కొనసాగుతోంది..

## పోలీసుల కాళ్లమీద పడ్డ రైతులు

**పరిగి (జనంసాక్షి) :** ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో తమ పొలాలను అన్యాయంగా లాక్కోవద్దని రైతులు ఆందోళనకు దిగారు. వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలో రైతులు ఆందోళన చేస్తున్నారు. ఇండస్ట్రియల్ పార్క్ పేరిట పరిగి నియోజకవర్గం కాడ్లాపూర్, రాపోలు గ్రామాల్లో మొత్తం 1200 ఎకరాల భూమిని కాంగ్రెస్ సర్కారు అన్యాయంగా దోచుకుంటున్నది. ఈ నేపథ్యంలో తమ పొలాలను ఇండస్ట్రియల్ పార్క్ కోసం లాక్కోవద్దంటూ పరిగి బస్టాండ్ ముందు ఇవాళ రైతులు ఆందోళన చేపట్టారు. అయితే ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నించారు. ఈ సందర్భంగా.. పంటలు పండే తమ భూములు లాక్కోవద్దంటూ రైతులు పోలీసుల కాళ్ల మీద పడి ప్రాధేయపడ్డారు. అయినా పోలీసులు వినిపించుకోలేదు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రైతులపై దాడి చేశారు.

# బహుజనుల కళలు, కళాకారులు ఎటువైపు?

మనిషి భావాలను, అనుభవాలను, సమాజంలోని వాస్తవాలను ప్రత్యక్షంగా ప్రదర్శించే కళారూపం రంగస్థలం. ఇందులో కథ, మాట, పాట, నృత్యం, భావవ్యక్తీకరణ వంటివన్నీ కలిసి ఉంటాయి. ఒక వేదికపై నటులు పాత్రలు ధరించి, సంభాషణలు, పాటలు, భావవ్యక్తీకరణతో కథను జీవంగా చూపిస్తారు. ఇది కేవలం వినోదం కాదు–సమాజాన్ని ప్రతిబింబించే అద్దం, ప్రశ్నించే వేదిక, చైతన్యం కలిగించే సాధనం. అందుకే రంగస్థలం "జీవిత నాటకం"గా భావించబడుతుంది. ప్రతి సంవత్సరం మార్చి 27న ప్రపంచ రంగస్థల దినోత్సవంను ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు. ఈ రోజు రంగస్థల కళకు, కళాకారులకు, సమాజాన్ని చైతన్యపరచడంలో దాని పాత్రను గౌరవించుకుంటారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో అక్కడ స్థానిక ప్రజల జీవన విధానంలో నుంచి పలు రంగస్థలం నాటకాలు ఆవిర్భవించాయి. తెలంగాణలో కూడా రంగస్థలం ప్రజల జీవనశైలితో బలంగా ముడిపడి ఉంది. ముఖ్యంగా బుర్రకథ, ఒగ్గుకథ, చిందు, దక్కలి కులాల కథలు ఇందుకు ఉదాహరణ. జానపద నాటకాలు గ్రామాల్లో జరిగే నాటకాలు ఎక్కువగా సామాజిక సమస్యలను ప్రతిబింబిస్తాయి–కుల వివక్ష, పేదరికం, అన్యాయం వంటి అంశాలను స్పష్టంగా చూపిస్తాయి. ఇవి ప్రజల్లో అవగాహన పెంచుతాయి.



కళల పుట్టుకకు కారణం

భారతదేశం స్వభావికంగా కులం ఆధారంగా విభజించబడింది. ఇందులోని అట్టడుగున బహుజన వర్గాలంతా ఈ దేశ మూలవాసులు. ఈ దేశ పరిపాలకులు. ఈ దేశానికి వలస వచ్చిన కొందరు అగ్రవర్ణాల అధర్మ యుద్ధంలో ఓడిన బహుజనలంతా తమ రాజుల వారసత్వ పోరాటాలను, విజయాలను, త్యాగాలను స్మరించుకోనే క్రమంలో పాటలు, సంగీతం, కథలు ఆవిర్భవించాయి. ఒకరకంగా ఇవన్నీ అట్టడుగు ప్రజల చైతన్యం, వీరత్వం, పోరాటం, కష్టాలు, ఆనందం నుంచి పుట్టిన కళా సౌందర్యాలు. వీటిని బహుజనులు రంగస్థల వీధి నాటకాల ద్వారా మౌఖికంగా తరతరాలుగా ప్రదర్శిస్తున్నారు. ఇవి తదుపరి వారి జీవనోపాధిగా కూడా మారింది. అందుకే నేటి బీసీ, ఎస్సీ, ఎస్టీ ల్లో కళాత్మక దృక్పథం వాళ్ళ డీఎన్ఏ లోనే ఉంటుంది. ఈ సాంస్కృతిక కళారూపాలకు మంచి లాభాలు రావడంతో అగ్రకులాలు సినిమా రంగంలో తీసుకొన్నారు. కాలానుగుణంగా వాటిని ఆధునికరించి ప్రేక్షకులను ఆకర్షిస్తున్నారు. కావున సినిమా కథ కథనం అంతా సబ్బండ కులాల జీవపుట్టుకలు. వీటిని అగ్రకుల ఆధిపత్య దర్శక, నిర్మాతలు, హీరోలతో సినిమాటి క్ గా మార్చి ప్రేక్షకులకు చూపెడుతున్నారు. ఇది ఒక పెద్ద వ్యాపార సామ్రాజ్యంగా విస్తరించింది. ఈ రంగాన్ని ఆధిపత్య కులాలు శాసిస్తున్నారు. వారే హీరోలు, దర్శకులు, నిర్మాతలవుతున్నారు. అణగారిన కులాల్లో నుంచి అక్కడక్కడ కమెడియన్లు, రౌడీలు వంటి చిన్న చిన్న జూనియర్ ఆర్టిస్టులుగానే తీసుకొంటారు. దాదాపుగా టాలీవుడ్ లో ఇప్పటివరకు రెండు, మూడే కుల సమూహాలే రాణిస్తున్నాయి. సినిమా రంగంలో కుమ్మరి వాళ్ళ కుండ, పద్మశాలీల బట్ట, యాదవుల గొంగడి, మహేంద్రుల(మేదరి)బుట్ట, మాదిగల డప్పు, గిరిజనుల వైవిద్యమైన ఆదిమ సాంస్కృతిక కళ జీవనం వంటి ఎన్నోహొకళారూపాలు సినిమా రంగంలో వాడుతున్నారు. ఇవన్నీ చలన చిత్ర పరిశ్రమలోని అతిపెద్ద మార్కెట్ గా మారాయి. అసలు సినిమా రంగం అంటేనే ఇప్పుడు ఆధిపత్య కుల సంస్కృతిగా మారింది. దళిత బహుజన కులాలకు మాత్రం స్థానం లేదు.

పాలకులకు తొత్తుగా మారిన కళలు.

చారిత్రకంగా చూస్తే, రంగస్థలం అనేది బడుగు బలహీన వర్గాల నుంచే ఎదిగింది. బహుజన వర్గాల వైవిద్యమైన సంస్కృతి, జీవనశైలి, ఆచార సాంప్రదాయాలు, పోరాటగాథలు కళాత్మకంగా ఉంటాయి. వారి జీవిత అనుభవాలు, పోరాటాలే కథలుగా, పాటలుగా రూపాంతరం చెందాయి. గ్రామీణ భారతంలో ముఖ్యంగా తెలంగాణలో ఇంకా కూడా బుర్రకథలు, ఒగ్గుకథలు, జాన పదాలు వంటి సంప్రదాయ కళారూపాలు జీవంతో ఉన్నాయి. ఈ కళాకారులు ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందినవారే. వారు తమ కళతో సమాజాన్ని ప్రశ్నిస్తున్నారు, జాగృతం చేస్తున్నారు. అయితే ఆధునిక సాంకేతికత పెరుగుదలతో రంగస్థలం వెనుకబడింది. సినిమా ప్రపంచం వెలుగులోకి రావడంతో రంగస్థల ప్రదర్శనలు తగ్గిపోయాయి. హీరోలు, హీరోయిన్ల ఆధిపత్యంలో సినిమా రంగం విస్తరించింది. కానీ ఈ విస్తరణలో కూడా కులాధిపత్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఫలితంగా అసలైన కళాకారులు–రంగస్థల నటులు–అనాదరణకు గురయ్యారు. ఇటీవల సోషల్ మీడియా, ముఖ్యంగా యూట్యూబ్ వంటి వేదికలు రంగస్థల కళాకారులకు కొంత ఆశ చూపించాయి. తమ ప్రతిభను ప్రపంచానికి చూపించే అవకాశం కలిగింది. సినిమా రంగం ప్రజాస్వామికరించబడి, రంగస్థలం కళాకారులకు అవకాశం ఇవ్వాలి. నేడు తెలంగాణలో బహుజన కళాకారుల ప్రతిభను అగ్రకుల నాయకులు వాడుకుంటూ ప్రజల్ని తమ వైపు తిప్పుకుంటున్నారు. పాలకులుగా మారారు. స్వధర్మాన్ని మరిచిన బీసీ ఎస్సీ ఎస్టీ కళాకారుల పెయిడ్ ఆర్టిస్ట్ గా మిగిలారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే వారి వెంట నడుస్తున్నారు. అంబేద్కర్ , పూలే మార్గాన్ని మరిచి, తమ స్వరాజ్య నిర్మాణానికి దూరమైపోతున్నారు. తెలంగాణ ఉద్యమం ఇందుకు నిదర్శనం. పాటలు, ఆటలతో ప్రజలను సంకల్పం, సంఘీభావం, సామాజిక చైతన్యం చేశారు. దళిత, బహుజన వర్గాల గోసి పెట్టుకొని, గొంగిడి కప్పుకొని తమ ఆత్మ గౌరవాన్ని విడిచిపెట్టి పాటలు పాడారు, ఆటలు ఆడారు, కథలు చెప్పారు. చిరవకు వచ్చిన తెలంగాణలో అణగారిన కులాల వాటా లేదు. బహుజన కళలు అగ్రకులాలకే ఉపయోగపడ్డాయని అర్థమవుతుంది. ఇకనైనా కళాకారులంతా పునః సమీక్షించుకొని తమ జాతి స్వప్రయోజనాల కోసం ముందుకు కదలాలి. అప్పుడే విముక్తి లభిస్తుంది.




**సంపతి రమేష్ మహారాజ్**
సామాజిక విశ్లేషకులు
7988579428

---

## నూతన శతాబ్ది యువ వైతాళికుడు
# నల్లాల లక్ష్మి రాజం






జగిత్యాల, కరీంనగర్ జిల్లా నుండి ఎదిగిన ప్రముఖ రచయిత, దళిత సాహితీవేత్త నల్లాల లక్ష్మి రాజం మార్చి 25 న అకాల మరణం దిగ్భ్రాంతి కలిగించింది. వీరి మరణం తెలుగు సాహిత్య రంగానికి తీరని లోటు . కథా రచయితగా, నాటకకర్తగా, పాటల కవిగా నల్లాల లక్ష్మి రాజం విశిష్ట స్థానం సంపాదించారు. ఆయన రచించిన "తిరుగు ప్రయాణం" కథల సంపుటి విశేష ఆదరణ పొందడంతో పాటు విశాల సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అందుకుంది. నూతన శతాబ్ది యువ వైతాళికుడు లక్ష్మి రాజం అని తిరుగు బాటు కథల సంపుటికి రాసిన నా ముందుమాటలకు నిదర్శనంగా ఎదిగిన వాడు. .( అదే సమయంలో ఎదిగిన నూతన వైతాళికులు నేరెళ్ల శ్రీనివాస్ గౌడ్, జాజుల గౌరి మొదలైన వారు)

లక్ష్మి రాజం "జీబీ రాజ్ జిందాబాద్" నాటక ప్రదర్శన ద్వారా మద్యపాన వ్యతిరేక చైతన్యాన్ని విస్తృతంగా వ్యాప్తి చేశారు. ఇందులో తాను రాసిన పాటలతో ఒక కళారూపం ఇచ్చారు.

కుల వివక్ష, అంటరానితనం వంటి సామాజిక సమస్యలపై ఆయన నిరంతరం పోరాడారు."నీ బాకీ తప్పక తీరుస్తాను..." అంటూ సామాజిక వ్యంగ్యంతో కూడిన ఆయన పాట ప్రజల్లో విశేష ప్రాచుర్యం పొందింది.

జగిత్యాల సమీపంలోని తక్కల్లపల్లి గ్రామంలో 5 అక్టోబర్ 1970న జన్మించిన లక్ష్మి రాజం విప్లవ భావజాలానికి సానుభూతి కలిగి జీవించారు. అంబేద్కర్ సంఘాలు పెట్టి పెత్తందారులను ఎదిరించారు. పెత్తందార్లు నక్సలైట్ అని ముద్ర వేసి కష్టాల పాలు చేయడంతో పోలీసు ఉద్యోగంలో చేరి పోయాడు.

ఇలా పరిస్థితుల కారణంగా పోలీస్ శాఖలో చేరి, కరీంనగర్ జిల్లాలో పోలీస్ విభాగం తరపున అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కవి సమ్మేళనాల్లో పాల్గొని ప్రజలు, అధికారుల ప్రశంసలు అందుకున్నారు. అనంతరం హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు.

1992 నుంచి తనకు పరిచయమై, కుటుంబ సభ్యుడిలా మారిన లక్ష్మి రాజం మరణం తీవ్రంగా కలచి వేసింది. వారి కిడ్నీలనుదానం చేసి వారి సహచరి రాధ తన ధైర్యాన్ని చైతన్యాన్ని ప్రదర్శించింది.

దళిత సాహిత్యంలో నల్లాల లక్ష్మి రాజం ఒక మణి పూస. దరకమే ఐక్య వేదికలో ఆవిర్భవించిన వజ్ర సంకల్పుడు నల్లాల లక్ష్మి రాజం. కథ, నవల, నాటకం, ప్రయోక్త , నటుడుగా కరీనగర్ జిల్లా వ్యాప్త గా ప్రజలలఅభిమానం చూరగొన్నారు. 1998 ఆగస్టులో జరిగిన నా యాభయి జన్మదిన స్వర్ణోత్సవం లో రాష్ట్ర వ్యాపితంగా రచయితలు పాల్గొనడంతో పాటు స్థానికంగా ఎందరో రచయితలు తమకుతాము వెల్లడి కావడానికి ఒక వాహిక అయింది.

సాహిత్యంలో లక్ష్మి రాజం గారిది ప్రత్యేక ముద్ర.

1990 నుండి బీసీ ఎస్సీ ఎస్టీ రచయితలను, కళాకారులను , మేధావులను ఒక వేదికపైకి తీసుకు రావడానికి చేసిన కృషిలో వేలాది మంది ఎదిగి వచ్చారు. అంతదాకా వర్గ దృక్పథం తప్ప జీవితంలో అనేక రూపాల్లో కొనసాగుతున్న కుల వివక్ష , అసమానతలు , అణిచి వేతలను పెట్టించుకునే చైతన్యం కోల్పోయిన దశలో దరకమే ఆవిర్భవించింది. లక్షలాది ప్రజలకు ధైర్యాన్ని అందించింది. బుద్ధుడు నుండి మహాత్మా జ్యోతిరావు ఫూలే , డాక్టర్ బి ఆర్ అంబేద్కర్, కాన్సీరాం దాకా గల చరిత్ర వారసత్వాన్ని స్వీకరించింది.

వేలాదిగా ఎదిగిన దరకమే ఐక్య వేదిక బిడ్డలు

1993 ఫిబ్రవరిలో రెండు రోజులపాటు జరిగిన తొలి రాష్ట్ర మహాసభలు రాష్ట్ర సాహిత్య సామాజిక చరిత్రను మలుపు చివ్వాయి. సమస్థ వర్గ కు లింగ జాతి మత ప్రాంత దేశ భాష వివక్షలను అసమానతలను తొలిగించే కృషి ని తన కర్తవ్యంగా ప్రటించుకుంది. అలా ఎదిగిన వందలాది రచయితల్లో నల్లాల లక్ష్మి రాజం , కల్లపెల్లి రామ లక్ష్మణ్ , కె వెంకట రమణ, పులి గోవర్ధన్, రమేశ్, నేరెళ్ల శ్రీనిస్ గౌడ్, జగిత్యాల కావడం నాకు మరింత సన్నిహితులయ్యారు. క్రమంగా కుటుంబ సభ్యులుగా కలిసి పోయారు.

నల్లాల లక్ష్మి రాజం భావాల్లో ఒక స్పష్టత వుంది. భావ వ్యక్తీకరణలో బాణం సూటిగా గుండెల్లో దిగుతుంది. జీవితం నేర్పిన అనుభవాలకు అంబేద్కరిజం, దరకమే ఐక్యవేదిక ఆసరా నిచ్చాయి. ఆశు కవితలా అనేకం రాస్తూ వినిపిస్తూ ఎదుగుతూ వచ్చారు. తన రచనల ద్వారా సాహిత్య రంగంలో గుర్తింపు పొందారు.. కాళీ పట్నం రామారావు గారి కథా నిలయంలో ఈ కథలు వెబ్ సైట్ లో చేర్చారు. ..

**1) అంతర్మథనం, కథ, పత్రిక: ప్రజాతంత్ర - వారంప్రచురణ తేది:2005-07-24**
**2) తిరుగు ప్రయాణం, పత్రిక: సుప్రభాతం - వారంప్రచురణ తేది: 2002-06-01**
**3) మావూరి ముచ్చట్లు, కథ, పత్రిక: నేటినిజం - వారంప్రచురణ తేది: 2002-05-31**
**4) యమపురి.. కథ, పత్రిక: సుప్రభాతం - వారంప్రచురణ తేది:, 2001-10-27**
**5) రాజవ్వ కొడుకు, కథ, పత్రిక, నేటినిజం . ప్రచురణ తేది: 2002-03-15**

2003 లో వెలు వడిన తిరుగుబాటు కథల సంపుటిలో ఈ కథలతోపాటు దొమ్మరి గంగడు, పునరావృతం, భలే బమ్మర్ది, యమపురిలో ఒకరోజు, పడగ నీడలో పావురాలు, కథలు చోటు చేసుకున్నాయి. ఆ తరువాత కూడా పలు కథలు రాసారు. తిరుగుబాటు కథల సంపుటికి విశాల సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు. బి ఎస్ రాములు జన్మదిన సభల్లో నల్లాల లక్ష్మి రాజం, జనగామ శంకర్ లు రాసిన జన్మదిన పాటలు

ఒక ప్రత్యేక ఆకర్శణ గా నిలిచేవి. నా గురించి కాకుండా మా శ్యామల జీవితాన్ని నవలగా రాస్తున్నానని అపుడపుడు కొంత వినిపించేవాడు. తండ్రికి భయ పడే కొడుకులా నాతో కన్నా శ్యామలతోనే అమ్మా అమ్మా అంటూ ఫోన్ చేసి మాట్లాడి నాకు చెప్పుమనే వాడు

లక్ష్మి రాజం రాసిన జిబీ రాజ్ జిందాబాద్ నాటిక ఒక ప్రత్యేక కళా రూపం. అది నాటకమా నిజ జీవితమా అని ప్రేక్షకులు ఆశ్చర్య పోతారు. అందులో అనేక పాటలు టాయిలెట్. అవన్నీ కుల వివక్షను, వ్యసనాలను వివరించినా చైతన్య పరిచేవే. తాను రాసిన అనేక పాటలను మధ్యలో సందర్భానుసారం పాడేవారు. వారి దృష్టి నిశితమైనది. ఉదాహరణకు మార్క్సిజాన్ని జీర్ణించుకొని ఉత్పత్తి సంబంధాల సిద్ధాంతాన్ని మరో అడుగు ముందుకు తీసుకెళ్లుతూ కులం రీత్యా ఉత్పత్తి సంబంధాలు ఎలా మారాలో లక్ష్మి రాజం ఈ పాటలో వివరించారు.

":ఎంత దాక ఈ పోరాటం అంటావా ఓ దళిత బహుజన!
ఈ కుల వృత్తులు తారుమారైయ్యే దాక ఓ దళిత బహుజన!
కోమట్లు పెండ్లిలో డప్పులు గొట్టేటి
బ్రహ్మలు ఊరిలో బట్టలు ఉతికేటి
రెడ్డిలు క్షవరాలు గడ్డాలు తీసేటి
వెలమ దొరలు ఊరి సుంకరులుగ తిరిగేటి
ఆ రోజులు వచ్చేంత వరకు ఓ దళిత బహుజన
ఆగదు అంబేద్కర్ పోరాటం ఓ దళిత బహుజన!"

ఇదే పాటను మరో తీరుగా కూడా పాడారు.

" నీ బాకీ తప్పక తీరుస్తా!
కోమట్లు పెండ్లిలో డప్పులు కొట్టినప్పుడు
బ్రాహ్మలు ఊరిలో బట్టలు ఉతికినపుడు
రెడ్డిలు క్షవరాలు గడ్డాలు తీసినప్పుడు
వెలమ దొరలు ఊరికి సుంకరులుగ చిరిగప నపుడు
నీ బాకీ తప్పక చెల్లిస్తా!! అంత దాక నీ బాకీ అడగవద్దు.
అని కూడ పాడుతారు

జీబీ రాజ్ జిందాబాద్ నాటక ప్రదర్శనతో మద్య పాన వ్యతిరేక చైతన్యం కలిగించారు. కుల వివక్ష అంటరాని తనం పై నిరంతరం పోరాటం చేసారు. పోలీస్ ఉద్యోగంలో చేరి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పోలీసు శాఖ తరఫున అనేక కళా ప్రదర్శనలు, ఇవ్వడం, కవి సమ్మేళనాల్లో పాల్గొని అధికారులతో పాటు ప్రజల ప్రశంసలు అందుకున్నారు. హెడ్ కానిస్టేబుల్ గా ప్రమోషన్ పొందారు. ఢిల్లీలో 2003 లో దళిత సాహిత్య అకాడమీ చే అంబేద్కర్ ఫెలో షిప్ పొందారు. పోలీసు శాఖ ఉన్నతాధికారులు అనేక ప్రశంసలు ప్రోత్సాహాలు అందించారు. తిరుగుబాటు కథల సుంపుటికి రచయిత ముందుమాటతో పాటు, జైశెట్టి రమణయ్య, కాలువ మల్లయ్య, వేముల పెరుమాళ్లు ఆశీస్సులందించారు. వీరి రచనలు చాలా వున్నాయి. అవి పుస్తక రూపంలో వెలువడినపుడు వీరి విస్తార కృషి లోకానికి అందుతుంది.



**- బి ఎస్ రాములు**
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

---



# యుద్ధ ప్రమాదం నుండి వివేకం వైపు ఇరాన్–అమెరికా సంక్షోభంపై సైనిక విశ్లేషణ

అమెరికా, ఇరాన్‌ల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో మేజర్ జనరల్ జీడీ బక్షి చేసిన వ్యాఖ్యలు సైనిక వ్యూహం, భౌగోళిక రాజకీయాలు, దౌత్య వివేకంపై లోతైన ప్రశ్నలను లేవనెత్తుతాయి. "ఇరాన్ లోకి సైనికులను పంపడం అమెరికాకు ఆత్మహత్య లాంటిదే" అన్న ఆయన హెచ్చరిక, కేవలం అతిశయోక్తి కాకుండా ఆ ప్రాంతంలోని సంక్లిష్ట భౌగోళిక, సైనిక, వ్యూహాత్మక వాస్తవాలను స్పృశిస్తుంది. మొదటగా, రష్యా నుండి ఇరాన్‌కు సైనిక సామగ్రి సరఫరా అవుతున్న తీరు ఈ సమీకర ణాన్ని మరింత క్లిష్టతరం చేసింది. 17 ఆంటోనోవ్–124 విమానాల ద్వారా భారీ ఎత్తున ఆధునిక వాయు రక్షణ వ్యవస్థలు, ముఖ్యంగా వి400 మిలియన్ల విలువైన యాంటీ–ఎయిర్ మిస్సైళ్లు ఇరాన్ చేరుకున్నాయని అమెరికన్ మీడియా కూడా నివేదించడం గమనార్హం. అంటే ఇరాన్ యొక్క సైనిక సామర్థ్యం కేవలం ప్రాంతీయ స్థాయికే పరిమితం కాదని, ప్రముఖ ప్రపంచ శక్తి అయిన రష్యా దానికి వ్యూహాత్మక మద్దతును అందిస్తోందని స్పష్టమవుతుంది. ఇది అమెరికాకు ఒక ప్రత్యక్ష సైనిక సవాలుగా మారింది. రెండవది, భౌగోళిక పరిమాణం, సైనిక విస్తరణ సవాళ్లు. ఇరాన్ ప్రధాన చమురు నిక్షేపాలు సుమారు 5,000 చదరపు మైళ్ల విస్తీర్ణంలో విస్తరించి ఉన్నాయి. ఇంత విశాల ప్రాంతాన్ని కేవలం 1,000 మంది అమెరికన్ సైనికులతో నియంత్రించడం అసాధ్యమని జనరల్ బక్షి వాదన చాలా వాస్తవికమైనది. ఆధునిక యుద్ధంలో భూభాగ నియంత్రణకు కేవలం మానవబలం మాత్రమే కాదు, స్థానిక ప్రతిఘటన, గెరిల్లా యుద్ధ వ్యూహాలు, ప్రత్యర్థి యొక్క భౌగోళిక ప్రయోజనాన్ని ఎదుర్కొనే సామర్థ్యం కూడా కీలకం. ఇరాన్ వంటి పెద్ద దేశంలో, ఇరానియన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్ జీసీ) వంటి బలీయమైన సైనిక దళాలతో సమర్థవంతమైన భూప్రాంత యుద్ధానికి దిగడం అంటే లక్షలాది మంది సైనికులను మోహరించడం, అపారమైన వ్యయం, సుదీర్ఘ సైనిక ప్రమేయం అవసరం. ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్ లలో అమెరికా ఇప్పటికే ఇలాంటి సుదీర్ఘ సైనిక ప్రమేయం వల్ల ఎదురైన నష్టాలు, రాజకీయ ఎదురుదెబ్బలు చరిత్రలో నిక్షిప్తమై ఉన్నాయి.

మూడవది, వ్యూహాత్మక ఆయుధాల సమకూర్చుకోవడం. రష్యా నుండి భుజం మీద నుండి ప్రయోగించే ( మ్యాన్ –పోర్టబుల్ ఎయిర్ – డిఫెన్స్ సిస్టమ్స్ -Air-Defensవ ఎం.ఏ.ఎనత.పీ.ఏ.డీ.ఎస్. ) యాంటీ ఎయిర్ మిస్సైళ్లు ఇరాన్ చేరుకోవడం, వాటిని సుమారు 2,000 మంది ఇరాన్ సైనికులు ఉపయోగించగల సామర్థ్యం కలిగి ఉండటం అమెరికా యొక్క వైమానిక ఆధిపత్యానికి పెద్ద సవాలుగా మారుతుంది. ఆధునిక యుద్ధాల్లో అమెరికా తన శ్రేష్ఠతను నిలుపుకోవడానికి హెలికాప్టర్లు, డ్రోన్లు, వైమానిక దళాలపే ఆధారపడుతుంది. ఈ రక్షణ వ్యవస్థలు ఇరాన్ కు చిన్న, చురుకైన, తక్కువ ఎత్తులో ఉండే వైమానిక లక్ష్యాలను ధ్వంసం చేసే శక్తిని అందిస్తాయి. దీనివల్ల అమెరికా యొక్క వైమానిక దాడుల ప్రభావం తీవ్రంగా తగ్గిపోయే ప్రమాదం ఉంది.

ఈ పరిస్థితుల్లో జనరల్ బక్షి చేసిన వ్యాఖ్యలు ఒక సైనిక వ్యూహకర్తగా ఆయనకున్న దీర్ఘదృష్టికి నిదర్శనం. "బుద్ధి ఉన్న ఏ ప్రెసిడెంట్ కూడా ఇలాంటి పరిస్థితుల్లోకి ఎందుకు చేస్తున్నామో తెలియని యుద్ధంలోకి తమ సైనికులను పంపరు" అని ఆయన అన్న మాటలు వియత్నాం, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్ యుద్ధాల నుండి అమెరికా నేర్చుకోవలసిన పాఠాలను గుర్తు చేస్తున్నాయి. ఒక యుద్ధం యొక్క ప్రారంభం చాలా సులభంగా ఉండవచ్చు, కానీ దాని నిర్ణయం, నిష్క్రమణ దుర్భరంగా మారే అవకాశం ఉంటుంది. ఇరాన్ విషయంలో, హార్ముజ్ జలసంధి ద్వారా ప్రపంచ చమురు సరఫరాలో గణనీయ భాగం జరగడం, ఇరాన్ పై దాడి ప్రాంతీయ దేశాల్లో అస్థిరతను పెంచడమే కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

మొత్తంమీద, మేజర్ జనరల్ జీడీ బక్షి చేసిన ఈ వ్యాఖ్యలు కేవలం ఒక సైనిక అధికారి వ్యక్తిగత అభిప్రాయంగా కాకుండా, ఇరాన్ తో అమెరికా పూర్తిస్థాయి సైనిక ఘర్షణకు దిగడం వల్ల కలిగే విపరీతమైన మానవ, ఆర్థిక, వ్యూహాత్మక నష్టాలను ఎత్తి చూపే ఒక హెచ్చరికగా భావించాలి. రష్యా వంటి శక్తి ఇరాన్ కు ఆధునిక ఆయుధాలను సరఫరా చేస్తున్న నేపథ్యంలో, భౌగోళిక విస్తీర్ణం, స్థానిక ప్రతిఘటన సామర్థ్యం, ప్రాంతీయ అస్థిరత అనే అంశాలు ఆ యుద్ధాన్ని అమెరికాకు దీర్ఘకాలిక చరమగీతంగా మార్చగలవు. అంతర్జాతీయ సంబంధాల్లో దౌత్యం, ఆర్థిక ఒత్తిళ్లు, దూత వంటి ప్రత్యామ్నాయాలు ఎల్లప్పుడూ సైనిక దాడి కంటే ఎక్కువ ప్రయోజనకరమని ఈ విశ్లేషణ స్పష్టం చేస్తుంది. బుద్ధిశాలి నాయకత్వం అంటే యుద్ధాన్ని ప్రారంభించడం కాదు, అనివార్యమైన నష్టాలను అంచనా వేసి, శాంతియుత పరిష్కారానికి అవకాశం కల్పించడమే అని ఈ వ్యాఖ్యలు నొక్కి చెబుతున్నాయి.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
9849328496.

---



## నీరు వృధ చేయకండి

వృధ అవుతుంది వృధ
నేడు కర్ణాటక
మొన్న లతూర్
ఎన్నో సజీవ సాక్షాలు
చుక్క చుక్క ఒడిసి పట్టు
నీరు సార్వత్రిక ద్రావణి
సకల జీవుల మనుగడకు
ప్రాణాదారం
నేటి అజాగ్రత్త రేపటికి ముప్పు
నేటి జాగ్రత్త రేపు తప్పు ముప్పు
నీటి పొదుపు రేపటికి మలుపు

**ఉమాశేషారావు వైద్య**
9440408080

---

# తెలుగు భాష.. కనుమరుగవుతున్నదా - లేక నిర్లక్ష్యంతో బలహీనపడుతున్నదా?

తెలుగు భాష గురించి ఈ రోజుల్లో వ్యక్తమవుతున్న ఆందోళన యాదృచ్ఛికం కాదు. పాఠశాల విద్యలో ఆంగ్ల మాధ్యమం ఆధిపత్యం పెరగడం, ఇంటి సంభాషణల్లో తెలుగుకి బదులుగా మిశ్రమ భాషలు చొరబడడం, ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు పూర్తి స్థాయిలో వినియోగంలో లేకపోవడం, పట్టణ కుటుంబాల్లో పిల్లలు తెలుగును చదవగలిగినా రాయలేకపోవడం లేదా రాసినా సంభాషణలో సౌలభ్యం కోల్పోవడం వంటి పరిణామాలు భాషా భవిష్యత్తుపై తీవ్ర చర్చకు దారితీశాయి. అయితే "తెలుగు ఏ సంవత్సరం నుంచి పూర్తిగా కనుమరుగవుతుంది?" అనే ప్రశ్నకు ఖచ్చితమైన సంవత్సరం చెప్పడం శాస్త్రీయంగా సరైన పద్ధతి కాదు. పెద్ద భాషలు ఒక్కసారిగా అంతరించిపోవు. ముందుగా వాటి వాడుక క్షీణిస్తుంది, తర్వాత విద్యా రంగం నుంచి వెనక్కి తగ్గుతాయి, తర్వాత పరిపాలన నుంచి తొలగిపోతాయి, చివరకు ఇంటి భాష స్థాయిలో మాత్రమే నిలిచిపోతాయి. అందువల్ల తెలుగు విషయంలో అసలు భయం "రేపే మాయం అవుతుంది" అనేది కాదు. "క్రమంగా గౌరవభాష నుంచి గృహస్మృతి భాషగా మారిపోతుంది" అనేదే నిజమైన హెచ్చరిక.

### ముఖ్యమైన నిజం

తెలుగు ప్రస్తుతం యునెస్కో అధికారికంగా అంతరించిపోతున్న భాషల జాబితాలో లేదు. భారత ప్రభుత్వ సమాచారం కూడా ఆ దిశగా తెలుగును పేర్కొనదు. 2011 భారత జనగణన భాషా పట్టికల ప్రకారం తెలుగు భారతదేశంలోని అతిపెద్ద మాతృభాషల్లో ఒకటి. సుమారు 8.11 కోట్ల మంది తెలుగును మాతృభాషగా నమోదు చేశారు. ఇది భారత జనాభాలో సుమారు 6.7 శాతం వాటా. కాబట్టి "తెలుగు వెంటనే అంతరించిపోతోంది" అనడం అతిశయోక్తి. కానీ "తెలుగు భద్రంగానే ఉంది, ఎలాంటి ప్రమాదం లేదు" అనడం కూడా వాస్తవం కాదు.

భాషా సంఖ్య ఒకటి, భాషా జీవనశక్తి మరోటి. జనాభా పరంగా పెద్దదిగా ఉన్న భాష కూడా విద్య, ఉపాధి, సాంకేతిక వినియోగం, పట్టణ సంస్కృతి రంగాల్లో వెనుకబడితే భవిష్యత్తులో బలహీనపడే ప్రమాదం ఉంటుంది.

### ఆంగ్ల ప్రభావం ఎంత?

1991 ఆర్థిక ఉదారీకరణ తర్వాత ఆంగ్లం ఉపాధి, సాంకేతికత, మధ్యతరగతి ఆశయాలకు ప్రధాన ద్వారంగా మారింది. 2000లలో ఐటి రంగం ఎదుగుదలతో ఆంగ్ల విద్యకు సామాజిక గౌరవం మరింత పెరిగింది. 2010ల తర్వాత పట్టణ కుటుంబాల్లో "ఆంగ్ల మాధ్యమమే భవిష్యత్తు" అన్న భావన దాదాపు ప్రమాణంగా మారింది. 2020ల నాటికి ఈ భావన ప్రభుత్వ విద్యా రంగానికి కూడా చేరింది.

ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో ప్రాథమిక విద్య స్థాయిలో ఆంగ్ల మాధ్యమ ఆకర్షణ 50 శాతానికి మించి ఉందని విద్యా విధానాలు,



ప్రభుత్వ చర్యలు సూచిస్తున్నాయి. చాలా మంది తమ మాతృభాషగా తెలుగునే నమోదు చేస్తారు. కానీ వారి పిల్లల ప్రాథమిక విద్య ఆంగ్లంలో సాగుతుంటుంది. ఇంట్లో తెలుగు–ఆంగ్ల మిశ్రమ సంభాషణ పెరుగుతుంటుంది. రాత నైపుణ్యం తగ్గిపోతుంటుంది. ఇది భాషా సంక్షోభం సంఖ్యలో కాక వాడుక స్థాయిలో ముందుగా కనిపిస్తుంది.

మూడు దశల క్షీణత

**తెలుగు క్షీణతను మూడు దశలుగా చూడవచ్చు:**

1991–2005: ఆంగ్లం ఉద్యోగ భాషగా ఎదిగి, తెలుగు మీడియం విద్య "వెనుకబడిన ఎంపిక"గా చిత్రీకరించబడింది.

2005–2020: కార్పొరేట్ పాఠశాలలు, ఐటి సంస్కృతి, గ్లోబల్ వలసల ఆశ, ప్రైవేట్ విద్యా మార్కెట్ కలిసి ఆంగ్ల మాధ్యమాన్ని మధ్యతరగతి కుటుంబాల ప్రధాన అభిలాషగా మార్చాయి.

2020 తర్వాత: ప్రభుత్వ పాఠశాలలకు కూడా ఆంగ్ల మాధ్యమ ఒత్తిడి చేరింది. ద్విభాషా పాఠ్యపుస్తకాలు, ఆంగ్ల శిక్షణ, పరిపాలనా స్థాయిలో ఆంగ్ల ఆధిపత్యం మరింత సాధారణమయ్యాయి.

ఈ మూడు దశలు కలిపి చూస్తే 2030 నాటికి తెలుగులో చదవడం–రాయడం వచ్చినా తెలుగులో ఆలోచించే విద్యార్థుల శాతం గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. 2040 నాటికి పట్టణ మధ్యతరగతి కుటుంబాల్లో తెలుగు పూర్తి ప్రాథమిక గృహభాష స్థానాన్ని కోల్పోయే ప్రమాదం ఉంటుంది. 2050 నాటికి ప్రభుత్వ పరిరక్షణ బలహీనంగా ఉంటే తెలుగు "సంఖ్యలో బలమైనా వ్యవస్థలో బలహీనమైన భాష"గా మారవచ్చు.

### ప్రభుత్వ కార్యాలయాల భాష

ఒక భాషను నిజంగా గౌరవించేది పండుగలలో సత్కారం కాదు; రోజువారీ అధికార వినియోగం. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో దరఖాస్తులు, ఉత్తర్వులు, సేవల మార్గదర్శకాలు, పౌర ఫారాలు, భూసంబంధ పత్రాలు, పురపాలక సేవలు, ఆరోగ్య సూచనలు, వ్యవసాయ విభాగ సమాచార పత్రాలు అన్నీ తెలుగులో అందుబాటులో ఉంటే భాషకు పరిపాలనా జీవం వస్తుంది. లేకపోతే తెలుగు ఇంటి మాటగా మిగిలి, అధికార భాషగా ఆంగ్లం స్థిరపడుతుంది.

### పాఠశాలల స్థాయి

2026 తెలంగాణ విద్యా విధాన పత్రం సహా ఇటీవలి విద్యా చర్చలు మాతృభాషా ఆధారిత బహుభాషా విద్య అవసరాన్ని ప్రస్తావిస్తున్నాయి. యునెస్కో 2025 భారత విద్యా నివేదిక కూడా మాతృభాషా ఆధారిత బహుభాషా విద్య సమానత్వానికి కీలకమని చెబుతుంది. దీని అంతర్భావం స్పష్టం: ఆంగ్లాన్ని నేర్పాలి, కానీ మాతృభాషను బలహీనపరచకుండా నేర్పాలి.

తెలుగు రేపు మాయం అయ్యే భాష కాదు. కానీ నిర్లక్ష్యం కొనసాగితే 2030లలో విద్యాభాషగా బలహీనపడే ప్రమాదం ఉంది; 2040లలో పట్టణ కుటుంబ సంభాషణలో మరింత వెనుకబడే అవకాశం ఉంది; 2050లలో పరిపాలనా, జ్ఞానరంగాల్లో ద్వితీయస్థానానికి నెట్టబడే ప్రమాదం ఉంది.

- తెలుగు రక్షణ అనేది కేవలం కవుల బాధ్యత కాదు, కేవలం ఉపాధ్యాయుల పని కాదు, కేవలం ప్రభుత్వ కర్తవ్యమూ కాదు. ఇది ప్రతి తెలుగు వ్యక్తి సామాజిక బాధ్యత.
- తల్లిదండ్రులు పిల్లలతో తెలుగులో మాట్లాడాలి.
- పాఠశాలలు తెలుగును పాఠ్యాంశంగా మాత్రమే కాక భావవ్యక్తీకరణ భాషగా నిలబెట్టాలి.
- విశ్వవిద్యాలయాలు తెలుగులో జ్ఞానరచనను పెంచాలి.
- ప్రభుత్వం ఉత్తర్వులు, సేవలు, ఫారాలు, పరిపాలనా సమాచారాన్ని సంపూర్ణ తెలుగులో అందించాలి.
- మీడియా శుద్ధమైన, సజీవమైన, ఆధునిక తెలుగు వినియోగాన్ని ప్రోత్సహించాలి.
- డిజిటల్ ప్రపంచంలో తెలుగు టైపింగ్, తెలుగు కంటెంట్, తెలుగు సాంకేతిక పదకోశం వేగంగా పెరగాలి.
- ఇప్పుడే చైతన్యంతో కదిలితే తెలుగు మరింత బలపడుతుంది. నిర్లక్ష్యం కొనసాగితే తెలుగు గృహస్మృతి భాషగా మిగిలే ప్రమాదం ఉంది. అందుకే ఈ తరానికి ఉన్న అత్యంత చారిత్రాత్మక కర్తవ్యం ఒక్కటే – తెలుగును కేవలం జ్ఞాపకంగా కాక, జీవన భాషగా నిలబెట్టడం. అదే భాషకు గౌరవం. అదే సంస్కృతికి రక్షణ. అదే భవిష్యత్తు తరాలకు మనం అందించాల్సిన నిజమైన వారసత్వం.



**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
కాకతీయ విశ్వవిద్యాలయం

# తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



**సంగారెడ్డి, మార్చి 26 (జనం సాక్షి) :** ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు అర్థమయ్యేలా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సంబంధిత అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక, 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా వచ్చే నెల 2వ తేదీ నుంచి జిల్లాలో గ్రామ సభలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ,మండలపరిషత్ అధికారులు, మునిసిపల్ కమీషనర్ల ను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాండు, డిప్యూటీ జెడ్పీ సీఈఓ స్వప్న, ఇరిగేషన్ ఈఈ జై భీమ్‌లతో కలిసి నిర్వహించిన వీడియో సమీక్ష సమావేశం లో, ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామసభల ఏర్పాట్లు, జిల్లాలో తాగునీటి సరఫరా పై సమీక్షించారు.

ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడుతూ.... తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుని గ్రామసభలను నిర్వహించాలని, లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన వివరాలను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా తెలియజేయాలని, సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేసి గ్రామసభలను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలోని గ్రామాలు, పట్టణాలలో వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ప్రతి గ్రామపంచాయతీ, మునిసిపాలిటీలలో తాగునీటి సమస్యలను క్షేత్రస్థాయిలో ముందుగానే గుర్తించి, ఎక్కడా నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు . అత్యవసర పరిస్థితుల్లో గ్రామపంచాయతీ వాటర్ ట్యాంకర్లను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. గ్రిడ్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తితే ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని సూచించారు. నీటి సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని సూచించారు. నీటి నాణ్యతను నిరంతరం పరిశీలించి స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నారు. ప్రతి నెల 1, 11, 21 తేదీలలో ట్యాంకుల శుభ్రత నిర్వహించాలని సూచించారు. పైపులైన్ లీకేజీలు, పంప్‌సెట్ లోపాలను 24 గంటల్లో సరిచేయాలని ఆదేశించారు. గ్రిడ్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తితే ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని సూచించారు. నీటి నాణ్యతను పరిశీలించి స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, ప్రతి హ్యాబిటేషన్‌కు నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రిడ్‌లో చిన్న సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించాలని, నేషనల్ హైవే పనుల కారణంగా పైపులు దెబ్బతిని నీటి సరఫరా అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీటి సమస్యలపై ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్ 1916 గురించి ప్రజలకు తెలిసేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ఈ వీడియో సమీక్షలో మునిసిపల్ కమీషనర్లు ,మండలపరిషత్ అధికారులు, ఆర్‌డబ్ల్యూఏఈలు, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 8 నుండి విద్యుత్ కార్మికుల నిరవధిక సమ్మె

- విద్యుత్ ఆర్టిజన్ల పోరుబాట డివిజన్ కార్యాలయం ముందు ధర్నా



**జడ్చర్ల, మార్చి 26 (జనంసాక్షి) :** తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ టీవీఏఈజేఏసీ ఆధ్వర్యంలో విద్యుత్ ఆర్టిజన్, అన్‌మ్యాన్డ్ మరియు పీస్ రేట్ కార్మికులు గురువారం జడ్చర్ల డివిజన్ కార్యాలయం ముందు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం మరియు యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. అర్హత గల ఆర్టిజన్లకు కన్వర్షన్ కల్పించాలని, సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, పీస్ రేట్ కార్మికులకు జీవో నెంబర్ 11 ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని, 2026 పీఆర్‌సీని తక్షణమే వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేర్చని పక్షంలో ఏప్రిల్ 2న మహబూబ్‌నగర్ సర్కిల్ ఆఫీస్ వద్ద ధర్నా చేపడతామని, ఏప్రిల్ 8 నుండి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెకు దిగుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జడ్చర్ల డివిజన్ పరిధిలోని విద్యుత్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

- మున్సిపల్ చైర్పర్సన్ నీరజ బాల్ రెడ్డి



**తాండూరు, మార్చి 26 (జనంసాక్షి) :** ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ చైర్పర్సన్ నీరజ బాల్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం తాండూరు పట్టణం మున్సిపల్ పరిధిలోని శాంతి నగర్ పార్క్ మరియు శాంతి నగర్ కాలనీ ఏరియాలో మున్సిపల్ చైర్పర్సన్ నీరజ బాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి శానిటేషన్ పరిశీలన మరియు పార్క్ డెవలప్మెంట్ లో భాగంగా పార్క్ గోడల పై పెయింటింగ్ (ఆర్ట్) పనులను పరిశీలించి చెత్త డోర్ టూ డోర్ కలెక్షన్ అయ్యేలా మరియు మున్సిపల్ ప్రాపర్టీ టాక్స్ కలెక్షన్ అయ్యేలా అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ నీరజ బాల్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోనే తాండూరు మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చి తీర్చిదిద్దుతామని అన్నారు. తడి పొడి చెత్తను వేరుగా చేసి మున్సిపల్స్ శానిటేషన్ సిబ్బందికి అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ నాగారం మల్లేశం మరియు మున్సిపల్ జవాన్లు శ్రీను అశోక్ సాయిప్రసాద్ ఉన్నారు.

# వీరనారీమణుల స్ఫూర్తితో మహిళలు పని చేయాలి



**ముషీరాబాద్, మార్చి 26 (జనం సాక్షి) :** వీరనారీమణులు మల్లు స్వరాజ్యం, ఐలమ్మ ల స్ఫూర్తితో వారి ఆశాయలకు అనుగుణంగా మహిళలు పని చేయాలని తెలంగాణ రాష్ట్రం మహిళా కమిషన్ చైర్పర్సన్ నేరెళ్ళ శారద సూచించారు. ఈ మేరకు గురువారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా), వీరనారి ఐలమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అధ్యక్షతన తెలంగాణా సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, ఐద్వా ఉద్యమ మల్లు స్వరాజ్యం 4వ వర్ధంతి సందర్భంగా బాగ్లింగంపల్లి ఐలమ్మ భవన్లో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్నీ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ నేరెళ్ళ శారద రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.... మహిళ ఎక్కడ ఉన్నా మహిళే, మనం మన హక్కులను వదులుకోకూడదు. సమాజంలో జరుగుతున్నా హింసపై ప్రశ్నించాలనీ, ప్రస్తుతం యువత తమ పాత్రను బాధ్యతగా నిర్వహించాలనీ సూచించారు. మహిళలు కుటుంబ బాధ్యత నిర్వహిస్తూనే కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ఏ ప్రభుత్వమైనా మహిళల సమస్యలను పరిష్కరించేలా మనం గట్టిగా ఐక్యంగా ఉండి పోరాడాలని అన్నారు. రాష్ట్రంలో భూమి కోసం, భూక్తి కోసం, విముక్తి కోసం వీరనారి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం చేసిన పోరాటం మన మందరం స్ఫూర్తిగా తీసుకొని వారి అఆశయాలకోసం పని చేయాలి అప్పుడే ఆమెకు ఘనమైన నివాళి అర్పించిన వాళ్ళము అని అన్నారు. ఐద్వా సీనియర్ నాయకురాలు టి. జ్యోతి మాట్లాడుతూ మహిళా సమస్యలపై నిరంతరం పోరాడిన వీరవనిత మల్లు స్వరాజ్యం అని అందరికీ ఉపాధి, ఆరోగ్యం, విద్యకోసం, దోపిడీకి వ్యతిరేకంగా చివరి శ్వాస వరకు పోరాటం చేశారని అన్నారు. వీరనారి ఐలమ్మ ట్రస్టు చైర్పర్సన్ బుగ్గవీటి సరళ, కార్యదర్శి బి. హైమావతి మాట్లాడుతూ మహిళలపై హింసకు వ్యతిరేకంగా పోరాడాలని అడపిల్లలను ఆత్మ స్థైర్యంతో పెంచాలని మల్లు స్వరాజ్యం పరితపించారని అని చెప్పారు. అందులో భాగంగానే ఐలమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో 16జిల్లాలలో కుటుంబ న్యాయసలహా కేంద్రాలు నిర్వహిస్తున్నామన్నారు. ట్రస్టు కోశాధికారి కె.ఎన్. ఆశాలత మాట్లాడుతూ మల్లు స్వరాజ్యం ఆశయ సాధనకోసం మహిళల చైతన్యం చేసే విధంగా కృషి చేస్తున్నామని రాష్ట్రంలో యువత ముందుకు రావాలని కోరారు. ఈ హెల్త్ క్యాంపులో డాక్టర్స్ డా. రమేష్, యూపిఎస్ సుల్తాన్, బి, సుధ, జి. కృష్ణవేణి, సునిత, మహేష్ బాబు, డా. జాసీ, సునీల్ కుమార్, గౌతమి, మేఘన బిపి, షుగర్, గైనకాలజిస్ట్, ఐ చికిత్స, క్యాన్సర్ వంటి చికిత్సలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయకార్యదర్శి పి. శశికళ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎన్. స్వరూప, ఎమ్. లక్ష్మమ్మ, రజిత, ఇందిర, జోషిలా, ప్రేమ, బ్రాహ్మణి, కవిత, ధనలక్ష్మి, సత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మభిక్షం విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై పెట్టాలి

- ఐఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి గౌడ ఐలయ్య



**కుత్బుల్లాపూర్, మార్చి 26 (జనం సాక్షి) :** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, పేద ప్రజల గుండెచప్పుడు ,అఖిలభారత గీత పరివారాల సంఘం జాతీయ అధ్యక్షులు, మాజీ ఎంపీ కీర్తిశేషులు బొమ్మగాని ధర్మ బిక్షం గౌడ్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయరని ఐఎన్టియుసి రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్రీయ ఓబిసి జాతీయ అధ్యక్షులు గూడ ఐలయ్య గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం ధర్మ బిక్షం వర్ధంతి నీ పురస్కరించుకొని రుణా మేస్త్రి నగర్ డివిజన్ లోని మ్ నగర్ కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాటానికి, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా, తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన ధర్మ బిక్షం ఎంతో గొప్పవాడని కొనియాడారు. పార్లమెంటు సభ్యునిగా బడుగు బలహీన వర్గాల తరపున ఆయన చేసిన పోరాటం ఆ వర్గాలు ఎప్పటికీ మరిచిపోవు అన్నారు. ధర్మ బిక్షం పోరాట ప్రతిభ ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గూడవరమ్మా, దళిత నాయకులు బి సంజీవరావు, సాయి ప్రవీణ్ గౌడ్, గణేష్ గౌడ్, మైనార్టీ నాయకులు హమీద్, జయ, సులోచన, తిరుపతమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి



**చేవెళ్ల, మార్చి 26 (జనం సాక్షి) :** విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, విలువలతో కూడిన విద్య రేపటి పౌరులుగా తీర్చిదిద్దాలని చేవెళ్ల ఎంఈఓ ఎల్.పురం దాస్ అన్నారు. చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని పల్లవి కిడ్స్ స్కూల్ ఆవరణంలో బుధవారం రాత్రి విద్యార్థులతో వాసుదేవ కుటుంబకం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చేవెళ్ల ఎంఈఓ ఎల్.పురం దాస్, చేవెళ్ల మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంఈఓ పురం దాస్ మాట్లాడుతూ.. పిల్లల సర్వతోముఖాభివృద్ధికి పల్లవి కిడ్స్ స్కూల్ కృషి అభినందనీయం అని ఎంఈఓ అన్నారు. చిన్న వయస్సులోనే పిల్లల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసి, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో పల్లవి కిడ్స్ స్కూల్ పోషిస్తున్న పాత్ర అభినందనీయమని ఆయన కొనియాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కేవలం పుస్తక పఠనమే కాకుండా, క్రీడలు, కళలు, సాంకేతిక పరిజ్ఞానంపై పిల్లలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పల్లవి కిడ్స్ స్కూల్ యాజమాన్యం అనుసరిస్తున్న బోధనా పద్ధతులు, క్రమశిక్షణతో కూడిన వాతావరణం విద్యార్థుల భవిష్యత్తుకు ఎదుగుదలకు బోధ పడుతుందన్నారు. అంతరం చేవెళ్ల మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. వాసుదేవ కుటుంబకం అనే పేరుతో విద్యార్థులకు మంచి ఒక ఆనందాన్ని కలిగించే కార్యక్రమాలు చేపట్టడం ఒక మొదటి దిశగా మారుతుందన్నారు. పల్లవి కిడ్స్ స్కూల్ ప్రకృతి ద్వారా విద్యార్థులకు ఒక మంచి ఆలోచనలు కలిగి ఉండాలని అన్నారు. అలాగే కేవలం పాఠశాలలే కాకుండా, తల్లిదండ్రులు కూడా పిల్లల ఎదుగుదలలో భాగస్వాములు కావాలని ఆమె సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంఈఓ పురాందాస్, మున్సిపల్ చైర్మన్ దేవర సమతా వెంకట్ రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, కౌన్సిలర్ బండారి శైలజాఆగి రెడ్డి, శాల ప్రిన్సిపల్ బరీరా ఖాతూన్, కరస్పాండెంట్ శ్రీకాంత్, డైరెక్టర్ క్రాంతి కుమార్, నవాజ్ రెడ్డి, మనోహర్ రెడ్డి, శేఖర్, ఆంజనేయులు, మాణిక్యం, గోపాల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు



**బెజ్జంకి, మార్చి 26 (జనం సాక్షి) :** నిరుద్యోగ సమస్యలపై జరుగుతున్న ఉద్యమాలను అక్రమ అరెస్టులతో అణచివేయలేరని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్ అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో భాగంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చేవెళ్ల డిక్లరేషన్ సభలో ప్రకటించినప్పటికీ,ఇప్పటివరకు అమలు చేయకపోవడం దురదృష్టకరమని ఆయన విమర్శించారు.ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేయకపోవడం ద్వారా నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో భాగంగా ముందస్తు అరెస్టులు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా తమ హక్కుల కోసం పోరాడే యువతను అడ్డుకోవడం తగదని అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు.ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించండి

- మోమిన్‌పేట ఎస్సై భరత్ భూషణ్




**మోమిన్‌పేట, మార్చి 26 (జనం సాక్షి) :** సమాజంలో ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని మోమిన్ పేట ఎస్ఐ భరత్ భూషణ్ పేర్కొన్నారు. గురువారం మోమిన్ పేట మండల కేంద్రంలోని న్యూ బస్టాండ్ వద్ద ప్రయాణికులు ఆటో డ్రైవర్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రయాణికుల క్షేమం కోరే ట్రాఫిక్ నియమ నిబంధనలను విధించిందని తప్పనిసరిగా వాటిని పాటించినప్పుడే మన ప్రయాణం సురక్షితంగా తమ గమ్యాన్ని చేరుకోవచ్చు అన్నారు. అలాగే వాహనదారులు తప్పనిసరిగా బెల్టును ధరించి ఫోన్లో మాట్లాడుతూ అతివేగంగా వాహనాలను నడపవద్దని ఆటో డ్రైవర్లకు వాహనదారులకు సూచించారు. తమ వాహనాలకు నంబర్ ప్లేట్లు లేకుండా నడపడం, అలాగే ఒక వాహనం నంబరు మరొక వాహనం ఉపయోగించి వాడుతున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది,ఆటో డ్రైవర్లు, ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులను నట్టేట ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం

- రైతు భరోసా పేరుతో కాంగ్రెస్ రాక్షస పాలన
- ప్రతి గ్రామానికి నిధులు కేటాయించి అభివృద్ధికి కృషి చేయాలి
- బిఆర్ఎస్ హయాంలో అన్ని గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు
- బీఆర్ఎస్ రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి పంజుగుల శ్రీశైల్ రెడ్డి



**యాలాల, మార్చి 26 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని బీఆర్ఎస్ రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి పంజుగుల శ్రీశైల్ రెడ్డి మండిపడ్డారు. గురువారం యాలాల మండలం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రవిందర్ రెడ్డి ఆద్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి పంజుగుల శ్రీశైల్ రెడ్డి, మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి సీనియర్ నాయకులు సీద్రాల శ్రీనివాస్ కలిసి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తామని చెప్పుకుంటూ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్లలకు మాత్రమే నిదులు కేటాయించి బిఆర్ఎస్ సర్పంచ్ లకు కేటాయించకపోవడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మచ్చలేకుండా జడ్పిటీసీ నుండి డీసీసీబీ చైర్మన్, తాండూరు ఎమ్మెల్యేగా గెలుపొందానని చెపుతూ గ్రామాల అభివృద్ధికి నిధులు ఇవ్వక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు .బిఆర్ఎస్ సర్పంచ్ లు గెలిచిన గ్రామాలకు పక్షపాతం లేకుండా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మద్యవర్తుల మాటలు వినకుండా అభివృద్ధికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. యాలాల మండలంలోని 14 గ్రామాలకు పార్టీలకతీతంగా అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. మరోవైపు కేంద్ర నిధుల ద్వారా ఎమ్మెల్యే మనోహర్రెడ్డి తన ఇష్టానుసారంగా వారి పార్టీ సర్పంచ్ లకే నిధులు ఇవ్వడం పై మండిపడ్డారు. ఎమ్మెల్యే నిధులు, డిఎంఎఫ్ నిధులు ఎక్కడికి పోతున్నాయని ప్రశ్నించారు. పక్క నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని నేను మచ్చలేని ఎమ్మెల్యేనని చెప్పుకుంటూ వివక్ష చూపుతున్నారని విమర్శించారు. తాండూరులో గుట్టలు, వాగులు, గనులు, సుద్ద మాఫియా కొనసాగుతుందని ఇందుకు కారణం ఎమ్మెల్యేనని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలోమాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి ప్రతి గ్రామానికి రూ.50లక్షలు నుంచి రూ. కోటిన్నర వరకు అభివృద్ధి చేశారని పార్టీలకతీతంగా సర్పంచ్ లకు నిధులు కేటాయించారని గుర్తు చేశారు. ఎన్నికల ముందు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ప్రతి గ్రామంలో నేతలు ఆధార్ కార్డులు, ఫోటోలు తీసుకోని ప్రజలను మోసం చేశారని ఇప్పుడు తీసుకున్న వారందరికి ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై సర్పంచ్ లకు ఎన్నికలలో ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు ఇబ్బందులు పడుతున్నారని పార్టీలకతీతంగా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఎస్ఆర్ఈజీఎస్ నిధుల కేటాయింపుపై టిఆర్ఎస్ సర్పంచ్ లు ఉన్న చోట కూడ కాంగ్రెస్ కార్యకర్తలకు నిధులు కేటాయిస్తే గ్రామసభ తీర్మానం ఇప్పించి అభివృద్ధికి కృషి చేస్తామని నేతలు తెలిపారు. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అసెంబ్లీలో మాట్లాడినంత మాత్రాన అభివృద్ధి జరిగిపోతుందా, నేషనల్ హైవే దుమ్ము దూళితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే ఒక్కసారి అయిన అదికారులతో రివ్యూ మీటింగ్ చేశారా అని ప్రశ్నించారు. మరోవైపు కల్యాణ లక్ష్మి, షాదిముబారక్ చెక్కులు పంపిణీ విషయంలో సర్పంచ్ లకు సమాచారం ఇవ్వకుండానే ఇస్తున్నారని అలా జరగకుండా పార్టీలకతీతంగా సర్పంచ్ లను పిలిపించి చెక్కుల పంపిణీలో పాలుపంచుకునేలా చూడాలని అన్నారు. యాలాల మండలంలో ప్రతి గ్రామానికి నిధులు కేటాయించి అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి కి బిఆర్ఎస్ పార్టీ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు మల్లారెడ్డి, వడ్డే రాములు, చేన్నారం శివ కుమార్, లాలప్ప, కోట్ల మహేశ్వర్ రెడ్డి, శేరి సుభాన్ రెడ్డి, తిమ్మాయిపల్లి కృష్ణ, ముస్తఫా పార్టీ సర్పంచులు, ఉప సర్పంచులు కార్యకర్తలు ఈ కార్యక్రమంలో ఉన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
27 మార్చి 2026

# విద్యుత్ ఆర్టిజన్ల సమస్యలను పరిష్కరించండి

**వనపర్తి బ్యూరో, మార్చి 26 (జనంసాక్షి) :** విద్యుత్ ఆర్టిజన్ల సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వాన్ని కోరుతూ కార్మికులు,ధర్నా నిర్వహించారు. గురువారం నాడు వనపర్తి జిల్లా కేంద్రంలోని విద్యుత్ సబ్స్టేషన్ ఎదుట కార్మికులు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర విద్యుత్ రంగంలో, అహర్నిశలు శ్రమిస్తూ, వినియోగదారులకు, నాణ్యమైన విద్యుత్ అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న, ఆర్టిజన్ల సమస్యలను, తక్షణమే పరిష్కరించాలని,డిమాండ్ చేశారు.ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు, పని ఒత్తిడిని దృష్టిలో ఉంచుకుని మా ఈ క్రింది డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరారు.ఆర్టిసన్ ఎంప్లాయీస్ కి ఏ పీ ఎస్ ఈ బి, సర్వీస్ వెంటనే అమలు చేయాలి. వేతన సవరణ, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆర్టిజన్లందరికీ గౌరవప్రదమైన వేతన సవరణ వెంటనే అమలు చేయాలి.ఉద్యోగ భద్రత, క్రమబద్ధీకరణ:,సుదీర్ఘ కాలంగా



సేవలందిస్తున్న ఆర్టిజన్ల ఉద్యోగ భద్రతపై స్పష్టమైన హామీ ఇవ్వాలి, అర్హత కలిగిన వారిని క్రమబద్ధీకరించాలి. సమాన పనికి సమాన వేతనం,రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్న ఆర్టిజన్లకు వేతనాల్లో ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించి, న్యాయం చేయాలి. ప్రమాద బీమా వైద్య సదుపాయాలు, విధి నిర్వహణలో ప్రమాదాలకు గురైనప్పుడు ఆర్టిజన్లకు, వారి కుటుంబాలకు మెరుగైన ఉచిత వైద్య సదుపాయాలు, భారీ బీమా సౌకర్యం కల్పించాలి.4.12.2016 ముందు ఉన్న 135 ఆర్టిసన్ కార్మికులాగా గుర్తించాలి. పాత పెన్షన్ విధానం (ఈపీఎఫ్) సీలింగ్ తీసెయ్యాలి ఆర్టిజన్లకు కూడా సామాజిక భద్రత కల్పించే దిశగా పెన్షన్ సౌకర్యం కల్పించాలి.రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములైన మా పట్ల సానుకూల దృక్పథంతో స్పందించి, పైన పేర్కొన్న అంశాలపై తక్షణమే చర్చలు జరిపి పరిష్కరించాలన్నారు. ధర్నా కార్యక్రమంలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొనడం జరిగింది ఈ ధర్నాకు ముఖ్యమైన నాయకులు జిల్లా కన్వీనర్ నాగరాజు చైర్మన్ శ్రీకాంత్, చీర్ల యాది సాగర్, చందు యాదవ్, తిరుపతి రెడ్డి, కార్తీక్ బాబు, ఆనంద్ గౌడు, సురేందర్ గౌడ్, అశోక్, ప్రవీణ్ కుమార్ రెడ్డి ,మంద ఆంజనేయులు, రాములు తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

## ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



**వీపనగండ్ల, మార్చి 27 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రాష్ట్ర సిపిఎం కమిటీ పిలుపుమేరకు చలో అసెంబ్లీ కార్యక్రమానికి బయలుదేరిన మండల సిపిఎం నాయకులను కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీసు తనకు తరలించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ప్రజా గొంతుకులను ఆపలేరని అన్నారు. ఎన్నికల ముందు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లేకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. సిపిఎం నాయకులు ఆశన్న, మాజీ ఉపసర్పంచ్ సిహెచ్ వెంకటయ్య, నరసింహ, నక్క ఈశ్వర్, మాందాపురం నరసింహ, నిరంజన్ తదితరులు అరెస్టు అయిన వారిలో ఉన్నారు. ప్రజా సంక్షేమ పథకాలను చేపట్టాలని అన్నారు.

## వెంకటాపూర్‌లో పురుగుమందుల దుకాణాలు తనిఖీ

- పలు దుకాణాల లో వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలన
- గడ్డి మందులను అమ్మినట్లయితే కఠిన చర్యలు ఏఓ హైమావతి

**శ్రీరంగాపూర్, మార్చి 25 (జనం సాక్షి) :** శ్రీరంగాపూర్ మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో మండల వ్యవసాయ అధికారి శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్‌ని ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరిగింది. షాప్‌కి సంబంధించిన రికార్డులని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ హైమావతి మాట్లాడుతూ అమ్మిన సరుకులను వెంటనే రిజిస్టర్లో పొందుపరచుకోవాలని పురుగు మందులకి సంబంధించిన పిసీలను షాప్‌కి సంబంధించిన లైసెన్స్ లో పొందుపరచాలని, పిసీలు లేని పురుగుమందులను అమ్మినట్లయితే కఠినంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రైతులకు నాణ్యత కలిగిన పురుగుమందులను వితరణ చేయాలని ఆమె ఫర్టిలైజర్ షాప్ యాజమాన్యానికి తెలియజేశారు. అనుమతి లేని గడ్డి మందులను అమ్మినట్లయితే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

యూరియానీ యాప్ ద్వారా బుక్ చేసుకున్న ప్రతి రైతుకు తప్పనిసరిగా యూరియాని అందజేయాలని ఆమె అన్నారు.

అమ్మిన సరుకును వెంటనే ఈపాస్ మిషన్ లో పొందుపరచాలని ఆమె తెలియజేశారు. అమ్మిన సరుకులకు తప్పనిసరిగా రైతుకు రసీదును రాసి ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ఐమావతి తో పాటుగా ఏఈఓ అనూష పాల్గొనడం జరిగింది.

# ప్రజల సహకారంతోనే ప్రమాదాల నివారణ సాధ్యం

- మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు
- ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి
- ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు

**మెదక్ జిల్లా బ్యూరో, మార్చి 26 (జనం సాక్షి) :** రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించడం అత్యంత కీలకమని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. మెదక్ టౌన్ పరిధిలోని బాలికల పాలిటెక్నిక్ కళాశాలలో 'ఎరైవ్ అలైవ్ ' మూడో విడత కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ విద్యార్థులకు, యువతకు రోడ్డు భద్రతపై పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోడ్డు మీద ప్రయాణించే ప్రతి ఒక్కరూ తమ భద్రతతో పాటు ఇతరుల భద్రతను కూడా దృష్టిలో పెట్టుకొని ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల సమయంలో తలకు గాయాలు తగ్గి ప్రాణాలను రక్షించుకోవచ్చని



తెలిపారు. అలాగే నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే వారు సీటుబెల్ట్ ధరించడం ద్వారా ప్రమాదాల తీవ్రతను తగ్గించవచ్చని వివరించారు.మద్యం సేవించి వాహనాలు నడపడం అత్యంత ప్రమాదకరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధిక వేగంతో డ్రైవింగ్ చేయడం, నిర్లక్ష్యంగా వాహనం నడపడం, సెల్‌ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం, మైనర్ డ్రైవింగ్ వంటి అలవాట్లు ప్రమాదాలకు ప్రధాన కారణాలని పేర్కొన్నారు. రాంగ్ రూట్‌లో ప్రయాణించడం, ఓవర్‌టేకింగ్ సమయంలో జాగ్రత్తలు పాటించకపోవడం కూడా ప్రమాదాలకు దారితీస్తుందని తెలిపారు.వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ఇన్సూరెన్స్, ప్యూసీ (పియూఎస్) వంటి అవసరమైన పత్రాలను ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలని సూచించారు. చిన్నారులు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు కచ్చితంగా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని ఎస్పీ పేర్కొన్నారు.ప్రజల సహకారం ఉంటేనే సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు కూడా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీ ప్రసన్న కుమార్, మెదక్ ఇన్స్పెక్టర్ మహేష్, అధ్యాపకులు, విద్యార్థులు, స్థానిక యువత, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# లైంగికదాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

- రూ. లక్ష జరిమానా విధించిన కోర్టు
- జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు ఐపీఎస్

మెదక్, మార్చి 26 (జనం సాక్షి) : లైంగిక దాడికి పాల్పడిన కేసులు నిందితుడికి లక్ష రూపాయలు నిర్మాణ 20 సంవత్సరాల కఠిన కారాకార శిక్ష న్యాయమూర్తి సభవల్లి విధించినట్లు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. మహిళలు, చిన్నారులపై లైంగిక దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. తుప్రాన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో నిందితుడిని కోర్టు దోషిగా తేల్చి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించినట్లు తెలిపారు. తుప్రాన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జండపల్లి గ్రామానికి చెందిన సోమగారి భాస్కర్ (27) బాలికపై లైంగిక దాడి పలుపడినట్లు ఫిర్యాదు అందడంతో అప్పటి ఎస్ఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేశారు. అనంతరం అప్పటి దర్యాప్తు అధికారి సీఐ శ్రీధర్ సమగ్రంగా విచారణ జరిపి సాక్ష్యాధారాలను సేకరించి, పక్క ఆధారాలతో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయమూర్తి ఆర్.ఎం. సుభావల్లి నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1 లక్ష జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. జరిమానా మొత్తాన్ని



బాధితురాలికి పరిహారంగా చెల్లించాలని కోర్టు ఆదేశించిదని తెలిపారు. కేసు విజయవంతంగా నడిపించడంలో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం. బాలయ్య, భారోసా లీగల్ ఆఫీసర్ అడ్వకేట్ కే. స్వేత కీలక పాత్ర పోషించారు. తూప్రాన్ ఎసై గంగరాజు, జిల్లా లైజనింగ్ ఆఫీసర్ బి. విఠల్, పీసీలు జి. కృష్ణ, సీడిఓ నాగరాజు తదితరులు సమన్వయం చేశారు.ఇలాంటి కేసుల్లో వేగంగా దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

## మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు

వెల్దుర్తి, మార్చి 26 (జనం సాక్షి) : మండల కేంద్రంలోని సీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో చదివే ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు చదివే విద్యార్థులకు మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై హిందీ ఉపాధ్యాయురాలు రేణుక దేవి గురువారం అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలు వినియోగించడం వల్ల మానవ శరీరంపై



మెదడు మీద ప్రభావం చూపే పరిణామాలపై అవగాహన కల్పించారు. కొన్ని వైద్య ప్రయోజనాల కోసం మార్గ ద్రవ్యాలను వాడుతారు కానీ నేరుగా మానవులము వాడి దుర్వినియోగం చేస్తే ప్రమాదకరమని తెలియజేశారు. ప్రధానోపాధ్యాయులు సాంబయ్య మాట్లాడుతూ మెదడు పనితీరు తగ్గిపోయి జ్ఞాపకశక్తి తగ్గిపోతుందని సూచించారు. ఊపిరితిత్తులపై ప్రభావం చూపి డిప్రెషన్లో వెళ్లపోతారని సూచించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కాకుండా మంచి విద్యార్థులుగా ఎదిగి తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. మాదకద్రవ్యాల వ్యతిరేకంపై విద్యార్థులకు డ్రాయింగ్ కాంపిటీషన్ నిర్వహించి బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయసుధ శైలజ నవనీత సునిత అర్చన రాధిక ప్రియదర్శిని ప్రశాంతి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ జిల్లా బ్యూరో, మార్చి 26 (జనం సాక్షి) :** జిల్లా స్థాయి సాండ్ కమిటీ సమావేశంలో జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. జిల్లాలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. గురువారం మెదక్ కలెక్టరేట్లో నిర్వహించిన జిల్లా స్థాయి శాండ్ కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, ఆర్డీవోలు తాసిల్దార్లు , మైనింగ్ ,ఇరిగేషన్, పంచాయతీ హౌసింగ్ అధికారులతో కలిసి తో కలిసి పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఏప్రిల్ 1 నుండి 100% ఇసుక సరఫరా “మన ఇసుక వాహనం” ద్వారా ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహించాలని స్పష్టం చేశారు. ఇసుక రవాణా పూర్తిగా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జరగాలని అధికారులను ఆదేశించారు. ఇసుక అక్రమంగా ఇసుక రవాణా చేసే వాహనాలు పట్టుబడితే బైండోవర్ కేసులు నమోదు చేసి జరిమానా విధించాలని ఆదేశించారు. ప్రతి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సకాలంలో ఇసుక అందించేందుకు ఆన్లైన్లో నమోదు చేయించాలన్నారు. పోలీస్, రెవెన్యూ, మైనింగ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఒక మొబైల్ టీం



ఏర్పాటు చేసి అక్రమంగా ఇసుక రవాణాను అడ్డుకోవాలన్నారు. తహసీల్దార్లు వారానికి కనీసం రెండు సార్లు రీచ్లను సందర్శించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఒక్క సీసీ కెమెరా వంద మందితో సమానం

- సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్

**చేర్యాల, మార్చి 26 (జనంసాక్షి) :** ఒక్క సీసీ కెమెరా వంద మందితో సమానం అని సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ అన్నారు. గురువారం చేర్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవంలో ముఖ్యఅతిథిగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సమాజ భద్రతలో ప్రస్తుత కాలంలో సీసీ కెమెరాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని, ఒక్క సీసీ కెమెరా పదుల సంఖ్యల పోలీసులతో సమానంగా చూడవచ్చు అని, సీసీ కెమెరాలు ముఖ్యంగా నేరాల నివారణ, కేసుల ఛేదనలో ప్రముఖ పాత్ర వహిస్తున్నాయి అని, చేర్యాల పట్టణంలో ప్రధాన కూడలిలో 26 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్టు వారు తెలిపారు. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా సీసీ కెమెరాల ఏర్పాటు చేయగలిగితే, గ్రామాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయగలిగితే జరిగే నేరం జరిగిన




వెంటనే నిందితులను గుర్తిచడమే కాకుండా సీసీ కెమెరాలు ద్వారా కేసుల పరిష్కారం సులభతరం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేర్యాల సీఐ బానోతు రమేష్ నాయక్, చేర్యాల ఎస్ఐ గూడ అపూర్వ రెడ్డి, కొమురవెల్లి ఎస్ఐ మహేష్, మద్దూరు ఎస్సై ఆసిఫ్, పోలీస్ సిబ్బంది, చేర్యాల మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు,వివిధ గ్రామాల సర్పంచ్ లు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు, ప్రజలు పాల్గొన్నారు.

# ఆర్టిజెన్స్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ధర్నా

**తూప్రాన్, మార్చి 26 (జనం సాక్షి) :** విద్యుత్ సంస్థలో పనిచేస్తున్నటువంటి ఆర్టిజన్స్, ఇతర కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తూప్రాన్ డివిజన్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ.మహేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో సంస్థను నమ్ముకొని దాదాపు 20, 25 సంవత్సరాల నుండి ఆర్టిజన్స్ పనిచేస్తున్నారని. గత ప్రభుత్వం ఈ సంస్థలో 23667 మంది కార్మికులను ఈ సంస్థలో విలీనం చేసుకోవడం జరిగిందని కానీ ఈ సంస్థ విద్యుత్ సంస్థ పుట్టినప్పటి నుండి ఒకటే రూల్స్ ఉన్నయాన్ని ఏపీ ఎస్ ఈ బి అవి కాకుండా స్టాండింగ్ ఆర్డర్ ప్రకారం మమ్మల్ని ఈ సంస్థలో విలీనం చేసుకోవడం జరిగిందన్ని ఒకే సంస్థలో ఒకే రూల్స్ ఉండాల్సింది పోయి బ్రిటిష్ కాలం నాటి స్టాండింగ్ ఆర్డర్స్ ఆర్టిజన్స్ కి ఇవ్వడం జరిగిందన్ని ఆ ఆర్డర్ ప్రకారం అయినా ఐదు సంవత్సరాలు తర్వాత గ్రేడ్ చేంజ్ ప్రమోషన్స్ ఇవ్వాలన్ని



నేటికీ ఎనిమిది సంవత్సరాలు గడిచిన ఇంతవరకు ఎలాంటి గ్రేడు లేదు ఎలాంటి ప్రమోషన్స్ లెవన్నీ ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం రాకముందు ఆనాడు పాదయాత్రలో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు అలాగే విద్యుత్ శాఖ మంత్రి గౌరవనీయులు బట్టి విక్రమార్క గారు పాదయాత్రలో మా ప్రభుత్వం రాగానే ఆర్టిజన్స్ అందరిని పర్మనెంట్ చేస్తామని హామీ ఇచ్చారాన్ని ఈ ప్రభుత్వం వచ్చి కూడా దాదాపు రెండు సంవత్సరాలు గడుస్తుంది అయినా ఎలాంటి స్పందన లేదు అన్నీ అటు యాజమాన్యంలో ఎలాంటి స్పందన లేదు ఈ విద్యుత్ సంస్థలో ఉన్న తొమ్మిది సంఘాలను ఏకమై జేఏసీగా ఏర్పడడం శుభపరిణామం అన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ కింద డిమాండ్లను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు

**విద్యా అర్హతను బట్టి కన్వర్షన్ ఇవ్వాలి**

2026 పిఆర్‌సి కమిటీ వెంటనే వేయాలి రాబోయే కాలంలో జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టబోయే కార్యక్రమాలకు సిఐటియు మెదక్ జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. కావున జిల్లాలోని కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాలన్నీ విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఝువ ఝిఎ సోషల్ మీడియా కన్వీనర్ నాగరాజు,రాజు, తిరుపతి,ఫాసి, శ్రీశైలం హనుమంతు, రాజిరెడ్డి, దుర్గయ్య శీను తదితరులు పాల్గొన్నారు.

## ఇరవై సంవత్సరాల తర్వాత బీసీ కాలనీకి మహర్దశ

- రూ. 1.30 కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభం

**మక్తల్, మార్చి 26 (జనంసాక్షి) :** స్థానిక మున్సిపల్ కేంద్రంలోని 5వ వార్డు బీసీ కాలనీలో దశాబ్దాల నిరీక్షణకు తెరపడింది. మంత్రి వాకిటి శ్రీహరి చొరవతో మంజూరైన నిధులతో గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ వాకిటి మానస హన్మంతు అభివృద్ధి పనులను ప్రారంభించారు. సుమారు రూ. కోటి అంచనా వ్యయంతో కిలోమీటర్ మేర నిర్మించనున్న సీసీ రోడ్లకు, అలాగే రూ. 30 లక్షలతో చేపట్టనున్న రెండు కిలోమీటర్ల కొత్త తాగునీటి పైపులైన్ పనులకు ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ఇరవై ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన ఈ కాలనీ సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. దీనివల్ల కాలనీలోని 100 ఇళ్లకు కొత్త మంచినీటి కనెక్షన్లు అందనున్నాయి. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ ఏఈ నాగశివ, ఇతర నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



# న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని బాధితుల్లో కలిగించాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- సంగం పిఎస్ సందర్శించిన సిపి



**వరంగల్ బ్యూరో, మార్చి 26 (జనం సాక్షి) :** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ గురువారం సంగెం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న కమిషనర్‌కు సంగెం అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలకగా, ముందుగా సీపీ పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి, స్టేషన్ ఆవరణలో మామిడి మొక్కను నాటారు, అనంతరం సీపీ పోలీస్ స్టేషన్‌ను సమగ్రంగా పరిశీలించిన కమిషనర్, స్టేషన్ పరిధిలోని గ్రామాలు, ప్రజల జీవన విధానం, స్థానికంగా జరుగుతున్న నేరాలు, రౌడీ షీటర్లు, అనుమానితులపై వివరాలను ఇన్స్‌పెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే పోలీస్ సిబ్బంది పనితీరు, బీట్ వ్యవస్థ, పెట్రోలింగ్, రికార్డుల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. అనంతరం స్టేషన్‌లో నమోదు అయిన కేసులు, పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టుకు సంబంధించిన అంశాలపై రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి బాధితుడికి న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగేలా పనిచేయాలని సూచించారు. ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని, విధి నిర్వహణలో అలసత్వం లేకుండా, పారదర్శకంగా సేవలు అందించాలని తెలిపారు. ప్రజల విశ్వాసం పొందే విధంగా పోలీసులు తమ విధులను నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, మామూనూర్ ఏసీపీ వెంకటేష్, పర్వతగిరి సిఐ రాజగోపాల్, సంగెం ఎస్. ఎస్. ఐ వంశీ కృష్ణతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దాం

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**బెల్లంపల్లి, మార్చ్ 26 (జనంసాక్షి) :** బెల్లంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి అందరం సమిష్టిగా కృషి చేద్దామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన బడ్జెట్ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మున్సిపల్ కమిషనర్ సంపత్, చైర్ పర్సన్ దావ స్వాతి, వైస్ చైర్ పర్సన్ సత్యనారాయణతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బెల్లంపల్లి మున్సిపల్ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దామని అన్నారు. మున్సిపల్ పరిధిలో వివిధ విభాగాలలో పని చేస్తున్న సిబ్బందికి సకాలంలో వేతనాలు అందించాలని, ఈ మేరకు మున్సిపల్ పరిధిలోని ఇంటి పన్ను, ఇతర పన్నులను 100 శాతం వసూలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా ప్రతి రోజు ప్రతి ఇంటి నుండి చెత్తను సేకరించేందుకు డిఎంఎఫ్టి నిధుల నుండి ఆటోలు అందిస్తామన్నారు. బెల్లంపల్లి మున్సిపల్ అభివృద్ధికి సిఎస్ఆర్ నిధుల నుండి 2 కోట్ల 50 లక్షల రూపాయలు మంజూరు చేశామన్నారు. మున్సిపల్ పరిధిలోని అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్మాణం చేపడతామని, విద్యుత్ బిల్లులు తగ్గించే ఆలోచనలో భాగంగా సోలార్ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులలో నిరంతరం త్రాగునీటిని సరఫరా చేసేందుకు పనులు కొనసాగుతున్నాయని, ముల్కల్ల నుండి నీటిని అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో సమృద్ధిగా నీటి నిల్వలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. మున్సిపల్ పరిధిలోని వార్డులలో సిబ్బంది కొరత ఉన్నట్లయితే సమకూర్చుకునేందుకు పాలకవర్గం సమన్వయంతో చర్యలు తీసుకోవచ్చని అన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను నిబంధనల ప్రకారం విక్రయించి మున్సిపాలిటీకి ఆదాయం సమకూర్చుతామని అన్నారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ లలో షాపులు తీసుకున్న వారి నుండి అద్దె క్రమం తప్పకుండా వసూలు చేయాలని, ఖర్చులు తగ్గించి ఆదాయం పెంపొందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 2026-27 సంవత్సరానికి గాను అంచనా బడ్జెట్ 32 కోట్ల 42 లక్షల రూపాయల అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారని, ఇందులో 4 కోట్ల 77 లక్షల రూపాయలు సాధారణ ఆదాయం ( గ్రాంట్లు కాకుండా), 26 కోట్ల 28 లక్షల రూపాయల గ్రాంట్లు, 81 లక్షల రూపాయల డిపాజిట్లు, అడ్వాన్సులు, 55 లక్షల రూపాయల నిలువ ఉంటుందన్నారు. అనంతరం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 34 వార్డులలో 1 సంవత్సర కాలంలో మురికివాడలను పూర్తిగా అభివృద్ధి చేసే విధంగా అందరి సమన్వయంతో చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపల్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని, మున్సిపల్ పరిధిలోని పారిశుద్ధ్యం, ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ, ప్రజా సమస్యల పరిష్కారంపై పాలకవర్గ సభ్యులు జవాబుతారీతనంతో వ్యవహరించాలన్నారు. మున్సిపల్ పరిధిలోని అన్ని రంగాలను అభివృద్ధి చేసే విధంగా బడ్జెట్ కేటాయించడం జరుగుతుందని, ఆయా కేటాయింపుల ప్రకారంగా నిధులను వినియోగించి అభివృద్ధి చర్యలు చేపట్టాలన్నారు. నియోజకవర్గ పరిధిలోని అర్హత గల ప్రతి లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు అందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వార్డుల కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సరిపడా ఇంధన, ఎల్పీజీ గ్యాస్ నిల్వలు

- ప్రజలెవరూ అసత్య ప్రచారాలను నమ్మవద్దు
- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.



**ములుగు బ్యూరో, మార్చి26 (జనం సాక్షి):** జిల్లా ప్రజలకు సరిపడా ఇంధన, ఎల్పిజి గ్యాస్ సిలిండర్ల నిలువలు ఉన్నాయని ప్రజలు ఎవరు అసత్య ప్రచారాలను నమ్మి ఆందోళనకు గురి కావద్దని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎల్‌పీజీ వంట గ్యాస్ మరియు పెట్రోల్,డీజిల్ సరఫరాకు సంబంధించి ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. జిల్లాలో ఇంధన నిల్వలు సరిపడా అందుబాటులో ఉన్నాయని, సరఫరా నిరంతరాయంగా కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలోని పెట్రోల్ బంకుల్లో ఇంధనం, ఎల్‌పీజీ గ్యాస్ ఏజెన్సీల వద్ద సరిపడా స్టాక్ అందుబాటులో ఉందని, ముందస్తు బుకింగ్స్ కూడా పూర్తి చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఇంధన సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండా డీలర్లు, రీటైల్ యూనిట్లు, సివిల్ సప్లైస్ అధికారులతో సమన్వయం చేయడం జరుగుతుందని, రాష్ట్రవ్యాప్తంగా కూడా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవని అన్నారు. ప్రజలెవరు సోషల్ మీడియాలో, ఇతర మాధ్యమాల్లో వచ్చే అసత్య వార్తలను, వదంతులను నమ్మి ఆందోళనకు గురికావద్దని కోరారు. ఇంధనాన్ని గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ చేయడం, కృత్రిమ కొరత సృష్టించడం వంటి పనులకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

# నాకాబంధీలో ఆదిలాబాద్ జిల్లా

- నేరాల నియంత్రణ కోసమే..
- జిల్లాలో 28 చెక్‌పోస్టుల ఏర్పాటు
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి) :** ఇక నుంచి ఆదిలాబాద్ జిల్లా మొత్తం పోలీసుల నాకాబంధీ వలయంలో ఉండనుంది. ఇందుకు సంబంధించి స్వయంగా జిల్లా ఎస్పి అఖిల్ మహాజన్ జిల్లా సరిహద్దుల్లో రాత్రి వేళ పోలీసులతో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. నేరాల నియంత్రణ కోసమే ఈ నాకాబందీ చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. గత రాత్రి 9 గంటల నుండి 12 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా ఏకకాలంలో నాకాబంది నిర్వహించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ స్వయంగా బుధవారం రాత్రి జిల్లా వ్యాప్తంగా 20 పోలీస్ స్టేషన్ల పరిధిలో 28 చెక్‌పోస్ట్‌లను ఏర్పాటు చేసి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు అక్రమ రవాణాలకు అడ్డుకట్ట వేస్తున్నారు. నిబంధనలు అతిక్రమించి నంబర్ ప్లేట్ లేకుండా, డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ, లైసెన్స్ లేకుండా తిరుగుతున్న వాహనదారులపై కొరడా ఝులిపిస్తున్నారు. జిల్లాలో ఎక్కడా అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా మహారాష్ట్రతో సరిహద్దుతో ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో చెక్ పోస్టను ఏర్పాటు చేసి కట్టడి చేసి అన్ని వేళలా నిఘా పెడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళలో మైనర్లు వాహనాలు నడుపుతున్న క్రమంలో వీటిపై ప్రత్యేక చర్యలు చేపడుతూ, డ్రంక్ అండ్ డ్రైవ్, ఆటో డ్రైవర్లు ద్విచక్ర వాహనదారులను సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపే వారిపై దృష్టి సారిస్తూ జరిమానాలు విధిస్తున్నారు. ఈ క్రమంలో ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 41 డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు, నంబర్ ప్లేట్ లేని 13 ద్విచక్ర వాహనాలు, సరైన ధ్రువపత్రాలు లేని మూడు ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలు ఒక కారు ఒక కంటైనర్ వాహనం స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా జైనథ్ పిప్పర్ వాడ చెక్‌పోస్ట్ వద్ద అక్రమంగా అనుమతులు లేకుండా రెండు బొలెరో వాహనంలో తరలిస్తున్న ఆరు ఎడ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలో ఉట్నూర్ ఎఎస్పీ రుత్విక్ సాయి కొట్టే ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, మావల ఎస్హెచ్ఓ రాహుల్ కాంత్ సిఐలు ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్ ఎల్పీజీ కొరత లేదు

**నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



**నిర్మల్ బ్యూరో, మార్చి26 (జనంసాక్షి) :** జిల్లాలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ గ్యాస్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, ఎలాంటి కొరత లేదని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. ఇంధన కొరతపై వస్తున్న వార్తలు అపోహలేనని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పెట్రోల్ బంకుల వద్ద అనవసరంగా రద్దీ ఏర్పడకుండా 'పానిక్ బాయింగ్' చేయవద్దని సూచించారు. గ్యాస్ సరఫరా కూడా యథావిధిగా కొనసాగుతోందని చెప్పారు. పరిస్థితిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, ప్రజలకు ఇంధనం నిరంతరం అందుబాటులో ఉంటుందని కలెక్టర్ భరోసా ఇచ్చారు.

# ఉపాధి పనులు 31లోగా పూర్తి చేయాలి

- ఇంటి పన్నుల వసూలులో వేగం పెంచాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి
- సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్



హనుమకొండ ప్రతినిధి మార్చి 27 (జనం సాక్షి) :ఉపాధి హామీ పనులకు సంబంధించి అన్ని పనులు ఈనెల 31 లోగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఎంపీడీవోలను ఆదేశించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలు నుండి డీఆర్డీవో మేన శ్రీను, డీపీవో లక్ష్మీ రమాకాంత్, పంచాయతీ రాజ్ ఈఈ సైదుల్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడీ సిద్ధార్థ నాయక్, ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో ఉపాధి హామీ పనులు, ఇంటి పన్నుల వసూలు, తాగునీరు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిపై ఎంపీడీవోలు, ఎంపీవోలతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఉపాధి హామీ పనులు, బిల్లుల చెల్లింపులు, పల్లె ప్రకృతి వనాలు, ఇంటి పన్నుల వసూలు, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి పురోగతిపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ జిల్లాలో గ్రామ పంచాయతీల వారీగా ఉపాధి హామీ పెండింగ్ పనులపై ఎంపీడీవోలు సమీక్ష నిర్వహించాలన్నారు. గ్రామాలలో పచ్చదనం పరిశుభ్రత ఉండాలని అన్నారు. గ్రామపంచాయతీలకు సంబంధించిన పల్లె ప్రకృతి వనాలలో మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్నీ గ్రామపంచాయతీలలో వంద శాతం ఇంటి పన్నులు వసూలు సాధించాలన్నారు. ఇంటి పన్నుల వసూలులో తక్కువ శాతం ఉన్న గ్రామపంచాయతీలలో వంద శాతం పూర్తి చేయాలని ఎంపీవోలను కలెక్టర్ ఆదేశించారు. యాభై శాతం కంటే తక్కువ పన్నులు ఉన్న జీపీల పంచాయతీ కార్యదర్శులకు నోటీసులు జారీ చేయాలని డీపీవోను ఆదేశించారు. గ్రామపంచాయతీలకు సంబంధించిన వివిధ అంశాలపై వారంలో నాలుగు రోజులు ఎంపీవోలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని అన్నారు. ఈ సమావేశంలో డీఎల్పివోలు రవిబాబు, గంగ భవాని, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఆదర్శం చైర్ పర్సన్ దంపతులు

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



**బెల్లంపల్లి, మార్చ్ 26 (జనంసాక్షి) :** ప్రజలకు ఆదర్శం మున్సిపల్ చైర్ పర్సన్ దంపతులు అని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. గురువారం బెల్లంపల్లి పట్టణంలో గురువారం బెల్లంపల్లి మున్సిపల్, వివిధ శాఖల అధికారులు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, మీడియా ప్రతినిధుల సహకారంతో నిర్వహించిన నేత్ర, అవయవ, శరీర దాన అవగాహనా కార్యక్రమం జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ర్యాలీ మున్సిపల్ కార్యాలయం నుంచి కాంట చౌరస్తా వరకు కొనసాగింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే వినోద్ మాట్లాడుతూ ప్రజలందరు అపోహలు వీడి నేత్ర అవయవ దానానికి ముందుకు రావాలని కోరారు. నేత్ర, అవయవదానానికి అంగీకారం తెలిపిన చైర్ పర్సన్ దంపతులు దావ స్వాతిరమేష్ పట్టణ ప్రజలకు ఆదర్శంగా నిలిచారని అభినందించారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతిరమేష్ మాట్లాడుతూ మనిషి మరణానంతరం మానవ శరీర భాగాలు వృధా చేయకుండా నేత్ర, అవయవ, శరీర దానానికి ముందుకు రావాలని ప్రజలని కోరారు. నేత్ర, అవయవ దానం కోసం జనహిత సేవా సమితి కృషిని అభినందించారు. నెల రోజుల వ్యవధిలో బెల్లంపల్లి పరిసరాల్లో నేత్రదాతలు బింగి అశోక్ కుమార్, కొట్టే సత్యప్రకాష్, లింగంపల్లి వర్శిత, ఆయిల్ల మల్లేష్ కుటుంబ సభ్యుల స్ఫూర్తితో నాలుగు నేత్రదానాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. వీరి స్ఫూర్తితో ప్రజలందరు ముందుకు రావాలని కోరారు. మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతిరమేష్ దంపతులు నేత్ర అవయవ దాన అంగీకారపత్రంపై ఎమ్మెల్యే సమక్షంలో సంతకం చేసి బెల్లంపల్లి ప్రథమ పౌరురాలిగా ప్రజలందరికీ ఆదర్శంగా నిలిచారు. అనంతరం జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ జనహిత సేవా సమితి 9వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 29న ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు బెల్లంపల్లి తాపీ సంఘ భవనంలో నేత్ర, అవయవ, శరీర దాన అవగాహన సదస్సు, అంగీకార పత్రాల స్వీకరణ కార్యక్రమం ఉంటుందని అన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో అంగీకారం తెలిపి విజయవంతం చేయాలని కోరారు. ప్రజలు నేత్రదానం అంగీకారం కోసం జనహిత సేవా సమితిని సంప్రదించాలన్నారు. ఈకార్యక్రమంలో ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ సంపత్, ఏసీపీ కిరణ్ కుమార్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరెండేంట్ రవి కుమార్, బెల్లంపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ రాగంశెట్టి సత్యనారాయణ, పోలీసు సిబ్బంది, కౌన్సిల్ సభ్యులు, నాయకులు, స్వచ్ఛంద సంస్థలు, వాకర్స్ సభ్యులు ప్రజలు పాల్గొన్నారు.

# బీసీ కమిషన్ ఛైర్మన్‌ను కలిసిన కలెక్టర్



**హనుమ కొండ ప్రతినిధి, మార్చి 26 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్ హనుమ కొండలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనేందుకు గురువారం జిల్లాకు విచ్చేసిన సందర్భంగా, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. టీజీ ఎన్పీడీసీఎల్ అతిథి గృహంలో కలెక్టర్, బీసీ కమిషన్ ఛైర్మన్‌ను ఆత్మీయంగా కలసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సంక్షిప్తంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో టీజీ ఎన్పీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ మధుసూదన్ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# హజ్ యాత్రీకులకు వైద్య పరీక్షలు



**వరంగల్ ఎంజీఎం, మార్చి 26(జనంసాక్షి):** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ ఆధ్వర్యంలో హజ్ యాత్రకు వెళ్లే వారికి అన్ని రకముల సదుపాయాలు కల్పిస్తున్నట్లు అందులో భాగంగా హజ్ వెళ్లే వారందరికీ వైద్య ఆరోగ్యశాఖ ద్వారా అన్ని రకములైన వైద్య పరీక్షలు నిర్వహించడం అలాగే అవసరమైన వ్యాక్సిన్లను ఇప్పించడం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర హజ్ .కమిటీ చైర్మన్ కుష్రూపాషా పేర్కొన్నారు. ఈరోజు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ,ఎంజీఎం హాస్పిటల్ మరియు జిల్లా హజ్ కమిటీ ఆధ్వర్యంలో ఐఎంఏ హాల్ వరంగల్ లో నిర్వహించిన టువంటి వ్యాక్సినేషన్ కార్యక్రమా నికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాత్రకు వెళ్లేవారు ఆరోగ్యపరమైనటువంటి అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్స్ ఇచ్చిన సలహాలు తప్పకుండా పాటించాలన్నారు. ఎంజీఎం సూపర్ ఇంటెండెంట్ డాక్టర్ హరిచంద్ర రెడ్డి మరియు డిఎంహెచ్ఓ డాక్టర్ ఏ అప్పయ్య యాత్రికులకు అవసరమైన అన్ని ఆరోగ్య సలహాలను వివరించడం జరిగింది. 53 మందికి అవసరమైన వ్యాక్సిన్లను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ హరిచంద్ర రెడ్డి, డిఎంహెచ్ఓ డాక్టర్ ఏ అప్పయ్యజిల్లా హజ్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ అనీస్ సిద్ధికి, వీస .నజీముద్దీన్,జిలానీ, ఇన్చార్జి ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ జ్ఞానేశ్వర్ ,డాక్టర్ నాగరాణి ,డాక్టర్ రెహమాన్ ,డాక్టర్ రుబీనా అఫ్రోజ్ జిల్లా మాస్ మీడియా అధికారి వి అశోక్ రెడ్డి, జునేది,ఏ రమేష్ ,శిరీష ప్రవీణ్ ,రెహమాన్ ,జమాలుదీన్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు

# ఆదివాసీ అస్తిత్వ గర్జన.. విప్లవ వీరుడు కామ్రేడ్ కుంజ రామన్న

- ఆదివాసీ లిబరేషన్ టైగర్....21 వ వర్ధంతి
- అడవి బిడ్డల ఆత్మగౌరవం కోసం, అణగారిన వర్గాల రాజ్యాధికారం కోసం గర్జించిన 'ఆదివాసీ లిబరేషన్ టైగర్'...



**కొత్తగూడ, మార్చి 26 (జనంసాక్షి):** ఉమ్మడి వరంగల్ జిల్లా పాఖాల కొత్తగూడ మండలంలోని మోకాళ్లపల్లి అనే గిరిజన గూడెంలో కుంజ రాము జన్మించాడు. కోయతెగకు చెందిన నిరుపేద కుటుంబంలో కన్నయ్య, లచ్చుమ్మ దంపతులకు జన్మించిన రాము, ఆదివాసీల హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేశాడు.

జాతి మనుగడ, అస్తిత్వ పరిరక్షణకై ఆదివాసీ ప్రజా ఉద్యమాలే కాకుండా సాయుధ గెరిల్లా తరహా పోరాటమే శరణ్యమని రాము భావించాడు. ఈ లక్ష్యంతోనే 2004, సెప్టెంబర్ 30న స్వతంత్రంగా 'ఆదివాసీ లిబరేషన్ టైగర్స్' అనే విప్లవ సంస్థను స్థాపించాడు. సామాజిక అసమానతలపై పోరాడుతున్న కామ్రేడ్ మారోజు వీరన్న (సిపియుఎస్ఐ)తో సమకాలికంగా రాము పనిచేశాడు. ఆదిలాబాద్ నుండి శ్రీకాకుళం వరకు గల షెడ్యూల్డ్ ఏజెన్సీ ప్రాంతాలను ఐక్యం చేస్తూ, ప్రత్యేక పరిపాలన విధానాన్ని, స్వయం పాలనను ఆదివాసీలకే అందించాలని ఆయన ఆకాంక్షించాడు.

ఆదివాసీ సమాజం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండడానికి పాలకులు, ప్రభుత్వ విధానాలే కారణమని రాము నమ్మాడు. షెడ్యూల్డ్ ఏజెన్సీ ప్రాంతాలు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా తమను తామే పరిపాలించుకోవాలని, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లభించాలంటే కేవలం ప్రజా ఉద్యమాలు పరిష్కారం చూపవని భావించాడు. ప్రత్యామ్నాయంగా ఆదివాసీ గెరిల్లా పోరాటాలు తక్షణావసరమని చాటిన ఏకైక ఆదివాసీ విప్లవోద్యమ నాయకుడు కుంజ రాము.

విప్లవోద్యమంలో మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనలను ఆకళింపు చేసుకొని జనశక్తి పార్టీలో తిరుగులేని నాయకుడిగా ఎదిగాడు. ఉద్యమంలో ఏర్పడ్డ చీలికల కారణంగా సిపిఎస్ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తూ అరెస్టు కాబడి జైలు జీవితం గడిపాడు. రాజ్యాధికారం సాధించాలంటే అణగారిన వర్గాల పోరాటాలే ప్రధాన భూమిక పోషించాలని భావించి.. తుడుం దెబ్బ, మాదిగ దండోరా, డోలి దెబ్బ, మోకు దెబ్బ, పూసలకేక వంటి అనేక కుల సంఘాలను సంఘటిత పరిచిన యోధుడుగా చెప్పవచ్చు.

తన 35 ఏళ్ల అజ్ఞాత జీవితంలో రాంజీ గోండు, కుమ్రం భీం, సోయం గంగులు వంటి వీరయోధుల పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకున్నాడు. భారత రాజ్యాంగం కల్పించిన ఐదవ షెడ్యూల్ భూభాగమంతా స్వయం పాలన కింద ఉండాలని, 'జల్-జంగల్-జమీన్' కోసం 'మా ఊళ్లో మా రాజ్యం' అనే నినాదంతో పోరాడారు. జాతి అస్తిత్వం కోసం సాయుధ పోరాటమే మార్గమని నమ్మిన వ్యక్తి...

2005 మార్చి 27న వరంగల్, ఖమ్మం జిల్లా సరిహద్దు ప్రాంతంలోని ఎర్రమ్మ గుట్టలపై (కంబాలపల్లి ప్రాంతం) సమావేశమై ఉన్న సమయంలో, పోలీసులు ఏకపక్షంగా జరిపిన కాల్పుల్లో రాము అసువులు బాశాడు. రాము భౌతికంగా లేకపోయినా, ఆయన నిగిల్చిన స్వయం పాలన నినాదం నేటికీ అనేక ఏజెన్సీ గ్రామాల్లో సజీవంగానే ఉంది. ప్రతి ఏటా కుంజ రాము (ఆదివాసి లిబరేషన్ టైగర్) స్వస్థలమైన ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రస్తుతం మహబూబాద్ జిల్లా ములుగు నియోజకవర్గంలోని కొత్తగూడ మండలంలోని మోకాళ్ళపల్లి గ్రామంలో కుటుంబ సభ్యులు మంత్రి సీతక్క తనయుడు కుంజ సూర్య కుసుమాంజలి, ఆదివాసి ఉద్యమ సంఘాల ఆధ్వర్యంలో స్మృతి సభను ఘనంగా నిర్వహిస్తారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
27 మార్చి 2026

# విద్యార్థుల చదువులపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలి

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**కనగల్లు, మార్చి 26 (జనం సాక్షి) :** విద్యార్థుల చదువులపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలని రాష్ట్ర రోడ్లు భవనముల, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో 6 కోట్ల రూపాయలతో మంజూరైన ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనానికి జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ లతో కలిసి భూమి పూజ చేశారు. సంక్షేమ పథకాలు పేదవాడికి అందజేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వాని కె సాధ్యమని గుర్తు చేశారు. కుటుంబంలో విద్య మెరుగుపడితే ఆ కుటుంబానికి సమాజంలో గౌరవంతో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో మెరుగైన సౌకర్యాలు ఏర్పాటుతోపాటు అల్పాహారం, మధ్యాహ్న భోజన వసతులను కూడా కల్పించడం జరుగుతుందన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సోనియమ్మ ఇచ్చినప్పటి రెండు పర్యాయాలు టిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండి కుటుంబ పాలనే నడిపి దోచుకుని దాచుకున్నారే తప్ప పేదవాడికి జరగాల్సిన సంక్షేమ న్యాయం జరగలేదని తెలిపారు. కెసిఆర్ కు ఉత్తర తెలంగాణ పై ఉన్న ప్రేమ దక్షిణ తెలంగాణ పై లేదన్నారు. అరులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు, తెల్ల రేషన్ కార్డు, సన్న బియ్యం, వంటి ప్రజలు మెచ్చిన పథకాలను ఇవ్వడం జరుగుతుందన్నారు. 180 కోట్లతో ధర్వేశిపురం నుండి కనగల్లు మీదుగా గుర్రంపోడు, మల్లె పెల్లి,



దేవరకొండ, వరకు నాలుగు లైన్ల రోడ్డు మంజూరైనట్టు తెలియజేశారు. 8 కోట్ల రూపాయలతో కనగల్ చౌరస్తాని జంక్షన్ గా మార్చి కనగల్ గ్రామ కేంద్రం వరకు నాలుగు లైన్ల రోడ్డును వేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. వచ్చే విద్యా సంవత్సరం లోపు కళాశాల నిర్మాణ పనులను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. సోలార్ మీటర్లను ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని తెలిపారు. మహిళలకు ఉపాధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రతి మహిళ స్వయం సహాయక సంఘములో సభ్యురాలుగా నమోదు కావాలని భవిష్యత్తులో వారిదే రాజ్యాధికారం కాబోతుందని గుర్తు చేశారు. కేంద్రీయ విద్యాలయం లాగానే తెలంగాణ రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. నల్లగొండ నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో ఏ సమస్య ఉన్న నాయకులు ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను పరిష్కారమయ్యేలా చోరువ చూపాలన్నారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో 90 శాతం సర్పంచులను, వార్డు సభ్యులను గెలిపించినందుకు నాయకులకు కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గెస్ట్ లెక్చరర్ల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నల్లగొండ నియోజకవర్గంలో పరిశ్రమలను నెలకొల్పి ఉద్యోగ అవకాశాలు అందేలా చూస్తానని తెలిపారు . కనగల్లులో అపరిష్కృతంగా ఉన్న ఇంటి స్థలాలను పరిష్కరించాలని, దరఖాస్తు చేసుకున్న ప్రతి లబ్ధిదారునికి ఇందిరమ్మ ఇల్లు మంజూరి ఇచ్చేలా చూడాలని మంత్రిని మాజీ జెడ్పిటిసి నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్ విన్నపం చేశా రు. అనంతరం కళ్యాణ లక్ష్మి చెక్కులను మంత్రి లబ్దారులకు అందజేశా రు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, ఆర్డీవో వై అశోక్ రెడ్డి, డి ఏ ఓ బసవయ్య, తహసిల్దార్ పద్మ, ప్రిన్సిపల్ రాకేందు కుమార్, ఆర్టిఏ సభ్యులు రాజారెడ్డి, ఇన్చార్జి ఎంపీడీవో పి సతీష్ కుమార్, డిటి పార్వతమ్మ, డిపిఆర్ఓ వెంకటేశ్వర్లు, ఏవో అమరేందర్ గౌడ్, స్థానిక సర్పంచ్ నర్సింగ్ మురళీధర్ గౌడ్, డి.ఎస్.పి శివరాం రెడ్డి, సీఐ కె ఆదిరెడ్డి, ఎస్ఐ రాజీవ్ రెడ్డి, ఆర్ఐలు సునీత యాదగిరి, ఏఈలు రామకృష్ణ షఫీ ఉద్దీన్, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో మౌళిక సదుపాయాలు కల్పించాలి

- నెల రోజుల్లో పనులు పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, మార్చి 26 (జనంసాక్షి) :** జిల్లా కేంద్రం సమీపంలోని కేసారం వద్ద నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో మౌళిక సదుపాయాలను కల్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సంబందిత కాంట్రాక్టర్ ను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లో రెవెన్యూ, మున్సిపల్, హౌసింగ్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. పట్టణ ప్రజల కోసం నిర్మించిన రెండు పడకల గదుల ఇళ్లలో మౌళిక సదుపాయాలు తాగునీరు, విద్యుత్ మొదలైన సదుపాయాలను నెల రోజుల్లో పూర్తిచేయాలని సంబందిత కాంట్రాక్టర్ ఆదేశించారు. వాటర్ ట్యాంక్ లకు కనెక్షన్ల పనులు పూర్తి చేసి నీటిసరఫరా జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిద్ధార్థ, సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వచ్చిన నిధులను కావాలనే అడ్డుకుంటున్నారు

- ఇన్-ఛార్జ్ ఎంపీడీవో పై మాజీ సర్పంచుల సంచలన ఆరోపణలు!
- నల్లగొండ కలెక్టర్ స్పందించాలి..
- లేదంటే ఆందోళన ఉధృతం చేస్తాం
- గుర్రంపోడు మాజీ ప్రజాప్రతినిధుల హెచ్చరిక



**గుర్రంపోడు, మార్చి 26 (జనంసాక్షి) :** నల్గొండ జిల్లా గుర్రంపోడు మండల కేంద్రంలో మాజీ సర్పంచులు పోరుబాట పట్టారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తి చేసినా.. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వారు గళమెత్తారు. గుర్రంపోడు మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. 2019 నుంచి 2024 వరకు తాము సర్పంచులుగా ఉన్న సమయంలో.. ప్రభుత్వ ఆదేశాల మేరకు, గ్రామాల అభివృద్ధి కోసం అప్పులు తెచ్చి మరీ పనులు పూర్తి చేశామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే, గతంలో చేసిన పనులకు సంబంధించి ప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పటికీ.. ప్రస్తుతం గుర్రంపోడు మండలంలో ఇన్-ఛార్జ్‌గా ఉన్న ఎంపీడీవో ఆ నిధులను కావాలనే అడ్డుకుంటున్నారని వారు నేరుగా ఆరోపిస్తున్నారు. రికార్డులను క్లియర్ చేయడంలో అధికారులు జాప్యం చేయడం వల్ల తాము వడ్డీలు కట్టలేక రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని మాజీ సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నల్గొండ జిల్లా కలెక్టర్ స్పందించి, తమకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించేలా చూడాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు." ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు ఎస్కే సయ్యద్ మియా, నరసింహ, ఎస్.కె మదర్ షా, అశోకు, బాల మల్లయ్య, కేసాని యాదగిరి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి కట్టే బోయిన విజయ్,, పాల్వాయి శ్రీను, మర్రి సైదులు, బద్రి యాదయ్య,కే జగదీశ్వర్ రెడ్డి, కృష్ణ ప్రసాద్, లింగారెడ్డి, చల్లమల్ల ప్రతాప్ రెడ్డి, ఎరుకల రామలింగం తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే నివారణ సులభం



**సూర్యాపేట, మార్చి 26 (జనంసాక్షి) :** క్యాన్సర్ ను ప్రాథమిక దశలో గుర్తిస్తే నివారణ సులభమని, అలా గుర్తించేందుకు వీలుగా కొంగరి భవాని జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు, ఎంఎస్ఆర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం వారి సౌజన్యంతో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వారిచే ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిభిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంఎస్ఆర్ విద్యాసంస్థల అధినేత కొల్లు మధుసూదన్ రావు, కొంగర భవాని ట్రస్ట్ చైర్మన్ కొంగర రామచంద్రరావు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని విద్యానగర్ లో గల ఎంఎస్ఆర్ కిడ్జ్ పాఠశాలలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిభిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. నేడు క్యాన్సర్ వ్యాధి ప్రమాదకరంగా మారిందని అన్నారు. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి హెచ్ఓడి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా బసవతారకం ఆసుపత్రి ఆధ్వర్యంలో క్యాన్సర్ కు చికిత్స అందించడం జరుగుతుందన్నారు. అనుమానస్పదమైన గడ్డలు, మానని పుండు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలన్నారు. క్యాన్సర్ లక్షణాలు త్వరగా కనిపించవని ఇలాంటి శిబిరాలను సద్వినియోగం చేసుకుంటే ముందుగా క్యాన్సర్ ను గుర్తిస్తే తక్కువ ఖర్చుతో చికిత్స పొంది ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చన్నారు. ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకున్న 200ల మందితో పాటు మరో 100మందికి మొత్తం 300ల మంది వరకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసి సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఆర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ కొల్లు శ్రీనివాసరావు, చేతన ఫౌండేషన్ చైర్మన్ సీతారామయ్య, డాక్టర్లు రవిశంకర్, శైలజ, మాన్విత, రేడియాలజిస్ట్ ప్రభాకర్ నర్సింగ్, టెక్నీషియన్ సిబ్బందితో పాటు చందన నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## కంటి ఆపరేషన్ల బ్రోచర్ రిలీజ్ చేసిన మంత్రి పొంగులేటి



**మణుగూరు, మార్చి 26 (జనం సాక్షి) :** మణుగూరు ఏరియా ఆసుపత్రిలో ఆప్తాల్మిక్ ఆఫీసర్ జి.సంజీవరావు ఒక ఏడాదిలో 1628 కంటి ఆపరేషన్ చేయించి రికార్డ్ సృష్టించారు. గురువారం హైదరాబాద్ సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చే కంటి ఆపరేషన్ల బ్రోచర్ని రిలీజ్ చేయించారు. గత 35 సంవత్సరాల నుంచి ఏజెన్సీ ఏరియాలో కంటి వైద్యులుగా ఎంతోమంది నిరుపేదలకు కంటి వైద్యం అందించిన ఘనత సంజీవరావు ది ఆయనను గత సంవత్సరం ఖమ్మం జిల్లా,కామేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీపై పంపారు. ఆ తర్వాత రెండు నెలలు పినపాక నియోజకవర్గం లోని అశ్వాపురం మణుగూరు పినపాక మండలాలు వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలు ఎంతోమంది నిరుపేదలు కంటి వైద్యం అందక ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చొరవతో పారన్ సర్వీస్ డిప్యూటేషన్లో మణుగూరు ఏరియా హాస్పిటల్‌కి తిరిగి పంపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డిఎంఅండ్‌హెచ్ఓ, డిసిహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు సహాయం అందించటంతో ఒక సంవత్సర కాలంలో తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధికంగా 1628 కంటి ఆపరేషన్లు చేయించి రికార్డు సృష్టించారు. జిల్లా అధికారులు స్థానిక ఎమ్మెల్యే ల మంత్రుల చేతుల మీదుగా అవార్డులు అందుకొని శభాష్ అనిపించుకున్నారు..

# కార్పొరేషన్ ఉద్యోగులను ఒకే తాటిపైకి తీసుకొస్తాం

**ఖమ్మం, మార్చి 26 (జనంసాక్షి) :** ఖమ్మం కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ ఒకే తాటిపైకి తీసుకొస్తామని టీఎన్జీవో ఖమ్మం జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఖమ్మం కార్పొరేషన్‌కు చెందిన ముఖ్య ఉద్యోగ నాయకులతో మున్సిపల్ ఉద్యోగ జేఏసీ ఏర్పాటుపై సన్నాహక సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం కార్పొరేషన్‌లో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగ నేతలతో జేఏసీ ఏర్పాటు, ఉద్యోగుల సమస్యలు మరియు భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. ఇటీవల నిర్దిష్ట అభియోగం లేకుండా ఒక ఉద్యోగిని సరెండర్ చేయాలన్న కార్పొరేటర్ల తీర్మానాన్ని ఉద్యోగులందరూ తీవ్రంగా వ్యతిరేకించారు. కొందరు కార్పొరేటర్లు విషయం పూర్తిగా తెలియజేయకుండా తీర్మాన కాపీలపై సంతకాలు సేకరించారని ఉద్యోగ సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి కొణిదెన శ్రీనివాస్, టీజీవో కార్యదర్శి వేలాద్రి, టీఎన్జీవో జాయింట్ సెక్రటరీ తాళ్లూరి శ్రీకాంత్, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బిక్కు,





కార్యదర్శి రమణ, టీఎన్జీవో ఖమ్మం పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ చారి, మున్సిపల్ ఉద్యోగుల ఫోరమ్ అధ్యక్షుడు సుధాకర్, కార్యదర్శి శ్రీనివాస్, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బుర్రి వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మి, బుర్రి నాగేశ్వరరావు, హేమంత్, కవిత, రవీందర్, నాగరాజు, వసంత, ప్రేమ్ రెడ్డి, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## సాదాబైనమా భూభారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




**సూర్యాపేట ప్రతినిధి, మార్చి 26 (జనంసాక్షి) :** జిల్లాలో పెండింగ్ లో ఉన్న సాదాబైనామా, భూ భారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లో జిల్లాలోని ఆర్డీవోలు, తహసిల్దార్లతో పెండింగ్ సాదాబైనామా, భూభారతి, భూ సమస్యలపై వేబెక్స్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలుదారు, అమ్మకందారు ఇద్దరి నుంచి అఫిడవిట్ తీసుకోవాలన్న నిబంధనతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కొనుగోలుదారు నుంచి మాత్రమే అఫిడవిట్ తీసుకునేలా జీవో 76ను జారీ చేసినట్లు తెలిపారు. సాదా బైనామా ద్వారా భూములు అమ్ముకునే సమయంలో అమ్మే వ్యక్తి రికార్డు నందు నమోదు కలిగి ఉండాలని అన్నారు. అదే విధంగా పట్టా భూములను మాత్రమే ప్రాసెస్ చేయాలని సూచించారు. వీటితో పాటు భూమి మీద పొజిషన్ తో పాటు 5ఎకరాల లోపు భూములు కలిగి ఉన్న వారికి మాత్రమే పరిష్కరించాలన్నారు. నోటీస్ జారీ చేసి 30 రోజులు పూర్తి అయిన వాటిని పరిష్కరించాలని, క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి పంచనామా చేయాలని తెలిపారు. చాలన్ కట్టే ముందు ఒకటికి రెండు సార్లు తనిఖీ చేసి స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు సరిచేసుకోవాలని ఆదేశించారు. సాదా బైనమా దరఖాస్తులకు పరిష్కారం తొందరగా పూర్తి చేసి అర్హులైన వారికి 13బి పట్టాలను జారీ చేయాలని తెలిపారు. భూభారతి పెండింగ్ దరఖాస్తులను 15 రోజుల్లో పరిష్కారం చూపాలని, అలాగే కోర్టు కేసులు, హైకోర్టులో నమోదైన కేసులకు విధిగా జవాబు ఇవ్వాలన్నారు. స్లాట్స్ బుకింగ్ క్యాన్సిల్ చేసుకున్న వారికి రీ పేమెంట్ అయ్యే విధంగా చర్యలు చేపట్టలని సంబంధిత తహశీల్దార్లను ఆదేశించారు. స్పెషల్ ఇంటెన్సివ్ కింద ఎలక్షన్ మ్యాపింగ్ ఎంట్రీ త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఫారం - 6,7,8 పెండింగ్ లేకుండా చూడాలని, మరణించిన ఓటర్లును జాబితా నుండి తొలగించాలని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి సుదర్శన్ రెడ్డి, సూపరింటెండెంట్లు సాయిగౌడ్, శ్రీలత, సంతోష్ కిరణ్ పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి

- రోడ్డును వినియోగించే సమయంలో జాగ్రత్తగా ఉండాలి
- రోడ్డు ప్రమాదాల నివారణ కోసమే అరైవ్ - అలైవ్ ఉద్యమం
- తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలు
- సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నరసింహ

**సూర్యాపేట, మార్చి 26 (జనంసాక్షి) :** ఉజ్వలమైన, ఉన్నతమైన లక్షాలను ఎంచుకుని నిరంతరం కృషి చేస్తే మంచి విజయాలు వస్తాయని జిల్లా ఎస్పీ కె.నరసింహ అన్నారు. పాఠశాలలు దేవాలయాలని, తరగతి గదులు ప్రయోగశాలలని వీటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గురువారం దురాజ్ పల్లిలోని ఎంఎస్ఆర్ సెంట్రల్ స్కూల్ నందు చివ్వెంల పోలీసులు, షీ టీమ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అరైవ్ అలైవ్ అవగాహన కార్యక్రమంకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులను ఉద్దేశించి మంచి లక్ష్యాలు ఎంచుకోవడం, ప్రణాళికతో చదువుకోవడం, చెడు అలవాట్లకు దూరంగా ఉండటం, రోడ్డు భద్రత, సైబర్ మోసాలు లాంటి అంశాలపై అవగాహన కల్పించారు. మంచి ప్రణాళిక పెట్టుకుని చదవాలన్నారు. ప్రస్తుత సమాజంలో రోడ్డు ప్రమాదాలు, సైబర్ మోసాలు, డ్రగ్స్ వినియోగం ప్రధాన సమస్యగా ఉన్నాయని, వీటి నిర్మూలనకు పోలీసు శాఖ కృషి చేస్తుందన్నారు. యువత, పౌరులు భాగస్వామ్యం కావాలని అన్నారు. రోడ్డు ప్రమాదాలు



నివారించడం, రోడ్డు ప్రమాదంలో ఏ ఒక్కరు మరణించకుండా సురక్షితంగా గమ్యం చేరడం, రోడ్డు భద్రతా నియమాలు తెలియజేయడం లక్ష్యంగా రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత మహాఉద్యమం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మానవ తప్పిదాల వల్ల అధికంగా రోడ్డు ప్రమాదాలు సంభవించి ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని, ఏ ఒక్కరూ రోడ్డు ప్రమాదంలో ప్రాణం కోల్పోకూడదనేది పోలీస్ శాఖ లక్ష్యమని తెలిపారు. పిల్లలు వాహనాలు నడపడం ప్రమాదం, నేరమని అన్నారు. రోడ్డు భద్రత గురించి తల్లిదండ్రులకు పిల్లలకు వివరించి సేఫ్టీ డ్రైవింగ్, డిఫెన్సివ్ డ్రైవింగ్ పట్ల చైతన్యవంతం చేయాలని పేర్కొన్నారు. ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించకపోతే రోడ్డు ప్రమాదాలకు గురవుతారని, రోడ్డుపై వెళ్ళేటప్పుడు డిఫెన్సివ్ డ్రైవింగ్, డిఫెన్సివ్ వాకింగ్ చేయాలన్నారు. రోడ్డుపై చుట్టూ ఉన్న పరిసరాలు, ప్రమాదాలు, అడ్డంకులు గమనిస్తూ ముందుకు వెళ్లాలి అన్నారు. అతివేగంగా వాహనాలు నడపవద్దని కోరారు. హెల్మెట్ ధరించాలని, సీటు బెల్టు పెట్టుకోవాలని అన్నారు. దేశ రక్షణలో చనిపోయే వారికంటే రోడ్డు ప్రమాదాలలో చనిపోయే వారి సంఖ్య ఎక్కువ అని గుర్తు చేశారు. డ్రగ్స్ లాంటి వాటికి అలవాటు పడవద్దని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. సమాజంలో డ్రగ్స్ అనేక రకాల రూపంలో దొరుకుతున్నాయని, దీనిని నిర్మూలించాల్సిన భద్రత యువతపై ఉందని, దీని సమాచారం పోలీసు వారికి తెలియజేయాలని కోరారు. సాంకేతికత అభివృద్ధి చెందిన కొద్దీ సైబర్ మోసగాళ్లు కొత్త తరహాలో ప్రజలను మోసగించి ఆర్థిక నష్టాలు కలిగిస్తున్నారని అన్నారు. అపరిచితులు ఏదైనా బహుమతులు ఉన్నాయని ఆశ చూపితే అత్యాశకు పోవద్దన్నారు. వ్యక్తిగత సమాచారం అపరిచితులకు ఇవ్వవద్దని సూచించారు. ఇంటర్నెట్ నందు నకిలీ వెబ్సైట్ దర్శనమిస్తున్నాయని, వాటిల్లో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకున్నట్లయితే అవి సైబర్ మోసగాళ్ల చేతికి వెళ్లి ఆర్థిక నష్టాలు కలుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీం, పోలీస్ కళా బృందం వారు విద్యార్థుల రక్షణ, సామాజిక అంశాల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, షీ టీమ్ ఎస్ఐ నీలిమ, ఎమ్మెస్సార్ విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీనివాస్, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామాలయ అభివృద్ధికి 351 కోట్ల నిధులు మంజూరు

- ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపిన మంత్రి తుమ్మల



**భద్రాచలం, మార్చి 26 (జనంసాక్షి) :** దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయ అభివృద్ధికి మొదటి విడతగా 351 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తూ తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ పరిపాలన జీవో నెంబర్ ఆర్.టి 167 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం రామాలయ అభివృద్ధికి మొత్తం రూ. 586 కోట్లతో మూడు దశల్లో మాస్టర్ ప్లాన్ సిద్ధం అయింది. ఈ క్రమంలోనే తొలి దశలో భాగంగా రూ. 351 కోట్లు మంజూరు అయ్యాయి. 2024 మార్చి 11న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రాచలంలో పర్యటన సందర్భంగా రామాలయం అభివృద్ధి, భద్రాచలం పట్టణం అభివృద్ధి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఇందులో భాగంగానే తాజాగా మొదటి దశ పనులకు పరిపాలన ఉత్తర్వులు దేవాదాయ శాఖ డైరెక్టర్ జారీ చేశారు. నేడు శ్రీ రామ నవమి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు ఆనవాయితీగా సమర్పించేందుకు శ్రీ సీతారాముల కళ్యాణానికి వస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, ఈ సందర్భంగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. కాగా భద్రాద్రి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు.




# యూట్యూబ్ తరహాలో ఇన్‌స్టాలోనూ ప్లేబ్యాక్ స్పీడ్ కంట్రోల్



దిల్లీ:ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌కున్న ఆదరణ గురించి వేరే చెప్పక్కర్లేదు. కొన్నిసార్లు నిడివి ఎక్కువ ఉన్న రీల్స్ ఫీడ్‌లో దర్శనమిస్తుంటాయి. వాటిని కావాల్సిన వేగంతో చూడలేక యూజర్లు ఇబ్బంది పడుతుంటారు. యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి యాప్‌లు వాడి ఇన్‌స్టాగ్రామ్ వచ్చేసరికి తరచూ ఈ సమస్య ఎదురవుతుంటుంది. ఇందుకు చెక్ పెట్టేందుకు ఇన్‌స్టా సిద్ధమైంది. ప్లే బ్యాక్ స్పీడ్ కంట్రోల్ ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకొస్తోంది. అంటే ఇకపై రీల్స్‌ను మనకు కావాల్సిన వేగంతో చూడొచ్చన్నమాట.రీల్స్ చూసేటప్పుడు 0.5ఎ, 1ఎ, 2ఎ, 3ఎ స్పీడ్‌తో కంట్రోల్ ఆప్షన్లు కనిపించనున్నాయి. సుదీర్ఘమైన రీల్స్‌ను తక్కువ సమయాల్లో చూడొచ్చు. రీల్స్ విభాగంలోకి వెళ్లి కుడివైపు కింది భాగంలో ఉన్న మెనూపై క్లిక్ చేస్తే స్పీడ్ ఆప్షన్లు కనిపిస్తాయి. ఇందులో మనకు కావాల్సిన వేగాన్ని ఎంపిక చేసుకోవచ్చు. ఇంతకుముందు రీల్స్ ప్లే అవుతుండగా స్క్రీన్‌ను నొక్కి పట్టుకోవడం ద్వారా వేగంతో చూసే సదుపాయం ఉండేది. ఈ సదుపాయం అంత సౌకర్యవంతంగా లేదన్న అభిప్రాయం యూజర్ల నుంచి వ్యక్తమైంది. దీంతో ఈ మార్పు చేసింది. ఈ ప్లే బ్యాక్ స్పీడ్ కంట్రోల్ ఆప్షన్ ప్రస్తుతం పరిమిత సంఖ్యలో యూజర్లకు మాత్రమే అందుబాటులోకి వచ్చింది.

# పెట్రోల్ కొరతకు ‘ఆర్థిక సంవత్సరమూ’ ఓ కారణం

హైదరాబాద్:పలు పెట్రోలు బంకుల వద్ద దర్శనమిస్తున్న ‘నో స్టాక్’ బోర్డులు ఓ వైపు.. పెట్రోలు, డీజిల్‌కు ఎలాంటి ఇబ్బందీ లేదని చెబుతున్న ఇంధన సంస్థలు, ప్రభుత్వం మరోవైపు..సామాన్య ప్రజల్లో మాత్రం పెట్రోలు దొరకదేమో అనే ఆందోళన..అసలు ఎందుకీ పరిస్థితి? ఈ కొరతకు కారణం అంతర్జాతీయంగా మారుతున్న భౌగోళిక రాజకీయాలు, యుద్ధం మాత్రమే కారణమా? ఇందులో కొంత నిజం ఉన్నా.. ఇప్పటికిప్పుడు వచ్చిన సంక్షోభానికి మాత్రం కారణం వేరే ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.పెట్రోలు కొరతకు కారణం చమురు సంస్థలు, బ్యాంకులు అనుసరిస్తున్న ‘బ్యాలెన్స్ షీట్’ వ్యూహాలేనని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. సాధారణంగా ఆర్థిక సంవత్సరం ముగింపు దగ్గరకు వస్తున్న కొద్దీ దేశంలో సంస్థలు కొన్ని లెక్కలను సరిచేసుకునేందుకు ప్రయత్నిస్తుంటాయి. యుద్ధ మేఘాలకు తోడు, మార్చి 31 నాటికి లెక్కలు తేల్చాలన్న పట్టుదల వెరసి ఇంధన సరఫరా వ్యవస్థలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. దేశంలో చమురు నిల్వల కొరత ఏమాత్రం లేదని, సరఫరా, చెల్లింపుల సమస్య వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని చమురు సంస్థలు స్పష్టం చేస్తున్నాయి.ప్రపంచ చమురు వాణిజ్యానికి అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిలో ఏర్పడిన ఇబ్బందులు భారత ఇంధన సరఫరా వ్యవస్థలపై ప్రభావం చూపుతున్నాయి. నౌకలు దాడుల బారిన పడకుండా ప్రయాణించాల్సి వస్తుండటంతో బీమా ప్రీమియాలు 30-50 శాతం వరకూ అమాంతం




పెరిగాయి. దీని వల్ల చమురు దిగుమతుల ఖర్చు భారీగా పెరుగుతోంది. సాధారణ పరిస్థితుల్లో వారం రోజుల్లో చేరుకోవాల్సిన ముడి చమురు నిల్వలకు ఇప్పుడు 15-20 రోజులు పడుతోంది. ఈ జాప్యం వల్ల దేశీయ రిఫైనరీల వద్ద నిల్వలపై ఒత్తిడి పడుతోంది. ఇది ఇప్పటికిప్పుడు ప్రభావం చూపే అంశమేమీ కాదని నిపుణులు పేర్కొంటున్నారు. బంకుల్లో నిల్వలు లేకపోవడానికి అసలు కారణం కంపెనీల వద్ద స్టాక్ లేకపోవడం కాదని, ఆర్థిక సంవత్సరం ముగింపునకు వర్తించే నిబంధనలేనని తెలుస్తోంది. సాధారణంగా డీలర్లకు చమురు మార్కెటింగ్ సంస్థలు కొన్ని రోజుల రుణ పరిమితిని ఇస్తుంటాయి. మార్చి నెల చివర, దీన్ని తగ్గిస్తూ ఉంటాయి. ముందుగా నగదు చెల్లిస్తేనే ట్యాంకర్లలో పెట్రోలు నింపుతాయి. పాత బాకీ ఒక్క రూపాయి ఉన్నా కొత్త స్టాక్ ఇవ్వకూడదు అన్నట్లుగా ఉంటాయి. ఇది కొత్తేమీ కాదు. దీంతో చాలామంది డీలర్లు నగదు సర్దుబాటు చేయలేక కొత్త ఆర్డర్లు పెట్టలేకపోతున్నారు. ఈ కారణంగా కొన్ని బంకుల్లో ‘నో స్టాక్’ బోర్డులు కనిపిస్తున్నాయి. అంతేకానీ, సంస్థల వద్ద నిల్వలకు ఎలాంటి ఇబ్బందీ లేదని ప్రభుత్వ చమురు సంస్థలు స్పష్టం చేస్తున్నాయి.అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరగడంతో, దేశీయంగా కొన్ని ప్రైవేటు చమురు సంస్థలు తమ బంకుల్లో విక్రయాలను తగ్గించడం లేదా పూర్తిగా నిలిపివేశాయి. దీనివల్ల ఆయా బంకులకు వెళ్లాల్సిన వాహనదారులూ ప్రభుత్వ రంగ బంకుల వైపు మళ్లారు. మరోవైపు పెట్రోలు, డీజిల్ స్టాక్ అయిపోతోం దనే వదంతులూ వినియోగదారుల భయాందోళనలకు కారణమయ్యాయి. దీంతో గిరాకీ ఒక్కసారిగా పెరిగి, సాధారణంగా రెండు రోజులు రావాల్సిన నిల్వలు కొన్ని గంటల్లోనే ఖాళీ అవుతున్నాయని డీలర్లు చెబుతున్నారు. చమురు డీలర్లు బ్యాంకుల నుంచి స్వల్పకాలిక రుణాలు తీసుకొని, చమురు సంస్థలకు డబ్బు చెల్లిస్తూ ఉంటారు. కానీ, ఆర్థిక సంవత్సరం చివర్లో బ్యాంకులూ తమ మొండి బకాయిల శాతాన్ని తగ్గించుకోవడంపైనే ప్రధానంగా దృష్టి సారిస్తాయి. స్వల్పకాలిక రుణాలు లభించకపోవడంతో డీలర్లు డబ్బు సర్దుబాటుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫలితంగా వారు చమురు సంస్థలకు ముందస్తు చెల్లింపులు చేయలేకపోతున్నారు.ప్రజలు పెట్రోలు, డీజిల్ కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని 60-90 రోజులకు సరిపడా ముడి చమురు నిల్వలు అందుబాటులో ఉన్నాయని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ, చమురు సంస్థలు భరోసానిస్తున్నాయి. రిఫైనరీలు 100 శాతం సామర్థ్యంతో పనిచేస్తున్నాయని స్పష్టం చేశాయి. కేవలం, చిన్న కారణాల వల్ల ఏర్పడిన ఈ అంతరాయం సర్దుబాటు అవుతుందని పేర్కొంటున్నాయి.

# 700 మందికి మెటా లేఆఫ్‌లు..

- వారికి రూ.8,600 కోట్లు..!




**న్యూఢిల్లీ:**కృత్రిమ మేధ రాకతో టెక్ రంగంలోని ఉద్యోగులకు లేఆఫ్‌లు కొనసాగుతున్నాయి. తాజాగా ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా 700 మందిని ఉద్యోగాల్లో నుంచి తొలగించింది అయితే, ఈ లేఆఫ్‌లకు కొన్ని గంటల ముందే టాప్ ఎగ్జిక్యూటివ్‌లకు కంపెనీ కొత్త స్టాక్ ఆప్షన్లు ప్రకటించడం చర్చనీయాంశమైంది.రియాల్టీ ల్యాబ్స్, సేల్స్, రిక్రూటింగ్, ఫేస్‌బుక్ విభాగాల నుంచి 700 మందికి పైగా ఉద్యోగులకు మెటా (ఓవబిజీ) ఉద్వాసన పలికింది. ఈ మేరకు కంపెనీ విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ న్యూయార్క్ టైమ్స్ కథనం వెల్లడించింది. రియాల్టీ ల్యాబ్స్ డివిజన్‌లో కంపెనీ లేఆఫ్‌లు ప్రకటించడం ఈ ఏడాదిలో ఇది రెండోసారి కావడం గమనార్హం. ఈ ఏడాది జనవరిలో ఈ విభాగం నుంచి 1000 మందిని మెటా తొలగించింది.ఏఐలో పెట్టుబడులు పెంచుతోన్న నేపథ్యంలో ఉద్యోగుల సంఖ్యలో కోత పెట్టాలని మెటా భావిస్తోంది. ఇందులోభాగంగా ఈ ఏడాది దాదాపు 16 వేల మందికి లేఆఫ్‌లు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. ఇందులోభాగంగానే తాజాగా తొలగింపులు చేపట్టినట్లు సమాచారం. అయితే, లేఆఫ్‌లు ఎదుర్కొన్నవారిలో కొందరికి కంపెనీలోనే ఇతర విభాగాల్లో ఆఫర్ చేసినట్లు తెలుస్తోంది.ఓవైపు, సిబ్బంది సంఖ్యను తగ్గించుకుంటోన్న మెటా.. టాప్ ఎగ్జిక్యూటివ్‌లకు కొత్త ప్రోత్సాహకాలు కల్పిస్తోంది. లేఆఫ్‌ల ప్రకటనకు ఒకరోజు ముందే తమ కీలక ఎగ్జిక్యూటివ్‌లకు కొత్త స్టాక్ ఆప్షన్ ప్రోగ్రామ్‌ను ప్రకటించింది. ఈ స్కీమ్‌తో కొంతమంది సీనియర్ ఉద్యోగులకు వచ్చే ఐదేళ్లలో వేతన పరిహారం దాదాపు 921 మిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో దాదాపు రూ.8,600 కోట్లు) మేర పెరగనుంది. ఏఐ శకంలో అత్యున్నత నైపుణ్యాలు కలిగిన ఉద్యోగులు సంస్థను వీడకుండా ఉండేందుకు ఈ ప్రోత్సాహకాలు ప్రకటించినట్లు మెటా వర్గాలు వెల్లడించాయి.

మెటా, యూట్యూబ్‌కు జరిమానా

ఇదిలాఉండగా, సోషల్ మీడియా అడిక్షన్ కేసులో మెటా, యూట్యూబ్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఈ ప్లాట్‌ఫామ్‌ల డిజైన్ కారణంగా ఓ యువతి సామాజిక మాధ్యమాలకు బానిసైందని, దానివల్ల ఆమె మానసిక ఆరోగ్యం దెబ్బతిందన్న ఆరోపణలపై నమోదైన కేసులో కాలిఫోర్నియా కేసు తాజాగా తీర్పునిచ్చింది. ఈ కేసులో మెటా, యూట్యూబ్ నిర్లక్ష్యంగా వ్యవహరించాయని కోర్టు నిర్ధరించింది. ఇందుకుగానూ 6 మిలియన్ డాలర్లు జరిమానా విధించింది. ఇందులో 70శాతం మెటా, 30 శాతం యూట్యూబ్ చెల్లించాలని ఆదేశించింది.

# బైబ్యాక్‌లో ఆర్జించిన మూలధన లాభాలపై 12% సర్‌ఛార్జి

**ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి**

న్యూఢిల్లీ: కంపెనీల బైబ్యాక్ ప్రక్రియలో షేర్లను విక్రయించడం ద్వారా ఆర్జించిన మూలధన లాభాలపై ఏకరీతిన 12 శాతం సర్‌ఛార్జీని విధించనున్నారు. ఏప్రిల్ 1 నుంచి ఇది అమల్లోకి రానున్నట్లు బుధవారం లోక్‌సభ ఆమోదం తెలిపిన ఆర్థిక బిల్లు సవరణల ప్రకారం తెలుస్తోంది. ఆర్థిక బిల్లు 2026లో మొత్తం 32 సవరణలను ప్రభుత్వం చేయగా.. వీటికి లోక్‌సభ ఆమోదం తెలిపింది. రాజ్యసభ ఈ సవరణలపై నిర్ణయం తీసుకుంటుంది. ప్రస్తుతం బైబ్యాక్ ప్రక్రియలో రూ.50 లక్షల వరకు పన్ను వర్తించే ఆదాయంపై ఎలాంటి సర్‌ఛార్జి లేదు. రూ.50 లక్షల నుంచి రూ.1 కోటి వరకు ఆదాయానికి 10 శాతం సర్‌ఛార్జీని విధిస్తున్నారు. ఇప్పుడు అందరికీ ఏకరీతిన 12 శాతం సర్‌ఛార్జి విధించడం వల్ల.. వీళ్లందరికీ పన్ను వ్యయ భారం పెరుగుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బైబ్యాక్ ప్రక్రియ వ్యయభరితంగా ఉందని భావించి.. ఇక మీదట ఇందులో పాల్గొనాలంటే పెద్దగా వాళ్లు ఆసక్తి కనబర్చకపోయే అవకాశమూ ఉందని అంటున్నారు. మరోవైపు బైబ్యాక్ ప్రక్రియ ద్వారా రూ.కోటికి మించి లాభాలు ఆర్జించే వాళ్లకు తాజా సవరణతో ప్రయోజనం కలగనుంది. ప్రస్తుతం ఈ ఆదాయ విభాగానికి సర్‌ఛార్జి 15 శాతంగా ఉండగా.. ఏప్రిల్ 1 నుంచి ఇది 3 శాతం మేర తగ్గనుండటమే ఇందుకు కారణం.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.15 | ₹ 5.17 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| ₹ 1,34,450 | ₹ 1,46,890 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,60,000



# యుద్ధంతో ప్రపంచ ఆహార భద్రతకు పెనుముప్పు

## ప్రపంచ వాణిజ్య సంస్థ హెచ్చరిక



**న్యూఢిల్లీ:**
ఇరాన్ యుద్ధం వల్ల ప్రపంచ దేశాలు ఇప్పటికే చమురు సరఫరా సమస్యలను ఎదుర్కొంటున్నాయి. మరోవైపు హర్మూజ్‌ను మూసివేయడంతో చమురు, గ్యాస్‌తో పాటు ఎరువుల రవాణాకూ ఆటంకం ఏర్పడుతోందని ప్రపంచ వాణిజ్య సంస్థ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ జేన్ మేరీ పౌగమ్ పేర్కొన్నారు. యూరియా సరఫరాకు అంతరాయాలు ఏర్పడుతుండడంతో.. ఎరువుల కొరత, అధిక ధరల రూపంలో ప్రపంచ ఆహార భద్రతకు ముప్పు కలిగే అవకాశముందని హెచ్చరించారు. ఐక్యరాజ్యసమితి వాణిజ్య, అభివృద్ధి విభాగం వెల్లడించిన వివరాల ప్రకారం.. ప్రపంచంలోని మూడింట ఒక వంతు ఎరువులు గల్ఫ్ దేశాల నుంచి హర్మూజ్ జలసంధి మీదుగానే రవాణా అవుతాయి. దీని మూసివేత కొనసాగితే.. యూరియా దిగుమతి చేసుకునే వ్యవసాయ ఆధారిత దేశాల్లో నిల్వలు తగ్గిపోయే ప్రమాదం ఉంది.యుద్ధం మొదలై కొన్ని వారాలు మాత్రమే అవుతున్నందున ప్రస్తుతం ఎరువుల కొరత అంతగా లేనప్పటికీ ఈ ప్రభావం వచ్చే ఏడాది పంటలపై పడనుంది. అలా అని ప్రపంచ దేశాలు ఎరువులు, ఆహార ధాన్యాల నిల్వలు పెంచుకోవడం ప్రారంభిస్తే అంతర్జాతీయ వాణిజ్యానికి అంతరాయం కలుగుతుంది. దీనివల్ల ఆహారాన్ని దిగుమతి చేసుకునే పేద దేశాలు దయనీయ పరిస్థితులను ఎదు ర్కొనే ప్రమాదం ఉంది. మరోవైపు యూ రియా ఉత్పత్తికి అవసరమైన ద్రవరూప సహజ వాయువు ఎల్ఎన్‌జీని భారత్ కొన్నేళ్లుగా ఖతార్ నుంచి దిగుమతి చేసుకుంటోంది. ప్రస్తుతం ఆ దేశం నుంచి ఎల్ఎన్‌జీ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రధాన ఆహార ఎగుమతిదారులైన భారత్, థాయ్ లాండ్, బ్రెజిల్ వంటి దేశాలలోని కొన్ని యూరియా కంపెనీలు ప్లాంట్లను మూసివేసే పరిస్థితు లు నెలకొన్నాయి. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ప్రపంచ మార్కెట్‌లో యూరి యా ధరలు సుమారు 25 శాతం పెరిగాయి. సరఫరా కొరత కారణంగా ఇతర ఎరువుల ధరలు కూడా క్రమంగా పెరుగుతున్నాయి. ఎరువులను ఎక్కువగా వినియోగిం చుకునే మార్కెట్లలో భారత్, బ్రె జిల్ వంటి దేశాలు ఉన్నాయి. దీంతో ఆయా దేశాలపై అధిక ప్రభావం పడే అవకాశం ఉంది. అమె రికా కూడా యూరియాకు అతిపెద్ద మార్కెట్‌గా ఉన్నప్పటికీ నత్రజనిలో సగానికి పైగా దేశీయంగానే ఉత్పత్తి చేసుకుంటుండడం వల్ల ఆ దేశంపై ఎక్కువ ప్రభావం ఉండదు. ప్రపంచ మార్కెట్లో కొరత కారణం గా ఎరువుల ధరలు పెరగడంతో రైతుల ఉత్పత్తి ఖర్చులు పెరగనున్నా యి. చమురు ధరల పెరు గుదల వల్ల రైతుల రవాణా ఖర్చులపై కూడా ప్రభావం పడుతుంది. ప్రపంచ దేశాల్లో ఆహార ధాన్యాలు, వ్యవసాయ ఉత్పత్తుల ధరలు కూడా పెరగనున్నాయి. ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా ఆహార ధరలు సుమారు 2శాతం పెరిగే అవకాశం ఉంది.

# అంతరిక్ష రంగంలో కీలకముందడుగు

## స్వీయ మరమ్మతులు చేసుకునే దిశగా వ్యోమనౌకలు



రోదసిలోకి వెళ్లే వ్యోమనౌకలు చాలా ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తుంటాయి. భూమి నుంచి బయల్దేరాక ఏ చిన్న తేడా వచ్చినా పెను ప్రమాదం తప్పదు. ఆకృతిలో సూక్ష్మ పగుళ్లు కూడా తీవ్ర విపత్తుకు దారితీయవచ్చు. ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టేలా ఐరోపా శాస్త్రవేత్తలు నూతన ఆవిష్కారం చేశారు. ఆకృతి దెబ్బతినడం, పగుళ్లు ఏర్పడటం వంటి సమస్యలను సొంతంగా గుర్తించి, మరమ్మతులు చేసుకునే కాంపోజిట్ పరిజ్ఞానాన్ని రూపొందించారు. దీనివల్ల సుదూర యాత్రలు చేసే వ్యోమనౌకలు, పునర్వినియోగ వాహక నౌకలు మరింత పటిష్ఠంగా తయారవుతాయి. వ్యోమనౌకల ఆకృతుల నిర్మాణంలో కార్బన్ ఫైబర్ రీఇన్‌ఫోర్స్‌డ్ పాలీమర్లు వంటి మిశ్రమ పదార్థాలను విరివిగా ఉపయోగిస్తున్నారు. ఇవి తేలిగ్గా, దృఢంగా ఉంటాయి. వాటిలో పాలిమర్ మ్యాట్రిక్స్ ఉంటుంది. కార్బన్ లేదా గాజు ఫైబర్ల పొరల జోడింపుతో అవి మరింత పటిష్ఠంగా తయారవుతాయి. కాలక్రమంలో ఈ కాంపోజిట్ పదార్థాలు దెబ్బతింటుంటాయి. ముఖ్యంగా.. పదేపదే రోదసిలోకి వెళ్లిరావడం వల్ల వాటిపై పెను ప్రభావం పడుతుంది. ప్రయోగ సమయంలో ఉత్పన్నమయ్యే ప్రకంపనలు, మార్గమధ్యంలో అసాధారణ ఉష్ణోగ్రతల వల్ల వ్యోమనౌక ఆకృతిపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ క్రమంలో సూక్ష్మస్థాయి పగుళ్లు ఏర్పడుతుంటాయి. అవి కొంతకాలానికి తీవ్రమవుతుంటాయి. వాటికి మరమ్మతులు చేయడం వ్యయప్రయాసలమయం. చాలా సమయం కూడా పడుతుంది. పైగా ఈ మరమ్మతుల ప్రక్రియ వల్ల ఆ ఆకృతి బలహీనపడొచ్చు. ప్రయోగ సమయంలో ఉష్ణకవచంలో పగుళ్లు ఏర్పడి అమెరికాకు చెందిన కొలంబియా వ్యోమనౌక.. 2003 ఫిబ్రవరి 1న తిరుగు ప్రయాణంలో విచ్ఛిన్నమైపోయింది. అందులో భారత సంతతి వ్యోమగామి కల్పనా చావ్లా సహా ఏడుగురు వ్యోమగాములు దుర్మరణం పాలయ్యారు.

**స్వీయ మరమ్మతు కోసం..**

ఈ నేపథ్యంలో వ్యోమనౌకల కోసం స్వీయ మరమ్మతు పదార్థాల తయారీకి శాస్త్రవేత్తలు చాలా సంవత్సరాలుగా పరిశోధనలు చేస్తున్నారు. ప్రయోగానంతరం రాకెట్ ఆకృతికి కలిగే నష్టం, ఏర్పడే పగుళ్లను గుర్తించి, తనంతటతానే రిపేర్ చేసుకునేలా వాటిని రూపొందించాలన్నది వారి లక్ష్యం. ఈ దిశగా ఐరోపా అంతరిక్ష సంస్థ (ఈఎస్ఏ).. స్విస్ కంపెనీలు కాంప్ పెయిర్, సీఎస్ఈఎం, బెల్జియంకు చెందిన కామ్ అండ్ సెన్స్‌లు ప్రాజెక్టును చేపట్టాయి. దీనికి కసాండ్రా (కాంపోజిట్ అటానమస్ సెన్సింగ్ అండ్ రిపేర్) అని పేరు పెట్టారు. అంతరిక్ష రవాణా రంగంలో నూతన ఆవిష్కరణలకు వీలు కల్పించేందుకు ఈఎస్ఏ చేపట్టిన ఫ్యూచర్ ఇన్నోవేషన్ రీసెర్చ్ ఇన్ స్పేస్ ట్రాన్స్‌పోర్టేషన్ (ఫస్ట్) అనే కార్యక్రమంలో ఇది భాగం.

**ఏమిటీ టెక్నాలజీ?**

కాంప్ పెయిర్ సంస్థ ‘హీల్‌టెక్’ అనే మిశ్రమ పదార్థాన్ని తయారుచేసింది. అందులో సెన్సర్లు, త్రీడీ ముద్రిత అల్యూమినియం గ్రిడ్లు, కాంపోజిట్ కార్బన్ ఫైబర్ పదార్థాన్ని వేడిచేసే వ్యవస్థ ఉంటాయి. ఈ మిశ్రమ పదార్థ పొరల మధ్య ఉండే ఫైబర్ ఆప్టిక్ సెన్సర్లు వ్యోమనౌక ఆకృతిని నిరంతరం పర్యవేక్షిస్తుంటాయి. పగుళ్లు, ఆకృతిలో లోపాలు ఏర్పడితే అత్యంత కచ్చితత్వంతో గుర్తిస్తాయి. ఆ వెంటనే.. అల్యూమినియం గ్రిడ్‌ల మధ్య ఉండే హీటింగ్ వ్యవస్థ క్రియాశీలమవుతుంది. ప్రభావిత ప్రాంతాన్ని 100 నుంచి 140 డిగ్రీల సెల్సియస్ మేర అది వేడెక్కిస్తుంది. ఫలితంగా మరమ్మతు ప్రక్రియ పనిచేయడం ప్రారంభిస్తుంది. ఈ మరమ్మతు వ్యవస్థకు సంబంధించిన ప్రొటోటైప్‌ను శాస్త్రవేత్తలు రూపొందించి, పరీక్షించారు. దెబ్బతిన్న ప్రదేశాన్ని పర్యవేక్షించడంలో, వేడెక్కించడంలో, స్వీయ మరమ్మతుల సామర్థ్యంలో ఆ పదార్థ సత్తా రుజువైంది.

**బోలెడు ప్రయోజనాలు**

స్వీయ మరమ్మతుల పరిజ్ఞానం వల్ల వ్యోమనౌకల జీవితకాలం పెరుగుతుంది. పదేపదే ఉపయోగించేందుకు వీలున్న వాహక నౌకలకు ఇది అనువైంది. అంతరిక్ష ప్రయోగాల కారణంగా వెలువడే వ్యర్థాలు తగ్గుతాయి. రోదసియానాలు పెరుగుతాయి. అంతరిక్ష ప్రయోగాల ఖర్చు దిగి వస్తుంది. అనూహ్య ప్రమాదాలకు ఆస్కారం తగ్గుతుంది.

# నేపాల్ ప్రధానిగా బాలెన్


**ప్రమాణ స్వీకారానికి అంతా సిద్ధం**

ఖాట్మండు(జనంసాక్షి):అతి చిన్న వయసులో నేపాల్ ప్రధానమంత్రిగా ఎన్నికైన నేతగా 35 ఏళ్ల బాలేంద్ర షా (బాలెన్) రికార్డును సొంతం చేసుకున్నారు. గురువారం రోజు రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ పార్లమెంటరీ పార్టీ నేతగా ఆయన ఎన్నికయ్యారు. శుక్రవారం రోజు నేపాల్ ప్రధాన మంత్రిగా ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మార్చి 5న జరిగిన నేపాల్ ఎన్నికల్లో రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ ఘన విజయం సాధించింది.



# ఇరాన్ నుంచి చమురు కొనుగోళ్లు.. ఖండించిన రిలయన్స్

దిల్లీ: ఇరాన్ చమురుపై ఆంక్షలు తొలగిన ఆ దేశం నుంచి రిలయన్స్ ఇండస్ట్రీస్ చమురు కొనుగోలు చేసిందన్న వార్తలను ఆ సంస్థ ఖండించింది. సుమారు 5 మిలియన్ బ్యారెళ్ల చమురును కొనుగోలు చేసినట్లు మీడియాలో వచ్చిన కథనాలపై ఆ సంస్థ స్పందించింది. “ఇరాన్ ముడి చమురును కొనుగోలు చేసినట్లు మీడియాలో వచ్చిన కథనాలను ఖండిస్తున్నాం. అవి పూర్తి నిరాధారమైనవి. తప్పుదోవ పట్టించే విధంగా ఉన్నాయి. సంబంధిత మీడియా సంస్థలు ప్రచురణకు ముందు వాస్తవాలను సరిచూసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం” అంటూ రిలయన్స్ ఇండస్ట్రీస్ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. పశ్చిమాసియా సంక్షోభం ఫలితంగా




అంతర్జాతీయంగా ముడిచమురు బ్యారెల్ ధర 100 డాలర్లు దాటిన నేపథ్యంలో ఇరాన్ చమురు కొనుగోలు చేసుకోవచ్చని అమెరికా ప్రకటించింది. ఆంక్షలు ఎత్తివేసిన నేపథ్యంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ 5 మిలియన్ బ్యారెళ్ల ఇరాన్ చమురును నేషనల్ ఇరానియన్ ఆయిల్ కో (ఎన్ఐఓసీ) నుంచి కొనుగోలు చేసినట్లు వార్తలు వచ్చాయి. ధర కూడా బ్యారెల్ బ్రెంట్ ముడిచమురుపై 7 డాలర్లు అదనంగా చెల్లించిందంటూ సదరు కథనాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో ఆ వార్తలు అవాస్తవమంటూ రిలయన్స్ ఖండించింది.

# నేడు సైబరాబాద్ క్లీన్ స్వీప్ ప్రత్యేక డ్రైవ్

**సిఎంసి కమిషనర్ సృజన**



**శేరిలింగంపల్లి, మార్చి 27 (జనంసాక్షి) :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నేడు ఓ చారిత్రాత్మక భారీ కార్యక్రమానికి నాంది పడనుంది. పటాన్ చెరువు నుండి మణికొండ వరకు దాదాపు 22 కిలోమీటర్లమేర 'సైబరాబాద్ క్లీన్ స్వీప్' పేరున స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టి ఒకేసారి ప్రధాన రహదారులన్నీ శుభ్రం చేసి ఓ చారిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టం ఉన్నట్లు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన మీడియాకు తెలియజేశారు. ఈ మేరకు గురువారం శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడే నేతృత్వంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి సీఎం సి కమిషనర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జోనల్ కార్యాలయం ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంజనీరింగ్ భాగంలో కొనసాగుతున్న పనులు, అర్బన్ బయోడైవర్సిటీ(యుబిడి) విభాగం చేపడుతున్న కార్యక్రమాలపై సిఎంసి కమిషనర్ సృజన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో హెచ్ సిటి పనుల పురోగతి, భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణ, సిసి, బిటి రోడ్ల నిర్మాణం, నిర్వహణ, చిన్న తరహా మరమ్మతులు, వర్షపు నీటి కాలువల నిర్మాణం, నాళాల పూడికతీత, ఫుటోవర్ బ్రిడ్జి ల నిర్మాణం, నిర్వహణ, ఖాళీ ప్రదేశాలకు కాంపౌండ్ వాల్ నిర్మాణం, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన కూడళ్ల అభివృద్ధి తదితర అంశాలపై సిఎంసి కమిషనర్ సమగ్ర చర్చను కొనసాగించారు. అనంతరం సైబరాబాద్ క్లీన్ స్వీప్ మహా పారిశుధ్య కార్యక్రమం పై అధికారులతో చర్చించి పటాన్చెరువు నుండి మణికొండ వరకు 22 కిలోమీటర్ల దూరాన్ని ఏకతాటిగా శుభ్రం చేసి స్వీపింగ్ తోపాటు భవన నిర్మాణ వ్యర్థాలు, ఇతర చెత్తాచెదారం, ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉండిపోయిన మట్టి, ఇతర వ్యర్థాలను పూర్తిగా తొలగించి సి అండ్ డి వాహనాల ద్వారా తొలగించడానికి జరిగిన ఏర్పాట్లను సిఎంసి కమిషనర్ శేరిలింగంపల్లి జడ్సీతో సమీక్షించారు. ఉదయం ఆరు గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం నిరాటంకంగా కొనసాగి సాయంత్రం 6 గంటల వరకు పూర్తి అవుతుందని, నగరంలో ఒకేసారి 22 కిలోమీటర్ల మేర పారిశుద్ధ్య పనులను చేపట్టిన దాఖలాలు గతంలో లేవని, ఇది ఒక విప్లవాత్మక, చారిత్రాత్మక అడుగుగా మారి భవిష్యత్ కార్యక్రమాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని సిఎంసి కమిషనర్ అభిప్రాయపడ్డారు.

# శేరిలింగంపల్లిలో అసంపూర్తి పనులను పూర్తి చేయండి

**అసెంబ్లీలో పిఎసి చైర్మన్ అరికపూడి**



**శేరిలింగంపల్లి, మార్చి 27 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో అసంపూర్తిగా మిగిలిపోయిన లింక్ రోడ్ల ను తక్షణమే పూర్తి చేయాలని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ కోరారు. గురువారం రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల కార్యక్రమంలో భాగంగా స్పీకర్ కు విన్నవిస్తూ శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని హైటెక్ సిటీ గౌసియా కేఫ్ నుండి కొత్తగూడా హర్ష టయోట వరకు 100 ఫీట్ల రోడ్డు, అపర్ణ హిల్ పార్క్ నుండి గంగారాం హనుమాన్ దేవాలయం వద్ద జాతీయ రహదారికి కలిపే లింక్ రోడ్డు, నల్లగండ్ల రత్నదీప్ సూపర్ మార్కెట్ నుండి శేరిలింగంపల్లి జోనల్ ఆఫీస్ వరకు కలిపే లింక్ రోడ్డు, ముంబాయి జాతీయ రహదారిని ఆనుకొని మై హోమ్ జ్యువెల్ నుండి వయా రైల్వే ట్రాక్ మీదుగా జోనల్ కార్యాలయానికి కలిపే ఫ్లై ఓవర్ మరియు లింక్ లింక్ రోడ్డు పనులను ప్రథమ ప్రాధాన్యతగా గుర్తించి వెంటనే పూర్తి చేయాలని, ఎందుకు సంబంధిత మంత్రులను ఆదేశించాలని అరికపూడి విజ్ఞప్తి చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధిక ప్రజానీకం నివసిస్తున్న ప్రాంత మని, ఆసియా ఖండంలోనే అధిక జనసాంద్రతతో ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొంటున్న ముంబై జాతీయ రహదారి ఉందని స్పీకర్ కు వివరించారు. గతంలో నాలుగు ఐదు లింక్ రోడ్లు మంజూరై సగం పనులు పూర్తి కావడం జరిగిందని, అయితే అదనంగా కొత్త లింక్ రోడ్ల ఆవశ్యకతలో భాగంగా అపర్ణా హిల్ పార్క్ నుండి గంగారాం చెరువు వద్ద హనుమాన్ దేవాలయం వద్ద జాతీయ రహదారికి కలిపే లింక్ రోడ్డు పనులు, నల్లగండ్ల రత్న దీప్ సూపర్ మార్కెట్ నుండి శేరిలింగంపల్లి జోనల్ ఆఫీస్ వరకు కలిపే లింక్ రోడ్డు పనుల విషయంలో మెరుగైన అధికారులను కేటాయించి ప్రథమ ప్రాధాన్యతగా చేపట్టి పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మిగిలిపోయిన లింక్ రోడ్లనుసైతం త్వరితగతిన పూర్తిచేసి ట్రాఫిక్ రద్దీని తగ్గించాలని, మెరుగైన రవాణా సదుపాయాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి సైతం తాను తీసుకువెళ్ళనున్నట్లు తెలియజేశారు.

# వరల్డ్ లార్జెస్ట్ పార్టీ బిజెపి.. తిరుగులేని శక్తిగా బిజెపి

- గల్లీ నుండి ఢిల్లీ వరకు దేశవ్యాప్తంగా బిజెపి విస్తరించింది
- కరీంనగర్ గడ్డపై కాషాయ జెండా ఎగరవేశాం... గోల్కొండ కోటపై కాషాయ జెండా ఎగరవేస్తాం
- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



**కరీంనగర్ బ్యూరో, మార్చి 26 (జనంసాక్షి):**
నేషన్ ఫస్ట్, పార్టీ నెక్స్ట్, సెల్ఫ్ లాస్ట్ సిద్ధాంతంతో, ప్రపంచంలోనే అత్యధిక కార్యకర్తలు కలిగిన పార్టీగా, వరల్డ్ లార్జెస్ట్ పార్టీగా, తిరుగులేని శక్తిగా భారతీయ జనతా పార్టీ అవతరించిందని జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ 24వ డివిజన్ కార్పొరేటర్ ఒంటెల సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం రోజున డివిజన్లోని గుండి హనుమాన్ వద్ద నూతనంగా నిర్మించిన బిజెపి జెండా గద్దె, పార్టీ జెండా ఆవిష్కరణ సందర్భంగా గంగా డి కృష్ణారెడ్డి పై వ్యాఖ్యలు చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా ప్రపదమంగా డివిజన్లో కాషాయ జెండా ఎగిరిందని, కార్పొరేటర్గా సత్యనారాయణ రెడ్డి ఘన విజయం సాధించి, డివిజన్లో పార్టీ జెండా గద్దెను ఏర్పాటు చేయడం సంతోషకరంగా ఉందన్నారు. నేడు బీజేపీ గల్లీ నుండి ఢిల్లీ వరకు దేశవ్యాప్తంగా విస్తరించిందన్నారు. బిజెపి మోది సర్కార్ పాలనతోనే నేడు దేశం సుభిక్షంగా ఉందన్నారు. ప్రపంచంలోని అనేక దేశాలు, అగ్రరాజ్యాలు యుద్ధాలతో కొట్టుమిట్టాడుతుంటే, మోదీ ప్రభుత్వం సుస్థిర పాలన కొనసాగిస్తుందన్నారు. ప్రపంచంలోని అనేక దేశాలకు నేడు మోడీ ప్రభుత్వ పాలన విధానం దిక్సూచిగా మారిందని, భారతదేశం నేడు విశ్వ గురువు స్థాయికి చేరుకుందన్నారు. దేశ భవిష్యత్తు కోసం, ప్రజల సంక్షేమం, అభివృద్ధి, భద్రత కోసం బిజెపి నిరంతరం ఆలోచిస్తుందన్నారు. కానీ దేశంలోని అనేక పార్టీలు మాత్రం బిజెపి విధానాలకు భిన్నంగా ఉంటాయని, ఆయా పార్టీ లు, మనం బాగుంటే చాలు, మన కుటుంబం బాగుంటే చాలు అనుకునే స్వార్థం తో నేటికీ రాజకీయాలు చేస్తున్నాయని ఘాటుగా విమర్శించారు. భవిష్యత్తు అంతా బిజెపి దేనని, కరీంనగర్ గడ్డపై కాషాయ జెండా ఎగరవేసినట్టే, గోల్కొండ కోటపై కాషాయ జెండా ఎగరవేసి తీరుతామని ఆయన ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో రాబోయేది బిజెపి ప్రభుత్వమేనన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీమేయర్ వై. సునీల్ రావు, వెస్ట్ జోన్ అధ్యక్షులు జాడి బాల్ రెడ్డి, అధికార ప్రతినిధి ఊగేల సుధాకర్ పటేల్, నాయకులు గుజ్జ శ్రీనివాస్, డివిజన్ వాసులు అట్ల జగన్ రెడ్డి, కుటాడి శ్రీనివాస్, విష్ణు వర్ధన్, ప్రశాంత్, స్వామి, ఆంజనేయులు, గంగసాని మునీన్దర్, దాసరి రాజి రెడ్డి తదితరుల పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు 'డిఫెన్సివ్ డ్రైవింగ్' అత్యవసరం

**డీఎస్పీ నర్సింగ్ యాదయ్య**



**తాండూరు మార్చి 26(జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర డిజిపి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "అలైవ్ – అరైవ్" కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ యంత్రాంగం రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా,ఆదేశాల మేరకు తాండూర్ డీఎస్పీ నర్సింగ్ యాదయ్య ఆధ్వర్యంలో గురువారం థీమ్ అయిన "డిఫెన్సివ్ డ్రైవింగ్ అవేర్నెస్" (రక్షణాత్మక డ్రైవింగ్) పై సబ్ డివిజన్ వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో విద్యార్థులు, వాహనదారులు మరియు డ్రైవర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పోలీసు అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ల ద్వారా ప్రమాదాలు జరిగే తీరును, వాటిని నివారించే పద్ధతులను దృశ్యరూపంలో వివరించారు. ఈ సందర్భంగా తాండూర్ డీఎస్పీ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ బాధ్యతాయు తమైన పౌరులుగా వ్యవహరించి, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారానే "అలైవ్ – అరైవ్" లక్ష్యం నెరవేరుతుందన్నారు. రోడ్డుపై వాహనం నడిపేటప్పుడు కేవలం మన జాగ్రత్త మాత్రమే కాకుండా, ఎదుటివారు చేసే పొరపాట్లను ముందే ఊహించి ప్రమాదం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించడమే 'డిఫెన్సివ్ డ్రైవింగ్' అని పేర్కొన్నారు. వేగ పరిమితిని పాటించడం, సీట్ బెల్ట్ మరియు హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ సిగ్నల్స్ గౌరవించడం ప్రాథమిక బాధ్యతలని గుర్తుచేశారు. ముఖ్యంగా మలుపుల వద్ద, వర్షం పడే సమయంలో మరియు రాత్రి వేళల్లో వాహనంపై పూర్తి నియంత్రణ కలిగి ఉండాలని సూచించారు. యువత మరియు విద్యార్థులు ఉత్సాహంతో అతివేగంగా వాహనాలు నడిపి తమ ప్రాణాలను, ఇతరుల ప్రాణాలను ప్రమాదంలో పడేయవద్దని డీఎస్పీ తెలిపారు.

# కీ హోల్ హార్ట్ సర్జరీ విజయవంతం

- యశోద ఆసుపత్రి యాజమాన్యం విలేఖరుల సమావేశంలో వెల్లడి



**నిజామాబాద్ మార్చి 26 (జనంసాక్షి):**
గత రెండు మూడు సంవత్సరాలు గా ఆయాసం,పని చేసేటప్పుడు అలసట వంటి రోగంతో వచ్చిన 80 ఏళ్ల వయసున్న అనీస్ ఫాతిమా, ఆయాసం, శ్రమ చేసినప్పుడు అలసట వంటి ఫిర్యాదులతో సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి వచ్చారని, ఆమెకు తీవ్రమైన ఏయోర్టిక్ స్టెనోసిస్ (ఏయోర్టిక్ వాల్వ్ బ్లాకేజ్) ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఆమెకు శస్త్రచికిత్స చేయించుకోవాలంటే భయం, అందుకే ఈ సమస్యలతో సతమతమయ్యారు. అప్పుడు డాక్టర్ విశాల్ ఖంటే, డాక్టర్ మోహమ్మద్ వహాజ్ అలీ ఆమెకు మినిమల్లీ ఇన్వాసివ్ కార్డియాక్ సర్జరీ (MICS / కీ–హోల్ హార్ట్ సర్జరీ) చేయించుకోమని సలహా ఇచ్చారు. రోగికి బోన్ గ్రాఫ్టింగ్ లేకుండా కీ–హోల్ హార్ట్ సర్జరీ (MICS-AVR) చేయడం జరిగింది. ఇది ఒక కొత్త సాంకేతికత,దీనిలో కోలుకోవడం వేగంగా ఉంటుంది. శస్త్రచికిత్స జరిగిన 4 రోజుల తర్వాత ఆమెను డిశ్చార్జ్ చేశారు. శస్త్రచికిత్స జరిగిన ఒక నెల తర్వాత, ఆపరేషన్ చేసిన చోట కొద్దిగా నొప్పి తప్ప ఆమెకు ఇతర లక్షణాలు ఏవీ లేవు, ఆమె తన రోజువారీ కార్యకలాపాలను చేసుకోగలుగుతున్నారు. ఇది ఒక అరుదైన శస్త్ర చికిత్స అని డాక్టర్ లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రీరామ్ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## టీ-గ్రిల్ జంక్షన్ వద్ద మద్యం
# మత్తులో డ్రైవింగ్

**ఒకరి మృతి, నిందితుడు రిమాండ్**

**రాజేంద్రనగర్, మార్చి 26 (జనంసాక్షి)**
మద్యం సేవించి వాహనంతో ఢీ కొట్టి ఓ వ్యక్తి మృతికి కారణం ఆయన నిందితున్ని నార్సింగ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. ఇన్స్పెక్టర్ హరికృష్ణరెడ్డి ప్రకారం నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని పుప్పాల గూడ గ్రామం టీ–గ్రిల్ జంక్షన్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో భద్ర (26) అనే వ్యక్తి మృతి చెందాడు. వాటర్ ట్యాంకర్ను మడిగెల శ్రీనివాస్ (37) మద్యం సేవించి అతివేగంగా నడిపిస్తూ రోడ్డుపక్కన నిలబడి ఉన్న భద్రను ఢీకొట్టాడు. తీవ్ర గాయాల కారణంగా అతడు సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. సంఘటన అనంతరం పోలీసులు నిందితుడికి బ్రెత్ అనలైజర్ పరీక్ష నిర్వహించగా 106 ఎంజి మద్యం స్థాయి ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు 15 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. వాహనం, డ్రైవింగ్ లైసెన్స్ను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు**
**ఇన్స్పెక్టర్ హరికృష్ణ రెడ్డి**

మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, అతివేగం, నిర్లక్ష్యంగా వాహనం నడపడం ప్రాణాంతకమని నార్సింగ్ ఇన్స్పెక్టర్ హరికృష్ణ రెడ్డి హెచ్చరించారు. ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్, సీట్బెల్ట్ వినియోగించాలని, వేగ పరిమితులను పాటించాలని తెలిపారు. నియమాలు ఉల్లంఘించే వారిపై ప్రత్యేక డ్రైవ్స్ నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్స్పెక్టర్ తెలిపారు.

# తైబజార్ వేలం 12లక్షల ఒక వెయ్యి రూపాయలు

**మళ్లీ కైవాసం చేసుకున్న వెంకట్ రాములు**
**ఘనంగా సన్మానించిన సర్పంచ్, వార్డు సభ్యులు**

**కుల్కచర్ల (జనం సాక్షి) :** కుల్కచర్ల మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రామ సర్పంచ్ వార్వళ్ళ అంజిలయ్య, పంచాయతీ కార్యదర్శి భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో తైబజర్ వేలంపాట నిర్వహించారు .చివరి వరకు నువ్వ –నేనా స్థాయిలో వేలం రసవత్తరంగా కొనసాగింది. చివరికి మళ్లీ గ్రామానికి చెందిన పర్సాపురం వెంకట్రాములు 12లక్షల ఒక వెయ్యి రూపాయలకు వేలం పాట పాడి తైబజర్ను దక్కించుకున్నారు. పలువురు అతన్ని అభినందించరు. అనంతరం సర్పంచ్, వార్డు సభ్యులు వెంకట్ రాములును ఘనంగా సన్మానం చేశారు. వేలం పాట డబ్బులను గ్రామ పంచాయతీ నిబంధనాలకు లోబడి చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ విజయ్ కుమార్,బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు గాదె మహిపాల్ ముదిరాజ్, వార్డు సభ్యులు ఉత్తర కుమారి, పుట్ట రాధిక రామ స్వామి, కడుమూరి రాంరెడ్డి,వినోద్ కుమార్, కే. మధు,బాలకృష్ణ, ఐలాగారి కృష్ణయ్య, వెంకటేష్, గ్రామస్తులు ,నీరటి కర్ణయ్య, ఊరడి చంద్రయ్య, నాగని బిచ్చన్న,పిట్ల బాలయ్య, ఏదుల సత్యయ్య, చాకలి కృష్ణయ్య, జెట్టిగాళ్ల వెంకటయ్య, రాజు, నర్సిములు, తదితరులు పాల్గొన్నారు.

# భార్య బలవన్మరణానికి కారణమైన భర్తకు ఏడేళ్ల జైలు శిక్ష

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి) :** అదనపు కట్నం కోసం మానసికంగా, శారీరకంగా హింసించి భార్య ఆత్మహత్యకు కారణమైన ఓ భర్తకు జిల్లా అదనపు న్యాయమూర్తి ఏడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.30 వేల జరిమానాను విధించారు. కేసుకు సంబంధించిన వివరాలను గురువారం ఓ ప్రకటనలో షాద్ నగర్ పోలీసులు తెలియజేశారు. నందిగామ మండల కేంద్రానికి చెందిన స్వాతి అలియాస్ శ్రీజ(20) వివాహం ఫరూఖ్ నగర్ మండలం దూసకల్ గ్రామానికి చెందిన కల్లేపల్లి శ్రీనివాస్ కి ఇచ్చి వివాహం జరిగిన ఆరు నెలలకె భర్త శ్రీనివాస్ తో పాటు, కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధించారు. వారి వేధింపులు భరించలేక స్వాతి జూలై 19వ తేదీ 2020వ సంవత్సరం నాడు ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి బొమ్మగళ్ళ రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసిన అప్పటి దర్యాప్తు అధికారి ఎసిపి సురేందర్, పర్యవేక్షణ అధికారి సీతారాం, శ్రీనివాస్లు కేసుకు సంబంధించిన వివరాలను న్యాయస్థానానికి వెల్లడించారు. కేసు పూర్వ పరాలను పరిశీలించిన జిల్లా అదనపు న్యాయమూర్తి ప్రధాన ముద్దాయిగా ఉన్న కల్లేపల్లి శ్రీనివాస్కు ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 30 వేల జరిమానాను విధిస్తూ గురువారం తీర్పునిచ్చారు.

# సూర్యాపేట జిల్లాకు ధర్మబిక్షం పేరు పెట్టాలి



**సూర్యాపేట, మార్చి 26 (జనంసాక్షి):** తెలంగాణ సాయుధ పోరాట యోధులు, మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు. మాజీ ఎంపీ ధర్మభిక్షం 15వ వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన విగ్రహానికి పట్టణ ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మభిక్షం జీవితం సమాజానికి ఎంతో ఆదర్శమైందన్నారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా, ఎంపీగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసి పేదల కళ్లల్లో వెలుగులు నింపారని గుర్తు చేశారు. ఆనాడు చదువుకునే పేద విద్యార్థుల కోసం ప్రత్యేక హాస్టళ్లను ఏర్పాటు చేశారని తెలిపారు. ఆ హాస్టళ్ళలో చదువుకున్న ఎంతోమంది నేడు ఉన్నత స్థాయిలో ఉన్నారని అన్నారు. నికార్సైన కమ్యూనిస్టు నాయకుడిగా చట్ట సభలనే ఉద్యమ వేదికగా చేసుకొని అనేక సమస్యలకు పరిష్కారం చూపారన్నారు. ప్రజల కోసం పని చేసే నాయకులు ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా ఉంటారని అలాంటి నాయకుడే ధర్మభిక్షం అన్నారు.

సూర్యాపేట జిల్లాకు ఆయన పేరును పెట్టాలని, జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్ బండ్ పై ధర్మబిక్షం విగ్రహాన్ని పెట్టడంతో పాటు గతంలో చెప్పినట్లు సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ధర్మబిక్షం పేరు పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫి ఉల్లా, మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసి జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్ కుమార్, పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, దేగల జనార్ధన్, దంతాల రాంబాబు, చామల అశోక్ కుమార్, రేగటి లింగయ్య, దోరేపల్లి శంకర్, చివ్వెంల మండల కార్యదర్శి ఖమ్మంపాటి రాము, బూర సైదులు, ఎడెల్లి శ్రీకాంత్, పెంద్ర కృష్ణ, దంతాల పద్మ రేఖ, దేశగాని హేమలత, భద్రయ్య, బైరు వెంకన్న, బైరు శైలేందర్, ట్రైసన్ శ్రీను , అయితగాని కామేష్ తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా అర్ధరాత్రి కలప తరలింపు

**వెంటాడి పట్టుకున్న నవాబుపేట్ పోలీసులు .. కేసు నమోదు**



**నవాబుపేట్, మార్చి 26 (జనంసాక్షి):**
అర్ధరాత్రి వేళల్లో అనుమతులు లేకుండా కలప కట్టెలు కొట్టి లారీల్లో నింపి తరలిస్తుండగా నవాబుపేట్ పోలీసులు వెంటాడి పట్టుకున్నారు. బుధవారం రాత్రి నవాబుపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ సంఘటన చోటుచేసుకుంది. నవాబుపేట్ ఎస్సై గిరి తెలిపిన వివరాల ప్రకారం.. నవాబుపేట్ మండలం మాదిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో బ్లూ కోట్ సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా, నవాబుపేట్ వైపు నుండి వస్తున్న అశోక్ లీ ల్యాండ్ వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. వాహనంలో కలప ఉండటంతో డ్రైవర్ను అనుమతి పత్రాలు చూపాలని అడిగారు. డ్రైవర్ ఎలాంటి అనుమతి పత్రాలు లేవని సమాధానం ఇవ్వడంతో అక్రమంగా కలప తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో వాహనాన్ని పోలీస్ స్టేషన్కు తరలించి కేసు నమోదు చేసి, ఫారెస్ట్ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై గిరి తెలిపారు. అర్ధరాత్రి సమయంలో అనుమతులు లేకుండా అడవి సంపదను అక్రమంగా తరలించే ప్రయత్నాలు పెరుగుతున్న నేపథ్యంలో పోలీసులు నిరంతర పెట్రోలింగ్ చేపట్టి అక్రమ రవాణాను అడ్డుకుంటున్నారు. ఈ సంఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది.

## ఈ ప్రయాణం..
# నరకయాతన

**రుద్రారం నుండి గట్టేపల్లి వరకు వాహనాలకు.. గుంతల రోడ్డు**

- పత్తాలేని ఆర్అండ్ బి అధికారులు..?
- అధికారులు ఉన్నట్టా లేనట్టా.?
- భయం గుప్పెట్లో వాహనదారులు..?



**ధారూర్ మర్చి 26 (జనంసాక్షి) :** రుద్రారం నుండి గట్టేపల్లి వరకు రోడు అధ్వానంగా మారింది. దాదాపు కిలో మీటర్ వరకు అడుగడుగునా గుంతలే కనిపిస్తున్నాయి. గుంతల్లో నుండి వెళలాలంటే వాహనదారులకు చిరెత్తుకొస్తుంది. గుంతల రోడును పటించుకోవాలిన ఆర్అండ్ బి అధికారులు ఇటు వైపు చూడడం లేదు. అధికారులు ఉన్నారా లేరా...?ఉంటే ఎందుకు ఈ రోడును పట్టించుకోవడం లేదు కనీసం కన్నెత్తి చూడక పోవడంపై స్థానికులు ఆగ్రహానికి గురైతున్నారు. ఈ రోడ్డు ఇంత అద్వానంగా తయారైనా ఆర్అండ్ బి అధికారులకు చీమకుటినట్లుగా లేకపోవడం గట్టే పల్లి ప్రజల సహనాన్ని పరీక్షించూడే అని ప్రజలు అంటున్నారు. ఆర్ఆండ్బి అధికారులు రోడును పటించుకోకపోవడంతో దారుణంగా తయారైంది. అనేక మంది బతుకుతెరువు కోసం ప్రతి రోజు ధారూర్ వికారాబాద్కు వెళుంటారు. జనం మరింత పెరిగి రోడ్డులు సైతం సరిపోవడంలేదు. ఈ రోడ్డులో ప్రయాణికులు వెళ్ళాలంటే గుంతలను చూసి చిర్రెత్తుకొస్తున్నారు. గుంతల్లో వాహనాలు పడి పాడౌతుండడం, దుమ్ము, దూలి ముక్కులోకి, వెళ్లి అనేక అనారోగ్య సమస్యలు వస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం తాత్కాలికంగా పరిష్కారం చేయకపోవడంపై మండిపడుతున్నారు. ఆర్ఆండ్బి ఆధికారులు రోడ్డును వేయించాలని మోరపెట్టుకుంటున్నారు.






# న్యాయం కోసం ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా?

- ఆడపిల్లకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు
- అక్రమ అరెస్టులపై తీవ్రంగా స్పందించిన మాజీ మంత్రి

**వనపర్తి బ్యూరోమార్చి 26 జనం సాక్షి :**
ఆడపిల్లకు జరిగిన అన్యాయంపై ప్రశ్నిస్తే అక్రమ అరెస్టు చేస్తారా అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సోమవారం నాడు బాలికపై జరిగిన లైంగిక దాడిపై ప్రశ్నించడానికి వెళ్లిన నాయకులపై యజమాన్యంతో చేతులు కలిపి అక్రమంగా కేసులు పెట్టారని తీవ్ర స్థాయిలో ధ్వజం ఎత్తారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని టౌన్ పోలీస్ స్టేషన్ లో, అక్రమ కేసు లో అరెస్టు చేసిన నాయకులను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కలిసి ధైర్యం చెప్పారు. బాలికపై జరిగిన అత్యాచారాన్ని ప్రశ్నించడానికి వెళ్లిన నాయకులు నందిమల్ల అశోక్, చీర్ల చందర్, మెకానిక్ శ్రీనులతో పాటు మరో ఆరుగురిని అక్రమంగా అరెస్ట్ చేసిన నేపథ్యంలో వనపర్తి పట్టణ పోలీస్ స్టేషన్లో వారిని కలిసి ధైర్యాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, మాట్లాడుతూ ఆడపిల్లపై, అత్యాచారం చేసిన నిందితున్ని యాజమాన్యాన్ని కాపాడాలని, కాంగ్రెస్ సర్కారు చేసిన భారీ కుట్రలో బాగంగా నాయకులను అరెస్ట్ చేశారని, వారిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వపరంగా బాధిత బాలికకు, కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి, వాకిటి శ్రీధర్, పట్టణ పార్టీ అధ్యక్షులు పలుస రమేష్ గౌడ్, ప్రేమ్ నాథ్ రెడ్డి, లక్ష్మీనారాయణ, ఉంగ్లం తిరుమల్ మున్సిపల్ కౌన్సిలర్లు మురళి సాగర్ ,శ్రీకర్ గౌడ్ చింటూ సమద్, స్టార్ రహీం, కే మాణిక్యం, సయ్యద్ జమీల్, ధర్మనాయక్, దేగ మహేశ్వర్ రెడ్డి, నారాయణ నాయక్, హేమంత్ ముదిరాజ్, జోహార్ హుస్సేన్, సూర్యవంశం గిరి, యుగంధర్ రెడ్డి, చిట్యాల రాము, సునీల్ వాల్మీకి, ముద్దు సార్, అలీమ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
27 మార్చి 2026

# ఏసీబీ వలలో అవినీతి చేప!

**రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ మామడ ఎస్ఐ అశోక్**



**నిర్మల్ బ్యూరో, మార్చి26 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లా మమడ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై అశోక్ అవినీతి ఆరోపణల్లో చిక్కుకుని, ఏసీబీ అధికారుల వలలో పడిన ఘటన జిల్లాలో సంచలనంగా మారింది. గురువారం జరిగిన ప్రత్యేక ఆపరేషన్‌లో, లంచం స్వీకరిస్తున్న సమయంలో ఎస్సై అశోక్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆదిలాబాద్ ఏసీబీ డీఎస్పీ మధు వివరాల ప్రకారం, మొండిగుట్ట గ్రామానికి చెందిన తిరుపతి అనే వ్యక్తికి సంబంధించి భూమి రిజిస్ట్రేషన్ వ్యవహారంలో వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో తిరుపతిపై చీటింగ్ కేసు నమోదు చేయకుండా ఉండేందుకు, అలాగే రియల్టర్‌తో భూమి సెటిల్‌మెంట్ చేయించేందుకు ఎస్సై అశోక్ మధ్యవర్తిత్వం చేస్తానని చెప్పి ?40,000 లంచం డిమాండ్ చేశాడు. తరువాత జరిగిన బేరసారాల్లో ?20,000కు ఒప్పందం కుదిరినట్లు అధికారులు తెలిపారు. దీంతో విసిగిపోయిన బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. పథకం ప్రకారం అధికారులు, ఎస్సై అశోక్ లంచం స్వీకరిస్తున్న సమయంలో అతను నివసిస్తున్న పోలీస్ క్వార్టర్స్‌లోనే పట్టుకున్నారు. ఈ ఘటనతో మమడ పోలీస్ స్టేషన్‌పై ప్రజల్లో తీవ్ర చర్చ ప్రారంభమైంది. ప్రజలకు న్యాయం చేయాల్సిన బాధ్యత కలిగిన అధికారులే అవినీతికి పాల్పడటం ఆందోళన కలిగిస్తోంది. ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి, తదుపరి విచారణ కొనసాగిస్తున్నారు. ఎస్సై అశోక్‌ను కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

# శాసనసభ్యులకు క్రీడాపోటీలు

- 28, 29 తేదీల్లో రెండ్రోజుల పాటు నిర్వహణ
- మంత్రులు జూపల్లి, వాకిటి శ్రీహరి వెల్లడి



**హైదరాబాద్, మార్చి26 (జనంసాక్షి) :** రాష్ట్రంలో విద్యార్థులు యువకులు అన్ని వర్గాలకు క్రీడల ప్రాముఖ్యత తెలియజేసే విధంగా శాసన సభ్యుల క్రీడోత్సవాలు నిర్వహించబోతున్నామని రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి లు తెలిపారు. ఈనెల 28 29 తేదీల్లో జరగబోయే శాసనసభ్యులు శాసనమండలి సభ్యుల క్రీడా పోటీలు మొదటి ఎడిషన్ లెజిస్టేటర్ స్పోర్ట్స్ మీట్ 2026 నిర్వహణ సన్నాహక సమావేశం అసెంబ్లీలోని కమిటీ హాల్లో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ, అనునిత్యం రాజకీయాల్లో బిజీ ఉండే శాసన సభ్యులు శాసనమండలి సభ్యులకు ఈ క్రీడా పోటీలు ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని ఇవ్వడమే కాకుండా రాష్ట్ర ప్రజల్లో క్రీడా స్ఫూర్తిని క్రీడల పట్ల అవగాహన కలిగించేందుకు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించబోతున్నామని వారు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ పోటీలు మొట్టమొదటి సారిగా నిర్వహిం చబో తున్నామని, పార్టీలబేధ భావాలు పక్కనపెట్టి శాసనసభ్యులు అందరూ ఈ క్రీడల్లో పాల్గొన్న పోతున్నారని వారు తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాల వారికి వయసుల వారికి క్రీడల పట్ల అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. ఇందుకోసం శాసనసభ సచివాలయం తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ, రాష్ట్ర సాంస్కృతిక శాఖ తోపాటు వివిధ శాఖల సమన్వయంతో శాసనసభ్యులకు వివిధ క్రీడాంశాల్లో పోటీలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబోతున్నామని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో శాసనమండలి విప్ అద్దంకి దయాకర్ శాసనసభ్యులు ఎమ్మెస్ రాజ్ ఠాకూర్ యశస్విని రెడ్డి , పాల్వాయి హరీష్ రావు, శాసనమండలి సభ్యులు తాత మధుసూదన్ రావు భాను ప్రసాద్ రావు, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి శాసనమండలి కార్యదర్శి నరసింహచార్యులు శాసనసభ కార్యదర్శి ఆర్ తిరుపతి వివిధ క్రీడా వివిధ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మొదటి ఎడిషన్ లెజిస్టేటర్ స్పోర్ట్స్ మీట్ 2026 ప్రారంభ వేడుకలు ఎల్బీ స్టేడియంలో 28వ తేదీ మధ్యాహ్నం మూడున్నర గంటలకు ప్రారంభమవుతాయని సీఎం రేవంత్ రెడ్డి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తోపాటు ఉభయ సభల వివిధ పక్ష నేతలు విప్ లు అన్ని పార్టీల శాసనసభ్యులు శాసనమండలి సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొనబోతున్నారు.

# నగరంలో శోభాయాత్రకు భారీగా ఏర్పాట్లు

- యాత్ర మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు

**హైదరాబాద్, మార్చి 26 (జనంసాక్షి) :** శ్రీరామనవమి శోభాయాత్ర సందర్భంగా హైదరాబాద్ నగరంలో శుక్రవారం ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి. సీతారాం బాగ్ దేవాలయం నుంచి కోఠిలోని హనుమాన్ వ్యాయామశాల వరకు శోభాయాత్ర జరగనుంది. ఈ మార్గంలో వాహనాలకు అనుమతి ఉండదు. శోభాయాత్ర సమయంలో ట్రాఫిక్‌ను ఇతర మార్గాల్లోకి మళ్లించనున్నారు. సీతారాం బాగ్, బోయిగూడ కమాన్ నుంచి మల్లేపల్లి ఎక్స్ రోడ్స్ వైపు ట్రాఫిక్ మళ్లించనున్నారు. మంగళ్‌హాట్, గాంధీ విగ్రహం, పురానాపూల్, జుమేరాత్ బజార్ నుంచి వచ్చే వాహనాలను టక్కర్‌వాడీ జంక్షన్ వైపు డైవర్ట్ చేయనున్నారు. ఎంజే బ్రిడ్జ్, బేగంబజార్, అఫ్జల్‌గంజ్, సిటీ కాలేజీ వైపు వెళ్లే వాహనాలను జుమేరాత్ బజార్ మీదుగా మళ్లించనున్నారు. అబిడ్స్ జీపీఓ, సుల్తాన్ బజార్, కోఠి, అబిడ్స్ ప్రధాన రోడ్ల వద్ద ట్రాఫిక్‌ను నిలిపివేయనున్నారు. బేగంబజార్, అఫ్జల్‌గంజ్, ఎంజే మార్కెట్, కోఠి, కాచిగూడ ప్రాంతాల్లోనూ ట్రాఫిక్ రద్దీగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా చర్యలు తీసుకునేందుకు హైదరాబాద్ పోలీసులు సిద్ధమవుతున్నారు. సీతారాంబాగ్ టెంపుల్ నుంచి సుల్తాన్‌బజార్ వరకు జరిగే ఈ శోభాయాత్ర మార్గంలో వాహనాలకు మళ్లింపులు అమలు చేస్తారు. ప్రత్యేకంగా బేగంబజార్, అఫ్జల్‌గంజ్, ఎంజే మార్కెట్, కోఠి, కాచిగూడ ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ ఉండే అవకాశం ఉంది. ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించాలని, ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని అధికారులు సూచించారు. శ్రీరామనవమి శోభాయాత్రను అత్యంత వైభవంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సర్వం సిద్ధమయ్యారు. 2010లో ప్రారంభమైన ఈ యాత్ర అతి తక్కువ కాలంలోనే దేశవ్యాప్త గుర్తింపు పొందిందని, సీతారాం బాగ్ నుంచి హనుమాన్ వ్యాయామశాల వరకు సాగే ఈ వేడుకను భక్తులు క్రమశిక్షణతో జరుపుకోవాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ కోరారు.

# నిజాంపేట్, పేట్‌బషీరాబాద్ స్థలాలే కేటాయించాలి

- మోసం చేసిన కమిటీ పెద్దలపై విచారణ జరిపి శిక్షించాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జెఎన్‌జేహెచ్ఎస్ సభ్యుల విజ్ఞప్తి





**హైదరాబాద్, మార్చి 26 (జనంసాక్షి) :** వెయ్యి మంది జర్నలిస్టుల కుటుంబాలను రోడ్డున పడేసే కమిటీ పెద్దల కుట్రలపై విచారణ జరిపించాలని... పేట్ బషీరాబాద్, నిజాంపేట్ స్థలాలనే కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టు హౌజింగ్ సొసైటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్టు హౌజింగ్ సొసైటీ సభ్యులు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. 16 ఏళ్ల నుంచి తాము పడుతున్న కష్టాలను మీడియా ముందు వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీరే మాకు దిక్కంటూ వేడుకున్నారు. సొసైటీ ఏర్పడిన నాటి నుంచి సభ్యులను కమిటీ పెద్దలు మభ్యపెడుతూ కుట్రలకు పాల్పడ్డారని.. ప్రభుత్వాలు ఇచ్చిన నిజాంపేట్, పేట్ బషీరాబాద్ స్థలాలను కుట్రపూరితంగా డెవలప్ చేయకుండా అక్రమాలకు పాల్పడ్డారని జెఎన్‌జే హెచ్ ఎస్ సభ్యులు ఆరోపించారు. నిజాంపేట్, పేట్ బషీరాబాద్ స్థలాల్లో అక్రమ కట్టడాల వెనకాల అప్పటి కమిటీ పెద్దలు ఉన్నారని, వారిపై విచారణ చేపడితే వారి మోసాలన్నీ బయటకు వస్తాయన్నారు.

2008లో జెఎన్‌జే సొసైటీ ఏర్పడిన తర్వాత ఒక్కక్కరి నుండి 2లక్షల చొప్పున దాదాపు 23 కోట్ల రూపాయలు వసూలు చేశారని, అందులో 12.33 కోట్ల రూపాయలు మాత్రమే ప్రభుత్వ ఖజానాకు జమ చేశారన్నారు. అప్పటి నుండి సభ్యుల డబ్బులను దుబారా చేయడమే కాకుండా...ఎలాంటి జీబీలు, సమావేశాలు, ఎన్నికలు నిర్వహించకుండా ఏకపక్షంగా సొసైటీని నడిపించారని ఆరోపించారు. సభ్యులు అఫిడవిట్ ఇచ్చి స్థలాలు తీసుకోవచ్చని 2010లో హైకోర్టు చక్కని రూలింగ్ ఇచ్చినా... సభ్యులకు తెలియజేయకుండా దాచిపెట్టడమే గాక, కనీసం జీబీ లేకుండా సుప్రీంకోర్టుకు తీసుకెళ్లారని జర్నలిస్టు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. 2017లో డెవలప్ చేసుకోవచ్చని, 2022లో నిర్మాణాలు చేపట్టవచ్చని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా ఆ తీర్పును కాలదోషం పట్టించి సభ్యులను కమిటీ పెద్దలు నిండా ముంచారని తెలిపారు. మరోవైపు నిజాంపేట్ , పేట్ బషీరాబాద్‌లో అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తూ లాభం పొందినట్లు సభ్యులు ఆరోపించారు.

**ముఖ్యమంత్రి మీరే దిక్కు..**
**అపాయింట్ మెంట్ ఇస్తే కష్టాలు చెప్పుకుంటాం**

పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నపుడు రేవంత్ రెడ్డి దృష్టికి తమ సమస్యను తీసుకెళితే సావధానంగా విని, అధికారంలోకి వచ్చిన వెంటనే పేట్‌బషీరాబాద్ స్థలాన్ని అప్పగించినందుకు సభ్యులు మరోసారి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం ఎంతో ఉదారంగా ఇచ్చిన స్థలాన్ని కూడా కమిటీ పెద్దలు కుట్రపూరితంగా హ్యాండోవర్ చేసుకోకుండా తమ పొట్ట కొట్టారని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిటీ పెద్దల తీరుతో ఇప్పటికే చాలా అన్యాయమై పోయిన తమను ముఖ్యమంత్రి ఆదుకోవాలని, ఏ స్థలాల కోసం 16 ఏళ్ల కిందట డబ్బులు కట్టామో వాటిని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో ఉద్యోగ బాధ్యతలు చూస్తున్న జర్నలిస్టులకు నగరానికి సుదూరంగా ఇవ్వడం సరికాదన్నారు. ఇక్కడ కూడా బడుగు జర్నలిస్టుల పొట్టకొట్టడానికి బడా జర్నలిస్టుల పేరిట అవే కుట్రలు జరుగుతున్నాయని, వారిని దూరంగా ఉంచాలని ముఖ్యమంత్రిని కోరారు. ఇప్పటికే దాదాపు 90 మంది సభ్యులు చనిపోయారని, మరో 200 మందికి పైగా జర్నలిస్టులు వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి అపాయింట్ మెంట్ ఇస్తే... 16 ఏళ్ల నుంచి తమపై జరుగుతున్న మోసాలు, తాము పడుతున్న కష్టాలను వివరిస్తామని జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ సభ్యులు వేడుకున్నారు.



# నిమ్స్‌లో గద్దర్ భార్య విమల

- పరామర్శించిన భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, మార్చి26 (జనంసాక్షి) :** దివంగత ప్రజా గాయకుడు గద్దర్ సతీమణి విమల నిమ్స్‌లో గాల్ బ్లాడర్ సమస్యతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. మూడు రోజుల క్రితం నిమ్స్‌లో చేరిన విమలకి శుక్రవారం సర్జరీ జరిగింది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌లు క్రితం నిమ్స్‌లో డైరెక్టర్ బీరప్పను కలిసి విమలకు అందుతున్న వైద్య సేవలు గురించి ఆరా తీశారు. విమల వెంట కుమారుడు సూర్యం కుటుంబ సభ్యులు ఉన్నారు.

## మార్కాపురం బస్సు ఘటనపై మంత్రి పొంగులేటి విచారం

**హైదరాబాద్, మార్చి26 (జనంసాక్షి) :** ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం జిల్లా పరకాల క్వారీ సమీపంలో టిప్పర్‌ను ఢీకొని జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం అత్యంత బాధాకరం అని పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. 'ప్రమాదంలో బస్సు అగ్నికి ఆహుతి కావడంతో పలువురు ప్రయాణికులు ప్రాణాలు కోల్పోవడం, మరికొందరు తీవ్రం గా గాయపడటం మనసును తీవ్రంగా కలచి వేసింది. విషాద ఘటనలో మృతుల కుటుం బాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజే స్తున్నాను. బాధిత కుటుంబాలకు ధైర్యం చేకూరాలని ప్రార్థిస్తున్నాను. గాయపడిన వారికి అత్యవసర మెరుగైన వైద్యం అందించేందుకు ఏపీ ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను' అని పేర్కొన్నారు.

# బాలకృష్ణకు అరుదైన గౌరవం

- జీవిత సాఫల్య పురస్కారం అందజేత



**న్యూఢిల్లీ, మార్చి26 (జనంసాక్షి) :** నందమూరి బాలకృష్ణ కెరీర్లో ఆయనకు మరో అరుదైన గౌరవం వచ్చి చేరింది. న్యూఢిల్లీలోని భరత్ మండపంలో అట్టహాసంగా జరిగిన అంతర్జాతీయ ఢిల్లీ చలనచిత్రోత్సవం 2026 వేడుకల్లో బాలకృష్ణను 'భైరవ-రుద్ర' జీవిత సాఫల్య పురస్కారం'తో ఘనంగా సత్కరించారు. సినిమా రంగంలో యాభై ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న బాలకృష్ణ పౌరాణిక పాత్రల్లో తండ్రికి తగ్గ తనయుడిగా మెప్పించడమే కాకుండా, మాస్ ఎంటర్‌టైనర్లతో బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించడం ఆయనకే చెల్లింది. మార్చి 25న జరిగిన ఈ వేడుకలో ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా చేతుల మీదుగా బాలయ్య ఈ అవార్డును అందుకున్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన 'భగవంత్ కేసరి' 71వ జాతీయ చలనచిత్ర పురస్కారాలలో 'ఉత్తమ తెలుగు చిత్రం'గా నిలిచి సంచలనం సృష్టించింది. కళారంగానికి బాలకృష్ణ చేసిన విశేష కృషిని గుర్తిస్తూ 2025లో భారత ప్రభుత్వం దేశ మూడవ అత్యున్నత పౌర పురస్కారం 'పద్మభూషణ్'తో గౌరవించింది. నటుడిగానే కాకుండా సేవా కార్యక్రమాలతో (బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి), రాజకీయ నాయకుడిగా కూడా బాలకృష్ణ తనదైన ముద్ర వేశారు.



# పంటపొలాల్లోనే ఏనుగుల తిష్ట

**చిత్తూరు, మార్చి26 (జనంసాక్షి) :** చంద్రగిరి మండలం, ఎగువ కూచివారిపల్లె పంట పొలాల్లో పగలు కూడా ఏనుగులు తిష్ట వేస్తున్నాయి. దీంతో రైతులు విలవిలలాడిపోతున్నారు. కొన్ని రోజులుగా ఏనుగుల మంద గ్రామంలోని పంట పొలాలపై పడి బీభత్సం సృష్టిస్తోంది. సాధారణంగా రాత్రి వేళల్లో వచ్చే ఏనుగులు, ఇప్పుడు ఏకంగా పట్టపగలే పొలాల్లో తిష్టవేస్తుండటంతో రైతులు ప్రాణభయంతో వణికిపోతున్నారు. బుధవారం ఎగువ కూచువారి పల్లె రైతుల పొలాల్లో ఏనుగులు మామిడి తోటలు, ఇతర పంటలను తొక్కి వేయడమే కాకుండా, చెట్ల కొమ్మలను విరిచివేసి భారీ నష్టాన్ని కలిగించాయి. సాగునీటి పైపులను, మోటార్లను సైతం ధ్వంసం చేస్తున్నాయి.

అటవీ శాఖ అధికారులు తక్షణమే స్పందించి ఏనుగులను అడవిలోకి మళ్లించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. పంట నష్టపోయిన తమకు ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.



# లోక్‌భవన్‌లో మహాస్టమి వేడుకలు

- శక్తి స్వరూపిణి అమ్మవారి పూజ
- పూజలో పాల్గొన్న గవర్నర్ దంపతులు

**హైదరాబాద్,మార్చి26 (జనంసాక్షి) :** శ్రీరామ నవమిని పురస్కరించుకుని చైత్ర నవరాత్రి మహాష్టమి వేడుకలు దివ్యశక్తి ఆరాధనకు ప్రతీక అని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. గురువారం లోక్ భవన్ అధ్వర్యంలో తెలంగాణలో తొలిసారిగా సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో చైత్ర నవరాత్రి మహాష్టమి ఫలహార వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తన సతీమణి జానకి శుక్లా తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. గత 35 సంవత్సరాలుగా తాను ఈ వేడుకల్లో భాగస్వామ్యం అవుతున్నానని, తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన తాను, ఈ పవిత్ర వేడుకను తొలిసారిగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. రానున్న రోజుల్లోనూ ఈ వేడుకలు తెలంగాణాలో కొనసాగాలని గవర్నర్ ఆకాంక్షించారు. వేడుకలలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ రఘునందన్ రావు,మాజీ గవర్నర్ దత్తాత్రేయ, బీజేపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, మల్క కొమురయ్య, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్,అదనపు డీజీపీ మహేష్ భగవత్,జిల్లా కలెక్టర్ హరి చందన, రాజ్ భవన్ సీనియర్ అధికారులు, ఇతర ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు

# సీఎంతో సామాజిక కార్యకర్త నిఖిల్ డే బృందం భేటీ



**హైదరాబాద్, మార్చి26 (జనంసాక్షి) :** తెలంగాణ శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని ప్రముఖ సామాజిక కార్యకర్త నిఖిల్ డే బృందం కలిసింది. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పలు కార్యక్రమాలను నిఖిల్ డే ప్రశంసించారు. ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో చేపడుతున్న ప్రజా వాణి కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ స్థాయికి తీసుకెళ్ళేందుకు ఈ భేటీలో సమాలోచనలు జరిగాయి. అందుకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. రాజస్థాన్ ప్రభుత్వం చేపడుతున్న జన్ సూచన పోర్టల్ తరహాలో తెలంగాణ లోనూ 'ప్రజా సూచన పోర్టల్ ' ఏర్పాటు చేయాలని చర్చ జరిగింది. వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపడుతున్న అన్ని పథకాలకు సంబంధించిన వివరాలను ఒకే చోటఈ పోర్టల్ లో అందుబాటులో ఉంచుతారు. ఐటీ శాఖ ద్వారా ఈ పోర్టల్ ను అభివృద్ధి చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.తెలంగాణ గిగ్ వర్కర్స్ బిల్ ను నిఖిల్ డే ప్రశంసించారు. ఈ బిల్ దేశంలోనే చారిత్రాత్మకంగా నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నా రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు దాన కిషోర్, వి. శేషాద్రి, బి. అజిత్ రెడ్డి, మాణిక్ రాజ్, దివ్య దేవరాజన్, వేముల శ్రీనివాసులు పాల్గొన్నారు.





Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370